నేటి దినపత్రిక సూర్య



visit us @ http://epaper.suryaa.com
www.suryaa.com
సంపుటి 12 | సంచిక 79
శుక్రవారం | 18 జనవరి 2019 | విజయవాడ
| పేజీలు 12+16+16 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, శుక్ల పక్ష తిథి : ద్వాదశి సా.5.24 నక్షత్రం. రోహిణి ఉ.10.32, వర్జ్యం తె.5.23 నుంచి
రాహుకాలం: ఉ.10.30 నుంచి 12.00 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు తిరిగి మ.12.44 నుంచి 1.12 వరకు, సూర్యోదయం : ఉ.6.38 గం; సూర్యాస్తమయం: సా.5.49

అనూహ్య విజయం



- బ్రెగ్జిట్‌లో ఓడినా, విశ్వాస పరీక్షలో గెలిచిన థెరీసా మే
- బ్రెగ్జిట్ బిల్లులో 432-202 తేడాతో ఓటమి
- విశ్వాస పరీక్షలో 325 - 302 తేడాతో విజయం
- ప్రధాని పదవికి ఇబ్బంది లేనట్టే

వివరాలు 11లో

అరుణ్ జైట్లీజీ అండగా ఉంటాం



- ఈ కష్టకాలంలో మీతో, మీ కుటుంబంతో ఉంటాం
- రాహుల్ గాంధీ
- జైట్లీ అనారోగ్యం వార్తతో ఆవేదనకు గురయ్యా
- ఆయన త్వరగా కోలుకోవాలన్న రాహుల్
- సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వస్తారన్న ఒమర్ అబ్దుల్లా

వివరాలు 11లో


సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

ఏకమైన అసూయాపరులు

- ఏపీలో జరుగుతున్న అభివృద్ధిపై అక్కసుతోనే వైసీపీ, బీజేపీ, టీఆర్ఎస్ కుట్రలు
- టీడీపీ బాధ్యులు, ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
- భయపడుతున్న కేసీఆర్

ఎలక్షన్ మిషన్ 2019పై టీడీపీ బాధ్యులు, ప్రజాప్రతినిధులతో ఏపీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉండవల్లిలోని తమ నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆదర్శాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అంటే నరేంద్రమోడీకి అసూయ. గుజరాత్‌కన్నా ఏపీ మించిపోతుందనే భయం.



(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి): ఏపీ అభివద్ధి చెందకూడదని కేసీఆర్ పంతం. తన చేతగాని తనం భయటపడుతుందని కేసీఆర్‌కు భయం. తన కేసుల్లో జైలుకు వెళ్లాల్సి వస్తుందని జగన్‌కు భయం. అసూయపరులంతా ఏకమయ్యారు. అక్కసుతోనే వైసీపీ, బీజేపీ, టీఆర్ఎస్‌లు కుట్రలు చేస్తున్నాయి. ఒకే చోటుకు చేరి ఏపీపై కుట్రలు పన్నుతున్నారు. గద్దల మాదిరిగా ఏపీపై వాలి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారు. మతాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రెచ్చగొట్టారు. ఇప్పుడు ఏపీలో కులాల మధ్య చిచ్చు రగిలిస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందనలేదు. హడావుడిగా నిన్న జగన్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ భేటీతో టీఆర్ఎస్, వైసీపీ ముసుగు తొలగిపోయిందన్నారు. బీజేపీ వ్యతిరేక ఓటు చీల్చాలని కుట్రలు పన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కాకుండా కుతంత్రాలు చేస్తున్నారు. బీజేపీ అజెండా అమలుకే ఫెడరల్ ఫ్రంట్. పార్టీలను గందరగోళ పరిచి, ప్రజల్లో అయోమయం పెంచడం వీరి లక్ష్యం. తెదేపాపై షర్మిల ఫిర్యాదు చేయడం దురదష్టకరం. సామాజిక మధ్యమాన్ని దుర్వినియోగం చేసింది వైసీపీనే. సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం చేసింది ఆ పార్టీనే . సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణపై మొదట్లోనే వైసీపీ దుష్ప్రచారం చేసింది. జగన్‌పై విచారణ సాగకుండా చేయాలని కుట్రలు చేశారు. దర్యాప్తు అధికారులను ఇబ్బందులకు గురి చేశారు. చివరికి న్యాయమూర్తులపై కూడా దుష్ప్రచారానికి తెగబడ్డారు. పవన్‌కల్యాణ్ పెళ్లిళ్లపై అసభ్యంగా ప్రచారం చేశారు. టీడీపీ మహిళా నేతలపై అసభ్యంగా మాట్లాడారు. నా కుటుంబ సభ్యులపై కూడా దుష్ప్రచారం చేశారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించేది లేదు. పార్టీలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు.

తలసాని వ్యాఖ్యలపై చంద్రబాబు ఆగ్రహం : ఏపీ పర్యటనలో టీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు అగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాల్లో మొక్కులకు వచ్చి రాజకీయ వ్యాఖ్యలు చేస్తారా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నేతల ఏపీ పర్యటనల్లో టీడీపీ నేతలు పాల్గొనవద్దని సూచించారు. ఎవరైనా పాల్గొంటే కఠినంగా వ్యవహరిస్తామని

మిగతా 6లో

ఫిబ్రవరి ఫైనల్

లోక్‌పాల్ నియామకంపై సుప్రీం కోర్టు గడువు



- అభ్యర్థుల పేర్లను సిఫార్సు చేయండి
- సెర్చ్ కమిటీకి అత్యున్నత న్యాయస్థానం ఆదేశం
- కేసును గురువారం విచారించిన సీజేఐ రంజన్ గొగొయ్
- సెర్చ్ కమిటీకి జస్టిస్ ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం
- తదుపరి విచారణ మార్చి 7న

వివరాలు 6లో

డేరా బాబాకు జీవిత ఖైదు

- డేరా బాబా రామ్ రహీమ్‌కు జీవిత ఖైదు
- ఛత్రపతి హత్య కేసులో ఆయన దోషి
- పంచకుల స్పెషల్ సీబీఐ కోర్టు తీర్పు
- వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ
- హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో భద్రత కట్టుదిట్టం



వివరాలు 11లో

విద్యతోనే భవిష్యత్తు



- నాలెడ్జికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్
- ఐనవోలులో ఎక్స్ఎల్ఆర్ఐ క్యాంపస్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలెడ్జికి చిరునామాగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలోని ఐనవోలు వద్ద గురువారం దేశంలోని బి-స్కూల్స్‌లో ఒకటైన జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్-ఎక్స్ఎల్ఆర్ఐ క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఎక్స్ఎల్ఆర్ఐ దక్షిణ భారతదేశంలో మొదటి క్యాంపస్‌ని అమరావతిలో నెలకొల్పుతోందని, దాని నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఈ రోజు చాలా మంచి రోజన్నారు. 1949లో ప్రారంభమైన ఈ సంస్థకు జంషెడ్గపూర్, భువనేశ్వర్‌లలో క్యాంపస్‌లు ఉన్నాయని తెలిపారు.

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : మనం 50 ఎకరాల భూమి ఇస్తే రూ.235 కోట్లతో ఇక్కడ క్యాంపస్ నిర్మిస్తున్నారని చెప్పారు. దేశంలో అత్యున్నత విద్యా సంస్థగా ఈ క్యాంపస్ ఎదగాలన్నా ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యున్నత పరిశోధనా సంస్థలతో ఈ సంస్థ అవగాహనా ఒప్పందాలు చేసుకుంటుదని తెలిపారు. ఈ సంస్థ నిర్మించబోయే అంతర్జాతీయ పాఠశాలకు 8 ఎకరాల భూమి ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దేశంలోని టాప్ 20 విద్యా సంస్థలలో కనీసం పది సంస్థలకు ఇక్కడకు రప్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విట్, ఎస్ఆర్ఎం, అమత వంటి సంస్థలు వచ్చాయని, ఇప్పుడు ఎక్స్ఎల్ఆర్ఐ కూడా వచ్చిందన్నారు. భవిష్యత్‌లో దేశంలోని అత్యున్నత విద్యా సంస్థలన్నీ ఇక్కడే కొలువవుతాయని చెప్పారు. నాలెడ్జిపై పెట్టుబడులు పెడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజధాని అమరావతి నాలెడ్జి ఎకనామికీ కేంద్రంగా అభివద్ధి చెందుతుందని చెప్పారు. నాలెడ్జి ద్వారానే అన్ని రంగాల్లో సమర్థవంతమైన నాయకత్వం పెంపొందుతుందన్నారు. ఏ రాష్ట్రానికైనా రాజధాని ఆస్తి అన్నారు. అటువంటి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల చొరవ, త్యాగం రాష్ట్రం మరువదని చెప్పారు. ఇప్పటి వరకు చదువులు, ఉద్యోగాల కోసం మనం ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లేవారమని, ఇక ముందు ప్రపంచమే మన వద్దకు వస్తుందన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రం ఐఐటి, ఐఐఎం, వ్యవసాయ విశ్వవిద్యలయం, ఏఐఎంఎస్ వంటి 11 విద్యాసంస్థలను ఏర్పాటు చేయవలసి ఉందని చెప్పారు. వాటి కోసం 2,912 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా వాటి కాంపౌండ్ల వాల్స్ కోసం రూ.132 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దేశంలోని వంద టాప్ విశ్వవిద్యాలయాలలో ఆరు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు తెలిపారు. 30 దేశాలు 679 మంది విద్యార్థులను ఎంపిక చేస్తే

మిగతా 6లో

రథయాత్రకు బదులు పాదయాత్ర

- పశ్చిమ బెంగాల్‌లో అమిత్ షా స్థానంలో యోగికి అవకాశం
- స్వైన్ ఫ్లూతో బాధపడుతున్న అమిత్ షా
- 20 నుంచి పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభం కానున్న బీజేపీ ర్యాలీలు
- అమిత్ కోలుకోకపోతే యోగి నేతృత్వంలో యాత్రలు
- ఫిబ్రవరి 8న జరిగే ర్యాలీకి ప్రధాని మోడీ హాజరు



వివరాలు 11లో

రిలయన్స్‌కు లాభించిన జియో

- మూడు నెలల్లో రూ. 10 వేల కోట్లకుపైగా లాభం
- ఇంత లాభం నమోదు చేసిన తొలి భారత కంపెనీగా రికార్డు
- గత సంవత్సరంతో పోలిస్తే 9.1 శాతం పెరిగిన ఆదాయం
- భారత కంపెనీల లాభాల్లో సరికొత్త చరిత్ర




వివరాలు 5లో

అంతే ఇంతే!



విదేశీయాత్రలు మానుకుని మన చుట్టూ తిరగడమే బెటర్ అనుకున్నారేమో

కొలువుదీరిన కొత్త సభ



- ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రొటెం స్పీకర్
- ఇంగ్లీష్ అక్షరక్రమంలో ప్రమాణం
- ముందుగా సీఎం కేసీఆర్ 'దైవసాక్షి'గా ప్రమాణం
- కొంత మంది పవిత్ర హృదయంతో ప్రమాణం
- వీల్‌చైర్‌పై వచ్చి ప్రమాణం చేసిన ఎమ్మెల్యే సాయన్న
- ప్రమాణానికి అయిదుగురు గైర్హాజర్
- కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనే నేను...
- ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం

తెలంగాణ కొత్త సభ కొలువుదీరింది. కొత్త సభ భారీ బందోబస్తుమధ్య ప్రారంభమైంది. ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యేలతో స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. ముందుగా.. సీఎం కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అనే నేను.. "శాసనసభ సభ్యునిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని భారతదేశ సార్వభౌమాధికారాన్ని సమగ్రతను కాపాడుతానని నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను".

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ శాసనసభ సభ్యుడినైన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అనే నేను.. సభ నియమాలకు కట్టుబడి ఉంటానని వాటిని అనుసరిస్తానని సభ మర్యాదలను పాటిస్తానని సాంప్రదాయాలను గౌరవిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.. అంటూ సీఎం కేసీఆర్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఇంగ్లీష్‌అక్షరమాల క్రమంలో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ కొత్తసభకు ఎన్నికైన వారితో ప్రమాణం చేయించారు. టీఆర్ఎస్ సభ్యురాలు ఆజ్మీరారేఖ ఇంగ్లీష్‌లో ప్రమాణ స్వీకారం చేయగం, కాంగ్రెస్ సభ్యురాలు ధనసరి అనసూయ(సీతక్క) తెలుగుతో పవిత్ర హృదయం సాక్షిగా ప్రమాణం చ ఏయించారు. అనంతరం ఇంగ్లీస్ అక్షరమాల క్రమంలో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 114 మంది సభ్యులు ప్రమాణం చేశారు. ఆరుగురిలో ప్రొటెం స్పీకర్ ముంతాజ్‌అహ్మద్‌ఖాన్‌చే గవర్నర్ ప్రసంగం చేయించిన విషయం విధితమే!. మిగతా

మిగతా 6లో



అసెంబ్లీకి హాజరుకాని ఐదుగురు ఎంఎల్ఎలు

- వీల్‌చైర్‌పై వచిన ఎమ్మెల్యే సాయన్న
- కాలునొప్పితో బాధపడుతూ వచ్చిన దానం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభమయ్యాయి. ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఎన్నికైన ఎంఎల్ఎల చేత ప్రమాణస్వీకారం చేయించారు. గురువారం జరిగిన ప్రమాణ స్వీకారంలో ఐదుగురు ఎంఎల్ఎలు హాజరు కాలేదు. ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్, జాఫర్ హుస్సేన్, టీఆర్ఎస్ మాధవరం కృష్ణారావు వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేదు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నానని అందుకే హాజరు కాలేకపోతున్నానని టీడీపీకి చెందిన సత్తుపల్లి ఎంఎల్ఎ సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. గోషామహల్ ఎంఎల్ఎ రాజాసింగ్ స్పీకర్ ఎన్నిక పూర్తియిన తరువాత ప్రమాణం చేస్తానని ప్రకటించిన విషయం విదితమే. సభకు ఎక్కువ సార్లు ఎన్నికైన సభ్యుడు సిఎం కెసిఆర్ ముందు వరుసలో ఉన్నారు. వయసు రీత్యా మాత్రం కొత్తగూడెం ఎంఎల్ఎ వనమా వెంకటేశ్వరరావు (73) సీనియర్‌గా ఉన్నారు. ఇల్లందు ఎంఎల్ఎ బానోతు హరిప్రియ అత్యంత పిన్న వయస్కురాలుగా నమోదయ్యారు. ప్రస్తుతం ఇద్దరు ఎంపిలు (బాల్క సుమన్, మల్లారెడ్డి) ఎంఎల్ఎలుగా ఎన్నికయ్యారు. పాతవారు 76 మంది సభ్యులుండగా, కొత్తవారు 27మంది సభ్యులు, ఉమ్మడి ఎపి అసెంబ్లీలో ఉండి ప్రస్తుతం ఎన్నికైన వారు 16 మంది, ఎంఎల్‌సిలుగా ఉండి ఎంఎల్ఎగా ఎన్నికైన వారు ముగ్గురున్నారు.















ముఖ్యమంత్రే సీనియర్

- 8సార్లు అసెంబ్లీకి ఎన్నికయిన నేతగా రికార్డు
- ఈసారి అసెంబ్లీకి 27 మంది కొత్త ముఖాలు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: సీఎం కేసీఆర్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 1983లో రాజకీయ అరంగేట్రం నుంచి నేటి వరకు మొత్తం ఎనిమిదిసార్లు (ఉప ఎన్నికలు కలుపుకుని) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అసెంబ్లీకి ఎన్నికైన వారిలో ముఖ్యమంత్రే సీనియర్. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసిన 1983 ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత వరుసగా అప్పటినుంచి 8సార్లు ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2009లో ఎంపీగా గెలిచారు. 1985 నుంచి ఇప్పటివరకు పోటీచేసిన అన్ని ఎన్నికల్లోనూ ఆయన గెలుపొందుతూ వస్తున్నారు. ఎనిమిదిసార్లు అసెంబ్లీలో అడుగుపెట్టిన కేసీఆర్ వివిధ పదవులను నిర్వర్తించారు. ఉపసభాపతిగా, మంత్రిగా, పీఏసీ చైర్మన్‌గా, అనేక కమిటీల్లో సభ్యునిగా, తెలంగాణ రాష్ట్ర మొదటి సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. కేసీఆర్ తర్వాత ఆరుసార్లు గెలిచిన నేతలుగా ముగ్గురు ఎమ్మెల్యేలు స్థానం సంపాదించారు. ప్రస్తుత ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్, సీనియర్ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావులు ఆరు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు.

అసెంబ్లీలో వివిధ పార్టీల బలాబలాలివి:

పార్టీ	2018	2014
టీఆర్ఎస్	88	63
కాంగ్రెస్	19	21
ఎంఐఎం	07	07
టీడీపీ	02	15
బీజేపీ	01	05
ఏఐఎఫ్‌బీ	01	00
ఇండిపెండెంట్	01	01
వైఎస్సార్‌సీపీ	03	
బీఎస్పీ	02	
సీపీఎం	01	
సీపీఐ	01	

ఇతర సభల నుంచి అసెంబ్లీకి : ఎంపీలుగా ఉన్న సీహెచ్ మల్లారెడ్డి, బాల్కసుమన్, ఎమ్మెల్సీలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, మైనంపల్లి హనుమంతరావులు ఈసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయితే, వీరిలో మైనంపల్లి గతంలో ఎమ్మెల్యేగా పనిచేయగా, మిగిలిన నలుగురూ శాసనసభకు కొత్తవారే కావడం గమనార్హం. 2014-18 మధ్య ఎమ్మెల్యేలుగా ఉన్నవారిలో 76 మంది మళ్లీ గెలవగా, 2009-2014 మధ్య ఎమ్మెల్యేలుగా గెలిచి 2014 ఎన్నికల్లో ఓడిపోయిన వారిలో 16 మంది తిరిగి అసెంబ్లీకి వస్తున్నారు. మొత్తంగా 27 కొత్తముఖాలు ఈసారి తొలిసారి ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నాయి.

వయసులో వనమా : ఎమ్మెల్యేల వయసును పరిశీలిస్తే కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు (73) వయసురీత్యా అందరికంటే పెద్దవారు. అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం (72), ముంతాజ్ అహ్మద్‌ఖాన్ (70)లు ఆయన తర్వాత పెద్దవారు. అయితే, ఈసారి అసెంబ్లీలో ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ (29) అత్యంత పిన్నవయస్కురాలిగా గుర్తింపు పొందారు. ఆమె తర్వాత పైలట్ రోహిత్‌రెడ్డి (34), బాల్కసుమన్ (35), గ్యాదరి కిశోర్ (37)లు ఉన్నారు. ఇక టీఆర్ఎస్ నుంచి ఒకరు, ఎంఐఎం నుంచి ఏడుగురు కలిపి మొత్తం 8 మంది మైనార్టీలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కాంగ్రెస్, టీఆర్ఎస్‌ల నుంచి ముగ్గురేసి మహిళా ఎమ్మెల్యేలు సభలో ఉండడం గమనార్హం.

నా అవసరం కేసీఆర్‌కు లేదు

సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: నా నియోజకవర్గ ప్రజలకోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలుస్తా.. నా అవసరం ముఖ్య మంత్రికి లేదు.. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అవసరం నాకుంది... అపాయింట్ మెంట్ ఇచ్చే వరకు వేచి చూస్తానని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి(జగ్గారెడ్డి) అన్నారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నా నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ వస్తే సన్మానం చేస్తానని, లేకుంటే సైలెంట్‌గా ఉంటానని ఆయన అన్నారు. అలాగే మా వాళ్లకి కూడా అనవసర వ్యాఖ్యలు చేయద్దని చెప్పానని, అంతేగాక నా స్టాండ్ కూడా ముందే ప్రకటించానన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చాక కామెంట్ చేయడం సరికాదని జగ్గారెడ్డి అన్నారు.

ఎన్‌టిఆర్‌ఎ నివాళికి గైర్హాజరైన ఎమ్మెల్యే సండ్ర



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఎన్టీఆర్‌కు నివాళి కార్యక్రమానికి టీడీపీ సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గైర్హాజర్ కావడం చర్చనీయాంశంగా మారింది. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ, పార్టీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర్‌రావు ఘాట్‌లో నివాళి అర్పించి అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. అయితే... ఈ కార్యక్రమంలో సత్తుపల్లి టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గైర్హాజర్ అయ్యారు. పార్టీ తరుపున కేవలం ఇద్దరే ఎమ్మెల్యేలు ఎన్నికవడం, అందులో ఒకరు గైర్హాజర్ కావడం పట్ల పలు ఊహగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా పంచాయతీ ఎన్నికల నామినేషన్ల వల్ల తాను హైదరాబాద్‌కు రాలేదని, అంతేతప్ప ఇందులో వేరే ఉద్దేశమేమీ లేదని సండ్ర పేర్కొన్నారు.

సీఎల్పీ నాకే ఇవ్వాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: కాంగ్రెస్ పార్టీలో తాను సీనియర్ నాయకుడినని, తనకే సీఎల్పీ ఇవ్వాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీకి కొత్త రూపం ఇవ్వాలన్నారు. కష్ట కాలంలో కూడా పార్టీని అంటి పెట్టుకుని ఉన్నానని చెప్పుకొచ్చారు. పార్టీలో కీలక పదవులలో ఉన్న చాలా మంది నేతలకు వాళ్ల కుటుంబసభ్యులే ఓట్లు వేయలేదని తెలిపారు. సీఎల్పీ నేత ఎన్నికలో రాహుల్ గాంధీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు.

సీఎల్పీ నేతగా కోమటిరెడ్డిని నియమించాలి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలంటే పార్టీలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కొత్తవారికి పార్టీ బాధ్యతలు అప్పగించాలని కోరారు. సీఎల్పీ నేతగా కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిని నియమించాలని చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు

ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణం చేయను

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ సమక్షంలో తాను ప్రమాణ స్వీకారం చేయనని భారతీయ జనతా పార్టీ గోషామహల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంఐఎం సిద్ధాంతాలు వేరు.. తమ సిద్ధాంతాలు వేరని అన్నారు. అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక పూర్తయిన తర్వాత,ఆయన సమక్షంలోనే తాను ప్రమాణ స్వీకారం చేస్తానని స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, ఈ అంశాన్ని పార్టీ దృష్టికి కూడా తీసుకెళ్తానని రాజాసింగ్ చెప్పారు.

తెలంగాణ అసెంబ్లీలో 27 కొత్త ముఖాలు

కొత్తవారిలో పిన్నవయస్సు కాంగ్రెస్ ఎమ్మెల్యే హరిప్రియ





హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిం 119 స్థానాలున్న తెలంగాణ అసెంబ్లీకి డిసెంబర్ 7న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ 88 స్థానాల్లో ఘన విజయం సాధించి తిరిగి అధికారంలోకి వచ్చింది. మహాకూటమి పేరుతో బరిలోకి దిగిన కాంగ్రెస్ 19 స్థానాలు, టీడీపీకి రెండు స్థానాల్లో విజయం సాధించగా.. ఎంఐఎంకి 7 స్థానాలు, బీజేపీ ఒక చోట, ఇతరులు రెండు చోట్ల విజయం సాధించారు. కాగా, ఈ ఎన్నికల్లో 27 మంది తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

తొలిసారి ఎమ్మెల్యేలు..

1. హరిప్రియ నాయక్ – కాంగ్రెస్ (ఇల్లందు)
2. నాగేశ్వరరావు – టీడీపీ (అశ్వరావు పేట)
3. సురేందర్, కాంగ్రెస్ – (ఎల్లారెడ్డి)
4. సుంకె రవిశంకర్, టిఆర్ఎస్ – (చొప్పదండి)
5. మెతుకు ఆనంద్, టిఆర్ఎస్ – (వికారాబాద్)
6 .రోహిత్ రెడ్డి, కాంగ్రెస్ – (తాండూరు)
7. హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ – (కొల్లాపూర్)
8. కాలేరు వెంకటేష్, టిఆర్ఎస్ – (అంబర్‌పేట్)
9. ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ – (పాలేరు)
10. మల్లారెడ్డి, టిఆర్ఎస్ – (మేడ్చల్)
11. బాల్క సుమన్, టిఆర్ఎస్ –(చెన్నూరు)
12. వైరా రాములు నాయక్, ఇండిపెండెంట్
13. కోరికంటి శంకర్, ఇండిపెండెంట్ (రామగుండం)
14. నరేందర్, టిఆర్ఎస్ – వరంగల్ వెస్ట్
15. పెద్ది సుదర్శన్ రెడ్డి, టిఆర్ఎస్ – (నర్సంపేట)
16. భేతి సుభాష్ రెడ్డి, టిఆర్ఎస్ – (ఉప్పల్)
17. ముఠా గోపాల్, టిఆర్ఎస్ – (ముషీరాబాద్)
18. కృఎష్ణమోహన్ రెడ్డి, టిఆర్ఎస్ – (గద్వాల్)
19. నరేందర్ రెడ్డి, టిఆర్ఎస్ –(కొడంగల్)
20. బొల్లం మల్లయ్య యాదవ్, టిఆర్ఎస్ – కోదాడ)
21.కంచర్ల భూపాల్ రెడ్డి, టిఆర్ఎస్ – (నల్గొండ)
22.డాక్టర్ సంజయ్, టిఆర్ఎస్– (జగిత్యాల)
23. క్రాంతి, టిఆర్ఎస్ –(అందోల్)
24. నిరంజన్ రెడ్డి, టిఆర్ఎస్ – (వనపర్తి)
25. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ – (మునుగోడు)
26.మానిక్ రావు జహీరాబాద్, టిఆర్ఎస్
27.కొప్పుల మహేష్ రెడ్డి, పరిగి – (టీఆర్ఎస్).

గులాబీ గూటికి ఒంటేరు?!

- నేడు పార్టీలో చేరే ఛాన్స్
- గజ్వేల్‌లో ప్రజాదరణ కలిగిన నాయకుడు
- అయినా రెండుసార్లు కేసీఆర్ చేతిలో ఓటమి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరన్న నానుడి ఉండనే ఉంది. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఈ విషయం ఇప్పటికే పలుమార్లు నిరూపితమయింది. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి రూపంలో మరోసారి నిరూపితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీ చేసి ఓటమి పాలయిన ఒంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్ గూటికి చేరనున్నారన్న ఊహగానాలు జోరందుకున్నారు. ముందస్తు ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి చరిత్ర సృష్టించాలని భావించిన ఒంటేరు మరోమారు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. గతంలో టీడీపీ అభ్యర్థిగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గజ్వేల్‌లో పోటీ చేసిన ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం గులాబీ బాస్ కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. గజ్వేల్‌లో ప్రజామద్దతు కలిగిన ఒంటేరు, టీఆర్ఎస్‌లో చేరడానికి తెరవెనుక కీలక పాత్ర పోషించిందెవరన్నది అంతుచిక్కని అంశంగా మారింది. అయితే తెరవెనుక మాజీమంత్రి హరీశ్‌రావు కీలక పాత్ర పోషించారన్న వాదనలు వినవస్తున్నాయి. ఒంటేరు పార్టీ మారాలనుకున్న తన మనసులోని మాటను నియోజవకర్గంలో కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడైన ఓ నేత చెవిలో వేశారని, ఆయన ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అధిష్టానానికి చేరవేయడం టీఆర్ఎస్ అధినేత సానుకూలంగా స్పందించారన్న ప్రచారం జరుగుతోంది.

కేసీఆర్ చేతిలో రెండు సార్లు ఓటమి : గజ్వేల్ నుంచి ఒంటేరు రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారు. 2014లో టీడీపీ తరపున పోటీ చేసిన ఒంటేరుపై, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 19 వేల పైలుకు మెజార్టీతో గెలుపొందారు. అయితే ఆ ఎన్నికల తర్వాత కేసీఆర్‌కు ఉండే మైనస్‌లన్నీ తనకు ప్లస్ అవుతాయని భావించిన ఒంటేరు, 2018 ముందస్తు ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. దీంతో ఒంటేరు శుక్రవారం తన అనుచరులు, అభిమానులు, ముఖ్య కార్తలతో భారీగా ఎత్తున గజ్వేల్ నుంచి ర్యాలీగా బయల్దేరి హైదరాబాద్‌కు చేరుకుని టీఆర్ఎస్‌లో చేరనున్నారని తెలుస్తోంది. అనంతరం ప్రగతిభవన్‌లో కేసీఆర్ సమక్షంలో ఒంటేరు గులాబీ కండువా కప్పుకోనున్నారని అంటున్నారు. పార్టీలో చేరిక అనంతరం గజ్వేల్ నియోజకవర్గంలో భారీ బహిరంగ ఏర్పాటు చేయడానికి ఒంటేరు అభిమానులు సన్నాహాలు చేసి కేసీఆర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించే అవకాశాలున్నట్లు సమాచారం.

ఫెడరల్‌ఫ్రంట్ పేరు వింటేనే బాబుకు వణుకు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, సనత్ నగర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నిప్పులు చెరిగారు. ఫెడరల్ ఫ్రంట్ పేరు వింటేనే చంద్రబాబుకు వణుకు పుడుతోందని ఆయన అన్నారు. దుర్గ గుడి వద్ద తలసాని రాజకీయ వ్యాఖ్యలు చేయడం పట్ల చంద్రబాబు , ఏపీ మంత్రులు తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. అదే విషయాన్ని ఆయన మీడియా ఎదుట ప్రస్తావిస్తూ చంద్రబాబులాగా దేవాలయాల వద్ద రాజకీయాలు చేసే అలవాటు తనకు లేదన్నారు. తనకు ఏపీలో బంధువులు ఉన్నారని, బంధుత్వాలు, బంధాల విలువ చంద్రబాబుకు తెలియదంటూ ఎద్దేవా చేశారు. హరికృష్ణ చనిపోతే అక్కడ కూడా రాజకీయాలు మాట్లాడిన నీచమైన సంస్కృతి చంద్రబాబుదని ఆరోపించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తాను ఏపీకి వెళ్లి, వచ్చినందుకు బాబు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఇలాగే హెచ్చరికలు చేస్తే బీసీలెవరూ టీడీపీలో ఉండరన్నారు. ఈ దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో, ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ వేదికగా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, నాయకులను కలుస్తున్నారని చెప్పారు. దీంతో బాబుకు వణుకుపుట్టుకొచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చంద్రబాబు చిల్లర రాజకీయాలు చేస్తే సమాధానం తీవ్రంగా ఉంటుందని, కులాల మధ్య చిచ్చు పెట్టిన వ్యక్తి చంద్రబాబేనన్నారు. మాల,మాదిగలకు, బీసీలకు, కాపులకు గొడవ పెట్టింది ఆయనేనని ఆరోపించారు. అలాంటి చంద్రబాబు టీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడడం దారుణమని విమర్శించారు. ఈ బాబు మాకొద్దు అనే నినాదంతో ముందుకు పోతున్నామని ఆంధ్రా ప్రజలు చెప్పారని తలసాని తెలిపారు. చంద్రబాబుకు టైం దగ్గరపడ్డదన్న ఆయన, ఎన్టీఆర్ అభిమానులే చంద్రబాబును సాగనంపాలని చూస్తున్నారన్నారు. నేను వందశాతం రాజకీయాలు మాట్లాడుతానని, ఏపీలో తప్పకుండా రాజకీయాలు చేస్తామన్నారు. అక్కడ మమ్మల్ని అభిమానించే వాళ్లున్నారని పేర్కొన్నారు. నేను ఆంధ్రాలో బీసీ నాయకులను కలిస్తే చంద్రబాబుకు భయం పుట్టుకుందని, బడుగు, బలహీన వర్గాల ప్రజలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్తారన్నారు. చంద్రబాబును చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని,తాను ఏపీకి వెళ్తే అనూహ్య స్థాయిలో ప్రజాస్పందన ఉందని, ఇక సీఎం కేసీఆర్ వెళ్తే ఏ రేంజ్‌లో స్పందన ఉంటుందో ఊహించుకోవాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.














పొత్తుకు మీరెందుకు ప్రయత్నించారు: టీడీపీపై బొత్స విమర్శ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీలో పొత్తుల ప్రస్తావనే రాలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని అవమానాలైనా భరిస్తామని, ఎంత దూరమైనా వెళ్తామని తమ పార్టీ అధ్యక్షుడు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్-కేటీఆర్ భేటీపై టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేటీఆర్, జగన్ భేటీలో ఫెడరల్ ఫ్రంట్ గురించి మాత్రమే చర్చించారని, పొత్తుల గురించి కాదని స్పష్టం చేశారు. ఒకవేళ ఏపీకి తెలంగాణ సీఎం కేసీఆర్ అన్యాయం చేసుంటే ఆ రాష్ట్ర ఎన్నికల సమయంలో టీఆర్‌ఎస్‌తో పొత్తు కోసం టీడీపీ ఎందుకు ప్రయత్నించిందని ప్రశ్నించారు. ఒడిషా, కర్ణాటక, పశ్చిమబెంగాల్ సీఎంలను ఫెడరల్ ఫ్రంట్ కోసం కేసీఆర్ కలిశారని, ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌ను టీఆర్‌ఎస్ నేతలు కలిశారని ఆయన పేర్కొన్నారు. దీనిపై టీడీపీ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని గతంలోనే తమ అధ్యక్షుడు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. పదేళ్లు హైదరాబాద్‌లో రాజధాని కొనసాగే అవకాశం ఉన్నా ఎందుకు ముందుగానే వచ్చారని చంద్రబాబును ప్రశ్నించారు. టీడీపీ నేతల వక్రబుద్ధిని రాష్ట్ర ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని, శాంతిభద్రతలపై నమ్మకం లేకుండా చేశారని టీడీపీ నేతలపై ధ్వజమెత్తారు. టీడీపీ నేతల మాటలకు ఊసరవెల్లి కూడా సిగ్గుపడేలా ఉందని బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు.

'పంచాయతీ' హోరాహోరీ

- ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం • పేరుకే పార్టీ రహితం
- పార్టీల మద్దతుతోనే బరిలోకి • టీఆర్ ఎస్ దూకుడు
- భారీ ఎత్తున బరిలోకి అధికార పార్టీ మద్దతుదారులు
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు సవాల్!
- పంచాయతీల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ నిర్ణయం

గ్రామ సంగ్రామం అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. పంచాయితీ ఎన్నికలు పార్టీ రహితమయినప్పటికీ అన్ని పార్టీల మద్దతుతోనే సర్పంచ్ నుంచి వార్డుసభ్యుల వరకు రంగంలోకి దిగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి పట్టుమని నెలరోజులు గడువకముందే పంచాయితీ పోరు రావడంతో అన్ని పార్టీలు తమ సత్తా చాటేందుకు నిర్ణయించుకున్నాయి. అందుకుగాను ధీటైన మద్దతుదారులను పంచాయితీ ఎన్నికల్లో దింపుతున్నారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో విజయఢంకా మోగించిన టీఆర్‌ఎస్‌పార్టీకి పంచాయితీ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారింది. పంచాయితీలన్నింటిని కైవసం చే సుకునేందుకు పావులు కదుపుతున్నది. ముఖ్యంగా ఇటీవల ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికి తమ నియోజకవర్గంలో పంచాయితీ ఎన్నికలు ఓ సవాల్‌గా మారాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపాలైన కాంగ్రెస్, టీడీపీ సైతం పంచాయతీ ఎన్నికల్లోనైనా తమ ఉనికిని చాటుకోవాలన్న హతహలాడుతున్నాయి. మూడు విడతల్లో నిర్వహిస్తున్న ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి.






హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గ్రామ పంచాయితీ ఎన్నికలు అన్ని గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది. పంచాయితీ ఎన్నికల్లో విజయఢంకా మోగించేందుకు ఓ పార్టీ, తమ ఉనికిని కాపాడుకునేందుకు విపక్షపార్టీలు సైతం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన అధికారపార్టీకి ఈ ఎన్నికలు ఓ రకంగా సవాల్‌గా మారాయి. ముఖ్యంగా నియోజకవర్గాల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు సర్పంచ్ ఎన్నికలు సవాల్ విసురుతున్నాయి. పార్టీలో, ప్రభుత్వంలో కీలక పదవులు లభించాలంటే సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. ఇందుకుగాను అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. అలాగే ఎన్నికల్లో ఓటమిపాలైన కాంగ్రెస్‌తో పాటు టీడీపీ, బీజేపీ సైతం తమ ఉనికిని చాటుకునేందుకు పంచాయితీ ఎన్నికలను కీలకంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల్లో ముఖ్యంగా అధికారపార్టీ మద్దతుదారులు భారీ ఎత్తున పోటీ పడుతుండడంతో ఆ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదాః రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం గుర్రంపల్లి గ్రామంలోని సర్పంచ్ పదవికి అధికార టీఆర్‌ఎస్ మద్ధతుదారులు నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. అధికారపార్టీ మద్దతుదారులైన తాజా మాజీ సర్పంచ్ బండి నిర్మలా లక్ష్మినారాయణ, గూడూరి లలితా రాంరెడ్డి, చన్‌వల్లి యాదమ్మ పెంటయ్యలు నామినేషన్ దాఖలు చేశారు. అయితే కాంగ్రెస్‌పార్టీ మద్దతుదారుగా మల్కన్న అనితా శివరాములు గౌడ్ రామినేషన్ దాఖలు చేశారు. దీంతో గ్రామంలో ఒకే పార్టీ మద్దతుదారులు పెద్ద ఎత్తున పోటీ పడుతుండడం, కాంగ్రెస్‌పార్టీ త రపున ఒకరు మాత్రమే బరిలోకి దింపడంతో ఇక్కడ అధికారపార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. ఇలానే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80శాతం గ్రామాల్లో పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. పార్టీ రహిత ఎన్నికలైనప్పటికీ ఏ పార్టీ ఆ పార్టీ మద్దతుదారులను గెలిపించుకొని పంచాయితీని తమ ఖాతాలో వేసుకునేందుకు బలమైన అభ్యర్థులను బరిలోకి దింపుతున్నాయి. నేటితో మొదటి దశ సర్పంచ్ ఎన్నికలకు నామినేషన్ల గడువు ముగియడంతో ఎవరు బరిలో ఉంటారో.. ఎవరు వెనక్కి తగ్గుతారోననే సందేహాలు వ్యకమ్తమవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు పోటీలో ఉంటామని ప్రజల మద్దతు కూడగట్టిన నాయకులు ఒక్కొక్కరుగా వెనక్కి తగ్గుతూ... కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. సర్పంచ్ ఎన్నికలంటేనే డబ్బుతో ముడిపడి ఉండడంతో ఓటర్ల సంఖ్యను బట్టి ఎన్ని లక్షలు ఖర్చుపెడితే గెలుస్తామా అని బేరీజు వేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన తొలి ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి.

పంచాయితీల్లో పార్టీల రంగు : గ్రామ పంచాయితీ ఎన్నికలు పార్టీ రహిత ఎన్నికలు అయినప్పటికి అన్ని గ్రామాల్లో పార్టీల రంగు పులుపుకుంది. రాజకీయ పార్టీ గుర్తులు లేకపోయినప్పటికీ పార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో నిలుస్తుండడంతో పార్టీల మధ్యనే పోరు అన్నట్లు కనబడుతోంది. స్థానిక సంస్థల్లో పోటీ అంటే గతంలో అభ్యర్థిని చూసి గ్రామ ఓటర్లు ఓటు వేసేవారు. ప్రస్తుతం మాత్రం అదీ కనుచూపుమేరకైనా కనిపించడంలేదు. పనిచేసే వాడైనా.. చేయనివాడైనా ఖర్చు పెడితేనే మద్దతు తెలుపుతామంటూ బహిరంగంగా గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎన్నికల ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ విజయఢంకా మోగించడంతో, వారికి పంచాయితీ కూడా ప్రతిష్ఠాత్మకంగా మారింది. కాంగ్రెస్ సైతం పూర్వ వైభవం కోసం పాకులాడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిచవిచూసిన కాంగ్రెస్, మిత్రపక్షాలు ప్రస్తుతం జరుగుతున్న పంచాయితీ ఎన్నికల్లోనైనా సత్తా చాటేందుకు తహతహలాడుతున్నాయి. మూడు విడతల్లో నిర్వహిస్తున్న ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి.

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు సవాలే : శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే పంచాయితీ ఎన్నికలు రావడంతో ఈ ఎన్నికలు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు సవాలుగా మారాయి. రాష్ట్రంలో భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీఆర్‌ఎస్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు పంచాయితీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలువాలంటే ఎమ్మెల్యే కీలకంగా వ్యవహరించాలని, తమ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సర్పంచ్‌లను గెలుపించుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడంతో ఎమ్మెల్యేలు ఇరకాటంలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల హడావుడి నుంచి ఇంకా తేరుకోకముందే వచ్చిన పంచాయితీ ఎన్నికలను ఎమ్మెల్యేల పనితీరుకు గ్రేడింగ్‌గా పరిగణించే అవకాశాలు ఉండడంతో అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే చావో రేవో అన్నట్లు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో సర్పంచ్ ఎన్నిక బాధ్యతలను ఎమ్మెల్యేలు తమ భుజాలపైకి ఎత్తుకొని బలం నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే గ్రామాల్లో ఒకే పార్టీ నుంచి తీవ్ర పోటీ నెలకొంటుండడంతో ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేయాలనేది సంకటంగా మారింది. తాము ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు తమ గెలుపు కోసం పనిచేసిన వారందరూ సర్పంచ్‌లుగా అవకాశం ఇవ్వాలని కోరుతుండడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇటు ఇంటి పోరును అటు ఎన్నికల పోరును అధిగమించి సర్పంచ్‌లను గెలిపించుకుంటేనే అధిష్ఠానం వద్ద తమకు ప్రతిష్టపెరిగి పదవులు దక్కుతాయనే ఆశతో ఎమ్మెల్యేలు కదనరంగంలో ముందుకు కదులుతున్నారు.

కాంగ్రెస్ నేతలపై అసెంబ్లీ ఓటమి ఎఫెక్ట్ : అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భాగస్వామ్యంతో 119 స్థానాల నుంచి పోరాడి ఓడిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడిప్పుడే ఆ షాక్ నుంచి బయటపడుతున్నారు. ఊహించని విధంగా ఘోర పరాజయం అనంతరం పంచాయితీ ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ నేతల్లో కొంత నైరాశ్యం కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ పార్టీకి వచ్చి ఓట్లు ఎన్ని... ఇప్పుడు పోటీ చేస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందనే అంశం ఆ పార్టీ నేతల్లో కలవరం రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జోరుగా ప్రచారం జరిగినప్పటికీ ఫలితాలు రివర్స్ కావడంతో పార్టీ నేతలకు మింగుడు పడడం లేదు. అయితే ఈ పరిస్థితులను అధిగమించి ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థులను బరిలో నిలుపుతూ పంచాయితీ ఎన్నికల్లో సత్తా చాటాలని వ్యూహాలు రూపొందిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ గెలుపు గుర్రాల వేటలో ముందుకు కదులుతున్నారు.

ఉనికి కోసం తపిస్తున్న బీజేపీ ఇతర పార్టీలు :

శాసనసభ పోరులో బోల్తాపడిన బీజేపీ పంచాయతీలోనైనా కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లను గెలిపించుకొని ఉనికి కాపాడుకోవాలని భావి స్తోంది. అసెంబ్లీ ఒక్కసీటుకే పరిమితమైన బీజేపీ సర్పంచ్ ఎన్నికల్లో పట్టు నిలుపుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమ పార్టీకి బలమున్న గ్రామాల్లో పంచాయితీలను కైవసం చేసుకోవాలని, అంతంతమాత్రంగా ఉన్నచోట విపక్షపార్టీలకు చెందిన మద్దదుదారులను బలపర్చాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఏపీలో టీడీపీ, కాంగ్రెస్‌ను తిరస్కరించడం ఖాయం : ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగానే టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారని ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌ను కేటీఆర్ కలవడంతో టీడీపీ నేతలు తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్-వైఎస్సార్‌సీపీ పొత్తు అంటూ పిచ్చిగా మాట్లాడుతున్నారని నిప్పులుచెరిగారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూడలేక టీఆర్‌ఎస్‌తో పొత్తు అంటూ టీడీపీ విషప్రచారం చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీతో 4సంవత్సరాలు సంసారం చేసి ఇప్పుడు టీడీపీ నేతలు శ్రీరంగ నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో టీడీపీని కాంగ్రెస్‌ని ఏవిధంగా తిరస్కరించారో, ఆంధ్రాలో కూడా టీడీపీని కాంగ్రెస్‌ని ప్రజలు తిరస్కరించడం ఖాయమని గుత్తా తెలిపారు.

స్పీకర్ ఎన్నికల లాంఛనమే
ఏకగ్రీవానికి విపక్షాల మద్దతు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ శాసనసభా స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. స్పీకర్ ఎన్నికకు మద్దతు ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన విజ్ఞప్తిపై విపక్షాలన్నీ సానుకూలంగా స్పందించాయి. సభలో టీఆర్‌ఎస్‌పార్టీకి తిరుగులేని మెజార్టీ ఉండడంతో, స్పీకర్ ఎన్నికకు పోటీ నిలిపేందుకు విపక్షాలు వెనకడుగు వేసినట్లు స్పష్టమవుతోంది. స్పీకర్ ఎన్నికకు సహకరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ఎంఐఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలకు ఫోన్ చేశారు. ఎంఐఎం, బీజేపీ నేతలు స్పీకర్ ఎన్నికకు మద్దతునిస్తున్నట్టు వెంటనే ప్రకటించగా, టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం పార్టీ నేతలతో చర్చించి వెల్లడిస్తామని చెప్పారు. గురువారం ఉదయం పార్టీ నేతలతో సమావేశం అనంతరం స్పీకర్ ఎన్నికకు అధికారపార్టీకి సహకరించాలని కాంగ్రెస్‌పార్టీ నిర్ణయం తీసుకున్నది. దీంతో స్పీకర్ ఎన్నిక లాంఛనం కానుంది. స్పీకర్ ఎన్నికకు గురువారం నామినేషన్లు దాఖలు చేయగా, శుక్రవారం స్పీకర్ ఎన్నిక ఉండనుంది. రాష్ట్ర శాసనసభ సభాపతి పదవికి పోచారం శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్ రెడ్డిని సీఎం కేసీఆర్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. మొత్తం ఆరు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. సీఎం కేసీఆర్, మల్లు భట్టి విక్రమార్కతో పాటు అహ్మద్ బలాల, రేఖా నాయక్, అబ్రహం, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు పోచారం అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించారు. సీఎం కేసీఆర్ విజ్ఞప్తితో ఎంఐఎం, బీజేపీ అదేవిధంగా కాంగ్రెస్ స్పీకర్ ఏకగ్రీవానికి ఆమోదం తెలిపాయి. దీంతో స్పీకర్ ఎన్నిక లాంఛనమే కానుంది. సభాపతిగా పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎన్నికను శుక్రవారం అధికారికంగా ప్రకటించనున్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల విస్తృతస్థాయి సమావేశాలు
న్యాయం జరిగేవరకు పోరాటం

విజయవాడ, మేజర్‌న్యూస్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం కొనసాగుతుందని అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ నేత, వైసీపీ నాయకుడు అడపా శేషు స్పష్టం చేశారు. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో అగ్రిగోల్డ్ బాధితుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ సమావేశాలు జరగనున్నాయని, అగ్రిగోల్డ్ బాధితులకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించి, వారికి న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అగ్రిగోల్డ్ బాసట కమిటీ రాష్ట్ర కన్వీనర్ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాధితుల పేర్లు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల లెక్కలను తగ్గించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. పోలీసుల సర్వేలో 19లక్షల 50వేల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నట్టు తేలిందని, కానీ ప్రభుత్వం ముందే 10లక్షల మంది మాత్రమే ఉందని చెప్పడం అన్యాయమని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. వైసీపీ అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

వైఎస్ జగన్ సింగిల్‌గానే వస్తారు
వైసీపీ ఎమ్మెల్యే రోజా



తిరుపతి, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీఆర్‌ఎస్‌తో తమ పార్టీ చర్చలు జరిపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా తెలిపారు. వైఎస్ జగన్, కేటీఆర్ చర్చలు జరిపితే చంద్రబాబు ఎందుకు వణికిపోతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించి లబ్ధి పొందాలని టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గురువారం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు, టీడీపీ కారణంగానే ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరిగిందన్నారు. వైఎస్ జగన్ ఏది చేసినా బురద చల్లమే పనిగా పెట్టుకున్నారని టీడీపీ నాయకులపై మండిపడ్డారు. కేటీఆర్‌తో వైఎస్ జగన్ మాట్లాడమే తప్పు అంటున్నారు టీడీపీ నాయకులు. ఇద్దరు యంగ్ డైనమిక్ నాయకులు కలిస్తే ఎందుకు వణికిపోతున్నారు, అమరావతి శంకుస్థాపనకు తెలంగాణ సీఎం కేసీఆర్‌ను చంద్రబాబు పిలవడమే కాకుండా రాయిమీద ఆయన పేరు చెక్కించారు. టీడీపీ నేతలు ఆ రోజు ఎందుకు ప్రశ్నించలేదు, గాడిదలు కాస్తున్నారా, కేసీఆర్ మెప్పు కోసం చంద్రబాబు 36 వంటకాలు చేయించి దగ్గరుండి వడ్డించారు. అప్పుడేమైంది మీ బుద్ధి, కేసీఆర్‌కు దేవినేని ఉమా విజయవాడలో సన్మానం చేశారు. పరిటాల సునీత కొడుకు పెళ్లిలో కేసీఆర్ మెప్పు కోసం టీడీపీ నేతలు చేసిన ప్రదక్షిణలను అందరూ చూశారు. మీ రాజకీయ లబ్ధి కోసం ఎన్ని వేషాలైనా వేస్తారు. హైదరాబాద్‌లో ఉండేందుకు పదేళ్లు గడువున్నా ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కుని విజయవాడకు చంద్రబాబు పారిపోయి వచ్చారని అందరికీ తెలుసు. ఎంతసేపూ ఎవరితో పొత్తు పెట్టుకుందామా అని చంద్రబాబు ఆలోచిస్తుంటారు. మీరు ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా జగన్ సింగిల్‌గానే ఎన్నికలకు వస్తారు. రాష్ట్రానికి మంచి జరిగే విషయమైతే ఎవరితోనైనా జగన్ సంప్రదింపులు జరుపుతారు. జగన్ విశ్వసనీయతపై అందరికీ నమ్మకముంది. ఏపీకి నష్టం కలిగించిన కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ పెడుతున్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియదా, జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదు." అని ఎమ్మెల్యే రోజా పేర్కొన్నారు.

షర్మిల ఫిర్యాదుపై బాబు ఎదురుదాడా?



హైదరాబాద్, మేజర్‌న్యూస్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలపై టీడీపీ నేతలే పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆరోపించారు. పోలీసులకు షర్మిల చేసిన ఫిర్యాదుపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎదురుదాడికి దిగటం బాధాకరమన్నారు. షర్మిలపై సోషల్ మీడియాలో జరు గుతున్న దుష్ప్రచారం చంద్రబాబుకు తెలియదా అంటూ ప్రశ్నించారు. పోలీసుల విచారణలో ఆ పార్టీ వాళ్లు కచ్చితంగా బయటకు వస్తారన్నారు. టీడీపీ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, చంద్రబాబు బెదిరింపులకు దిగటం ఏంటని మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాసిరెడ్డి పద్మ మాట్లాడారు. "షర్మిలకు అండగా ఉంటామని చంద్రబాబు కనీసం భరోసా ఇవ్వకపోవడం బాధకరం. ఆయన స్పందించిన తీరు దుర్మార్గం. ఇలాంటి ఘటనలే టీడీపీ నేతల ఇంట్లో వాళ్లకు జరిగితే ఇలాగే చేస్తారా, మిగతా మహిళల పరిస్థితి ఏంటి, టీడీపీ నాలుగేళ్ల పాలనలో మహిళకు న్యాయం చేసిన ఘటన ఒక్కటైనా ఉందా. విలువలు, ప్రజాస్వామ్యం, నైతిక విలువలు అంటూ మైకుల ముందు బాబు మాట్లాడతారు. కాని ఆయన పాటించరు. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత ఏపీ నేరాంధ్రప్రదేశ్‌గా మారింది. నాలుగేళ్లలో పోలీసులు వ్యవహరించిన తీరే అందుకు నిదర్శనం. వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనలో ప్రాథమిక విచారణ జరగకుండానే చంద్రబాబు, డీజీపీ మాట్లాడిన తీరు శోచనీయంఅంటూ వాసిరెడ్డి పద్మ టీడీపీ నాయకులపై నిప్పులు చెరిగారు.

బీసీ టీచర్లు ఉద్యమాలకు నాయకత్వం వహించాలి

- రిజర్వేషన్ల పై క్రీమీలేయర్ ఎత్తివేసే వరకు ఉద్యమించాలి
- ప్రమోషన్లలో రిజర్వేషన్లకై పోరాటం చేయాలి
- బి.సి టిచర్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, మేజర్‌న్యూస్: చైతన్యవంతమైన బి.సి టీచర్లు, బి.సి ఉద్యమాలకు నాయకత్వం వహించాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం బి.సి టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బి.సి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బి.సి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్ జనాభా ప్రాతిపదికన 27 % నుంచి 52% నికి పెంచాలని, కేంద్ర రాష్ట్ర ఉద్యోగులపై గల క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని, ఆదాయపు పన్ను పరిమితిని 2.5 లక్షల నుంచి 8 లక్షల వరకు పెంచాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 60 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలనీ, యాజమాన్యాల వారిగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ బీసీ లను అణచిపెట్టె కుట్ర జరుగుతుందని ధ్వజమెత్తారు. బి.సిలకు చట్టసభలలో రిజర్వేషన్లు పపెట్టాలని, అలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని , ఉన్నత న్యాయస్థానాలలో రిజర్వేషన్లు పెట్టాలని ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కాని అగ్రకులాలు అడుగకుండానే రిజర్వేషన్లు పెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రకులాలకు రిజర్వేషన్లు ఏ ప్రతిపాదికన పెడుతారని ప్రశ్నించారు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు ఎందుకు పెడుతున్నారు ఇంకా సమాజానికి అర్థం కాలేదు అగ్రకులాలు విద్యా సంస్థలలో చదువుకోవడానికి సీట్లు దొరకడం లేదని రిజర్వేషన్లు పెడుతున్నారా అని ప్రశ్నించారు. అగ్రకులాల లోని పేదవారికి రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికగా ఇస్తారు.? ఏ ఆధారంగా ఇస్తారు? ఉద్యోగాలలో వారికి వారి జనాభా ప్రకారం ప్రాతినిథ్యం లేదని ఇస్తారా ! లేక సమాజంలో అగ్రకులాల వారికి సామాజిక, గౌరవం లేదని ఇస్తారా ? అని ప్రశ్నించారు. ఓట్ల కోసమని విలువలు లేకుండా వ్యవస్థను భ్రష్టుపట్టించే వాగ్దానాలు చేయడం రాజకీయ దివాళకోరుతనమని ధ్రువపరుస్తుది. నైతిక పతనావస్థను సూచిస్తుందన్నారు. టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎ. లక్ష్మన్ గౌడ్, వి. రమేష్, ఎ. యాదగిరి, గురుప్రసాద్ గౌడ్, రాఘువేందర్, సుభాష్, నీల వేణు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ అసెంబ్లీ రేపటికి వాయిదా

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభ గురువారం కొలువుదీరింది. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం అసెంబ్లీని శుక్రవారం నాటికి వాయిదా వేశారు. ఎమ్మెల్యేలుగా 114 మంది ప్రమాణం చేశారు. బీజేపీ నేత రాజాసింగ్, ఎంఐఎం నేతలు అక్బరుద్దీన్, జాఫర్ హుస్సేన్, టీఆర్‌ఎస్ నేత మాధవరం కృష్ణారావు, టీడీపీ నేత సండ్ర వెంకట వీరయ్యలు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. కాగా అసెంబ్లీ కార్యదర్శి ఆఫీస్‌లో స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేశారు. స్పీకర్ అభ్యర్థిత్వానికి అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యేలకు, అసెంబ్లీ సచివాలయం సిబ్బందికి ఇచ్చిన విందుభోజనాన్ని ఆరగించారు.

ఆసరా పింఛన్‌ల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

- ఏప్రిల్ 1 నుంచి పింఛన్‌ల పంపిణీ
- 57 ఏళ్లు నిండినవారందరికీ ఆసరా ఫించన్లు



హైదరాబాద్, మేజర్ న్యూస్ః ఆసరా పింఛన్లకు సంబంధించి ఇచ్చిన హామీ మేరకు 57 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికీ వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి కొత్తగా పెన్షన్ పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. కొత్తగా అందించే పెన్షన్‌కు అర్హులను గుర్తించడంతో పాటు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇటీవల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ, వారికి అవసరమైన సూచనలు చేశారు. 57 ఏళ్లకు పైబడిన వృద్ధులకు ఆసరా పెన్షన్ల మంజూరుకు సంబంధించి విధివిధానాలను కలెక్టర్లకు తెలియజేయడంతో, వారు 57 నుంచి 64 ఏళ్ల వయస్సున్న వారిని ఆయా జిల్లాల్లో గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకు 20 లక్షల మంది అర్హులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆసరా పెన్షన్‌ను రూ. 1000 నుంచి రూ. 2016కు, వికలాంగుల పెన్షన్‌ను రూ. 1500 నుంచి రూ. 3016కు పెంచాలని ఎన్నికలకు ముందు టీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులకు ఆసరా పెన్షన్లను పెంచి అందజేయనున్నారు.

వోటరు జాబితానే ప్రమాణీకం : కొత్తగా పెన్షన్లకు అర్హులను గుర్తించేందుకు 19-11-2018 తేదీన ప్రకటించిన వోటరు జాబితాను వినియోగించుకోనున్నారు, వోటరు జాబితాలో 57 నుంచి 64 ఏళ్లు వరకు ఉన్నవారి వివరాలు సేకరించి ఎస్‌కేఎఫ్ డాటాలో సరి చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ, అధికారులకు సూచించారు. కలెక్టర్లు ఈ జాబితాలను పంచాయతీ కార్యద ర్శులకు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లకు అందజేసి పరిశీలిం చేందుకు ఆదేశించారు. అర్హులైనవారి జాబితాలో లబ్ధిదారుని యూఐడీ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఫోటోతో సహా సేకరించి, గ్రామ స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో ముని సిపల్ కమిషనర్లు పరిపాలన అనుమతి కోసం కలెక్టర్లకు అందజేయనున్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్న తరువాత అర్హుల జాబితాను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు.

ఎమ్మెల్యేలకు టీఆర్‌ఎస్ ఎన్నారైశాఖ శుభాకాంక్షలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ శాసనసభకు నూతనంగా ఎన్నికై ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులందరికీ టీఆర్‌ఎస్ ఎన్నారై సౌత్ ఆఫ్రికా శాఖ శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ అధ్యక్షులు గుర్రాల నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎన్నారైలుగా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో టెలిఫోన్ క్యాంపైన్, మన ఎమ్మెల్యే క్యాంపైన్, సోషల్ మీడియా క్యాంపైన్, ఇంటింటి ప్రచార కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. టీఆర్‌ఎస్ పార్టీ విజయానికి టీఆర్‌ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ ఎంతో కృషి చేసిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు.

సంపాదకీయం

editpage@suryaa.com

పెంచిన మొసలే పొట్టన పెట్టుకుంది

● మహిళా శాస్త్రవేత్త బలి ● ఇండోనేషియాలో ఘటన ● యజమానురాలి ఓ చేతిని, పొట్ట భాగాన్ని తినేసిన మొసలి

జకార్తా : పాముకు పాలు పోసినా విషమే కక్కుతుంది అంటారు పెద్దలు. క్రూర జంతువులను పెంచుతున్నా వాటితో ఎప్పటికైనా ప్రమాదం పొంచే ఉంటుంది. ఇందుకు ఇండోనేషియాలో జరిగిన ఈ ఘటన ఉదాహరణ. తను ముద్దుగా పెంచుకుంటున్న మొసలి దాడి చేయడంతో నలభై నాలుగేళ్ల ఓ మహిళా శాస్త్రవేత్త బలైంది. వివరాల్లోకి వెళితే, ఇండోనేషియాకు చెందిన ఈ శాస్త్రవేత్త తన ఇంటి ఆవరణలోని మడుగులో ఓ మొసలిని పెంచుతోంది. దీని పొడవు 14 అడుగులు. స్వహస్తాలతో ఆహారం, మందులు అందించి దాన్ని అల్లారుముద్దుగా పెంచుకునేది. ఏమైందో ఏమో పెంచిన యజమానురాలిపైనే ఆ మొసలి దాడి చేసింది. ఆమెను చంపేసి ఒక చేతిని, ఉదర భాగాన్ని పూర్తిగా తినేసింది. గుర్తు పట్టలేని విధంగా ఉన్న మృతదేహాన్ని తోటి సిబ్బంది మరునాడు ఆమె ఇంటి ఆవరణలో గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలికి చేరుకున్నారు. వైద్యులు, ఆర్మీ, పోలీసుల సాయంతో సదరు మొసలిని శాస్త్రవేత్త ఇంటి నుంచి జంతు సంరక్షణ కేంద్రానికి తరలించారు.



పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బహుచిత్రమైంది. 200 సంవత్సరాలకు పైగా మనను ఏలిన యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. అందుకు తార్కాణమే తాజాగా మంగళ, బుధవారాలలో ఆ దేశంలో సంభవించిన పరిణామాలు. బ్రెగ్జిట్ నుంచి వైదొలగాలన్న నిర్ణయాన్ని రెండేళ్ళ క్రితం ప్రకటించిన బ్రిటన్ పార్లమెంటే ఇప్పుడు దానికి వ్యతిరేకంగా నిర్ణయాన్ని వెలువరించింది. యురోపియన్ యూనియన్‌లో ఉండాలా వద్దా అనే అంశంపై బ్రిటన్ పార్లమెంటులో జరిగిన ఓటింగులో ప్రభుత్వం ఓటమి పాలైంది. బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా 432 ఓట్లు వచ్చాయి. అనుకూలంగా కేవలం 202 ఓట్లు పడ్డాయి. ఇలాంటి ప్రధానమైన బిల్లు మన దేశ పార్లమెంటులో ఓడిపోతే, ప్రభుత్వం రాజీనామా చేస్తుంది. అక్కడలా జరగలేదు. బ్రెగ్జిట్ ఓటమి దరిమిలా ప్రధాని థెరెసా మే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. విచిత్రంగా పార్లమెంటు మేకు మద్దతు ప్రకటించింది. 19ఓట్ల తేడాతో అవిశ్వాసం వీగిపోయింది. ఇది బ్రిటన్ ప్రజాస్వామ్య గొప్పతనం. తమను ఆర్థికంగా దెబ్బతీసే బిల్లు వద్దంటూనే, ప్రభుత్వం కావాలని కుండబద్దలు కొట్టింది బ్రిటన్ పార్లమెంటు. డెమోక్రమసీ ఇలా ఉండాలని ఉదాహరణ చూపింది. తదనంతర పరిణామాలు ఎలా ఉన్నా ఇప్పటికి మాత్రం పార్లమెంటు తన గొప్పతనాన్ని చాటింది.

ఈ సందర్భంగా మార్చి 29నాటికి యురోపియన్ యూనియన్ నుంచి బయటకు వస్తామని ప్రధాని థెరెసా మే ప్రకటించారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తామన్నారామె. దీన్ని దృష్టిలో పెట్టుకుని బ్రిటన్‌కు మరిన్ని రాయితీలను ఇచ్చేందుకు యురోపియన్ యూనియన్ సిద్ధపడుతోందని తెలుస్తోంది. ఉత్తర ఐర్లాండ్, ఈయూ సభ్యురాలైన ఐర్లాండ్ మధ్య సరిహద్దుకు సంబంధించి ఇవి ఉంటాయని పేర్కొంది. బ్రిటన్ పార్లమెంటు తీర్మానంతో పౌండు విలువ ఏడు వారాల కంటే కనిష్ఠానికి పడిపోయింది. యుఎస్ డాలర్ మరింత బలపడింది. యూరో జోన్ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన మొదలవడానికి కారణం బ్రిటన్ పార్లమెంటులో మే తీర్మానం చిత్తుగా ఓడిపోవడమే. పది వారాల్లో బ్రిటన్ ఈయూ నుంచి బయటకొచ్చేయడానికి ముహూర్తం కూడా కుదిరింది. బుధవారం ఉదయానికి కేవలం ఒకశాతమే పడిపోయినప్పటికీ తదుపరి మరింత పతనమైంది. ఈ తీర్మానం నెగ్గి ఉండవచ్చు గాక, కానీ దీన్ని అమలు చేయడం ఎంత కష్టమో వారికి రానురానూ

ఇంగ్లండ్ ఎగ్జిట్!

తెలిసొస్తుందని ఫారెన్ ఎక్స్ఛేంజి నిపుణుడొకరు అభిప్రాయపడడం ఇక్కడ ఆసక్తికరంగా మారింది. అంటే ప్రత్యామ్నాయాలు వెతుక్కోక తప్పదు. బ్రెక్సిట్‌కు పార్లమెంటులో మద్దతే లేదు కాబట్టి అంత కష్టమేమీ కాకపోవచ్చనేది మరో నిపుణుడి వ్యాఖ్య. ఈ పరిణామాలు పౌండు విలువలు 0.3 శాతానికి పతనం చేశాయి. ఏడు వారాల క్రితం 88.44పెన్స్ ఉంది. ఇప్పుడు అది 88.57పెన్స్. ఆ ఒక్కరోజునే 20శాతం పౌండ్ విలువ పతనమైపోయింది. యూరోర విలువ సైతం 0.3 పతనమైంది. డాలర్‌తో పోలిస్తే ఇది జనవరి నాలుగు కంటే చాలా ఎక్కువగా పతనమైనట్లు. ఆ రోజున యూరో విలువ 1.1378డాలర్లు. యూరో జోన్ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరతకు ఇది సూచిక. మార్కెట్‌లో బ్రెక్సిట్‌పై హైడిగ్రి అన్‌సెర్టనిటీని ఇది చూపుతుందని ఇతర మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమయంలో ఏదైనా సాధ్యమేనని అంటున్నారు. కొత్తగా ఎన్నికలు, లేదా ఆర్టికల్ 50 అమలుకు గడువు పొడిగింపు.. లేదా రెండో సారి రిఫరెండమ్ నిర్వహించడం. ఈ మూడింటిలో ఏదో ఒకటి సాధ్యమే. బ్రిటన్ యురోపియన్ యూనియన్ నుంచి బయటకు రావడం ఇప్పటికైతే సుస్పష్టం. కానీ అదెలాగ అనేదే అస్పష్టంగా కనిపిస్తోంది. ఇందులో అనేక అడ్డంకులు కనిపిస్తున్నాయి. స్విస్ ఫ్రాంక్ కొద్దిగా పుంజుకుంది. రాజకీయ ఉద్రిక్తతల సమయంలోనూ, మార్కెట్ ఇక్కట్లలోనూ కూడా ఇది చోటుచేసుకోవడం విశేషం. యెన్ కూడా అభివృద్ధి బాటలోనే ఉంది. డాలర్‌కు ప్రస్తుతం .99 ఫ్రాంకులు పలుకుతున్నాయి. ఆరు దేశాల కరెన్సీ లతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ కొద్దిగా ఎక్కువగా ఉంది. టర్కిష్ లిరా, ఒక శాతం బలపడింది. కానీ ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు క్లిష్టంగా పరిణమించే అవకాశముంది.

ఈ విషయాన్ని కాసేపు పక్కన పెడితే.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పరిణామాలు బ్రిటన్ గొప్పదనాన్ని వెలుగులోకి తేవచ్చు గాక. కానీ ఆర్థిక వ్యవస్థ కొద్దికాలం పాటు కుదేలు కాక తప్పదు. బ్రెగ్జిట్ కావాలని కోరి డేవిడ్ కేమరూన్ తలనొప్పి తెచ్చుకుని పదవిని కోల్పోవాల్సి వచ్చింది. థెరిసా మే మాత్రం వద్దని చెప్పి, అధికారంలోకి వచ్చింది. గ్రీస్‌లో మొదలైన సంక్షోభం కారణంగా యురోపియన్ యూనియన్‌లోని దేశాలలో లుకలుకలు మొదలయ్యాయి. ఆర్థిక వ్యవస్థ కుదేలైన ఆ దేశంతో తమకెందుకని ఆయా దేశాలు బహిరంగంగానే వ్యాఖ్యానించాయి. అక్కడి నుంచి బ్రిటన్ కూడా బయటకు రావాలని నిర్ణయించుకుంది. తదనంతరం పరిణామాల్లో మే తెలివిగా వ్యవహరించి గట్టెక్కింది. ప్రజాస్వామ్యంలోని సున్నితత్వం కారణంగానే ఇది సాధ్యపడింది.

సూర్య లేఖలు

కేసీఆర్ ఫ్రంట్ బలపడుతోందా?

తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులలో జాతీయ రాజకీయాలలోనూ పట్టు బిగించాలన్న ఆతృత పెరుగుతున్నట్టే కనిపిస్తోంది. ఎవరికి వారే ఫ్రంట్లని ఏర్పాటు చేసుకుని బిజెపి ఏతర పార్టీలను వేదికపైకి తీసుకువస్తున్న క్రమంలో అంతర్గతంగా ఇరువురు చంద్రుల మధ్య జరుగుతున్న పోరు రోజురోజుకీ రసకందాయంలో పడినట్టే కనిపిస్తోంది. ఇప్పటికే పలు పర్యాయాలు దేశంలోని రాజకీయపార్టీలను కలసి ఓ వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నం కొనసాగు తుండగానే తెలంగాణ సిఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌లోనికి పలు పక్షాలను వచ్చే సూచనలు కనిపించడంతో ఫ్రంట్ కాస్త బలం పుంజుకునే ఆస్కారం కనిపిస్తోంది. ఇప్పటికే ఒడిస్సా సిఎంతో పాటు పలువురిని కలుసు కున్న కేసీఆర్ ఏపి నుంచి వైసిపిని ఫ్రంట్‌లోకి ఆహ్వానించారు. దీంతో ఈ విషయంపై కేసీఆర్ తనయుడు కేటిఆర్‌తో వైసిపి అధినేత జగన్ మంతనాలు కూడా జరిపారు. అనంతర పరిణామాలు ఎపి ఎన్నికల పరిస్థితులు ఎలా ఉన్నా, ప్రస్తుతం కేసీఆర్ ఫ్రంట్‌లోకి మరో పార్టీ వచ్చి చేరినట్టే అని చెప్పక తప్పదు. అయితే బిజెపియేతర పార్టీలను ఓతాటిపైకి తీసుకువచ్చేందుకు పశ్చిమబెంగాల్ మమతా బెనర్జీ నుంచి కూడా కేసీఆర్‌కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. కానీ బీజేపీ, కాంగ్రెస్ లేని మూడో ప్రత్యామ్నాయం కోసం ప్రయ త్నాలు సాగిస్తున్న కేసీఆర్.. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహు ల్ గాంధీ పాల్గొనే అవకాశం ఉండటంతో హాజరి అనుమానమే. అంతే కాదు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా ఉత్తర ప్రదేశ్‌లో పొత్తులు కుదుర్చు కున్న బీఎస్పీ, ఎస్పీ పార్టీల అధినేతలు మాయావతి, అఖిలేష్‌లు లతో పాటు ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశాలు కన్పించడంలేదు. కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్‌కు కూడా అఖిలేశ్ ఇప్పటికే మద్దతు ప్రకటించగా, అటు బాబు ఫ్రంటులో ఆయన ఉంటారా లేదా అన్నదీ అనుమానమే.

– వి. విద్యాసాగర్, బెంగళూరు

తెలంగాణలో మరో చారిత్రక ఘట్టం

జ్వాలాంతరంగం

– వనం జ్వాలా నరసింహారావు



● అభివృద్ధి పథంలో రాష్ట్రం
● పథకాల అమలులో అద్వితీయ ప్రతిభ
● పుష్కలంగా ప్రజల ఆశీస్సులు
● వ్యవసాయ రంగ పునరుజ్జీవనంలో అగ్రపథం
● ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన రైతు బంధు
● కేసీఆర్ నేతృత్వంలో దూసుకెడుతున్న అభివృద్ధి



కొత్త అసెంబ్లీ కొలువు తీరుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో మరో కొత్త చరిత్రకు తెర లేస్తోంది. అప్రతిహత విజయంతో కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి రెండోసారి అధికారంలోకి వచ్చింది. ప్రొటెర్మ్ స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ రాజ్‌భవన్‌లో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగురోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తారు. వీటిలో తొలి రోజు గురువారం నాడు ప్రొటెర్మ్ స్పీకర్ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొత్త స్పీకరు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. గవర్నర్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్నుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేస్తారు. కేసీఆర్ నాలుగున్నరేళ్ళ పాలనలో ఆయన మంత్రివర్గం అద్వితీయమైన ప్రతిభను కనబరిచింది. అందుకు తగ్గట్టుగా రాష్ట్రంలో ఊహాతీతంగా అభివృద్ధి చోటుచేసుకుంది. తెలంగాణలో జరిగిన అభివృద్ధి యావద్దేశ దృష్టినీ ఆకర్షించింది. పాలనా సామర్థ్యం, వ్యూహాత్మక వైఖరి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పరుగులు తీయించింది. కేసీఆర్ తన తొలి దశ పాలనలో సంక్షేమ కార్యక్రమాలకు విస్తృతమైన ప్రాధాన్యానిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రవేశపెట్టిన ఆసరా పింఛన్ల పథకం రాష్ట్రంలో 40లక్షల మంది పేదవారికి జీవన భృతితో పాటు సామాజిక రక్షణనూ కల్పించింది. ఎన్నికల ప్రణాళికలో టీఆర్ఎస్ హామీ ఇచ్చినట్లు ప్రభుత్వం ఆసరా పింఛన్ల మొత్తాన్ని వెయ్యి రూపాయల నుంచి 2016రూపాయలకూ, దివ్యాంగులకు ఇచ్చే భత్యాన్ని 1500 నుంచి 3016కూ పెంచారు. నిరుద్యోగులైన యువతకు నిరుద్యోగ భృతిగా 3016 రూపాయలను అదనంగా ఇస్తారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఇవి అమలులోకి వస్తాయి. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పేద కుటుంబాలలో యువతుల వివాహాలకు ఉద్దేశించారు. ఇవి సత్ఫలితాలను ఇవ్వడం ప్రారంభించాయి. పేదలు ఆత్మగౌరవంతో జీవించడానికి వీలుగా కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మాదిరిగా ఇళ్ళ నిర్మాణాన్ని కొనసాగించడంతో పాటు భవిష్యత్తులో సొంత స్థలాలున్న వారికి ఇళ్ళు కట్టుకోవడానికి ఆర్థిక సహాయాన్ని అందించే అవకాశముంది. సొంత ఇల్లుండాలనే కోరికున్న వారికి ఈ సహాయం కచ్చితంగా ఇతోధిక సాయం కాగలదు.

వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింపజేయడానికి వీలుగా కేసీఆర్ ప్రభుత్వం చొరవతో అనేక చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వాల నిర్ణయాల కారణంగా నాశనమైన వ్యవసాయ రంగం కేసీఆర్ చర్యల కారణంగా ప్రాణం పోసుకుంటోంది. రైతులందరికీ గొప్ప ఉపశమనం అనుభవంలోకి వచ్చింది. కేసీఆర్ ప్రవేశ పెట్టిన రైతు బంధు పథకం.. సాగుకు పెట్టుబడిలేని రైతులకు ఎంతో బాసటగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ పథకం ప్రశంసలు పొందింది. రెండు పంటలకూ ఎకరానికి నాలుగువేల చొప్పున ఎనిమిది వేల రూపాయలను పొందుతున్నారు. దీనిని ఇప్పుడు ఎకరానికి పదివేల రూపాయలకు పెంచబోతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలుచేస్తామని ఎన్నికల ప్రణాళికలో కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆరోగ్య లేదా ఇతర కారణాల వల్ల రైతు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతు బీమా ఇన్సూరెన్స్ పథకం ప్రారంభమైంది. ఇది రైతు కుటుంబాలకు ఎంతో ప్రయోజనకారిగా మారింది. ఈ పథకం కింద బలవన్మరణానికి లేదా హఠాన్మరణానికి పాలైన రైతు కుటుంబానికి పది రోజులలోపు 5 లక్షల రూపాయలు అందుతాయి. రైతును వ్యవస్థీకృత రంగంలోకి తేవడానికి రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేశారు. సమితి సభ్యులకు ప్రభుత్వం గౌరవ వేతనాన్ని చెల్లిస్తుంది. టాప్ టెన్ పథకాలలో ఐక్యరాజ్య సమితి రైతు బంధు, రైతు బీమా పథకాలను చేర్చడం తెలంగాణ రాష్ట్రానికీ, కేసీఆర్ ప్రభుత్వానికీ అంతర్జాతీయంగా లభించిన అరుదైన గుర్తింపు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టేందుకు అనేక రాష్ట్రాలు సన్నద్ధమవుతున్నాయి. జాతీయ స్థాయిలోనూ దీనిని అమలుచేయాలని యోచన ఉన్నట్లు కూడా తెలుస్తోంది. రైతులను ఎటువంటి ఆందోళన నుంచైనా నిరోధించగల ఏకైక, విభిన్నమైన పథకం రైతు బంధు అని వ్యవసాయ నిపుణులు, ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వించదగిన అంశం.

భూ రికార్డులలో తప్పులను సరిదిద్దడం, దోష రహితంగా తయారు చేయడం దేశంలోనే అద్భుతమైన సంస్కరణ. కేసీఆర్ ప్రభుత్వం ఈ పనిని విజయవంతంగా ముగించింది. దీనివల్ల భూయాజమాన్య హక్కులు ఎవరివనే అంశంపై పూర్తి స్పష్టత వచ్చింది. రైతులకు హైసెక్యూరిటీతో రూపొందించిన పట్టాదారు పాస్ బుక్, టైటిల్ డీడ్స్‌ను అందజేసింది. అదే సమయంలో అతి తక్కువ సమయంలో విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కింది. వ్యవసాయ రంగం సహా అన్ని రంగాలకూ 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్తు సరఫరాను చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ క్రమంలో అనేక రికార్డులను తిరగరాసింది. తెలంగాణ రాష్ట్రాన్ని అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసే రాష్ట్రంగా రూపుదిద్దడానికి వీలుగా 28000 మెగావాట్ల విద్యుత్తు కోసం కేసీఆర్ ప్రభుత్వం కొత్తగా విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నిర్మిస్తోంది. విద్యుత్తు వినియోగంలో సృష్టించిన రికార్డు అభివృద్ధికి సూచికగా నిలుస్తోంది. కోటి ఎకరాలకు సాగు నీరు అందించడానికి వీలుగా కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం, సీతారామ, దిండి, తదితర ప్రాజెక్టులను నిర్మిస్తోంది. పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసింది. ఆ ప్రాజెక్టులు ఇప్పుడు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయి. వేలాది చెరువులను వినియోగంలోకి తెచ్చారు. మిషన్ కాకతీయ కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మిషన్ భగీరథను చేపట్టింది. మార్చి 2019నాటికి దానిని పూర్తిచేయాలనే కృతనిశ్చయంతో ఉంది. ఈ పథకం మిగిలిన రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది.

యాదవులు, కురుమలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వీలుగానూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలీయంగా మార్చడానికీ పెద్ద సంఖ్యలో గొర్రెల పంపిణీని చేపట్టింది. మాంసం ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలను పెంచడానికి రాష్ట్రంలోని అన్ని జల వనరులలో చేప పిల్లలను విడిచిపెడుతోంది. ఇది కూడా భారీ స్థాయిలో చేపడుతున్నారు. ఆయా ప్రాంతాలలో చేపల వేటాడేందుకు మత్స్యకారులకు హక్కులను సంప్రాప్తింపజేశారు. చేనేత కార్మికులకు సాయపడి, చేయూతనిచ్చేందుకు దారం, రసాయనాలను సబ్సిడీపై ఇవ్వడమే కాకుండా నిరంతరం పని ఉండేలా చూస్తున్నారు.

కేజీ నుంచి పీజీ దాకా ఉచితంగా విద్యను నేర్పించే విద్యా విధానంలో భాగంగా రాష్ట్రంలో 663 రెసిడెన్షియల్ పాఠశాలలను కొత్తగా ఏర్పాటుచేశారు. ఇందులో చదువుకుంటున్న విద్యార్థులు మంచి ఫలితాలను రాబడుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ఒకటి చొప్పున 119 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించాలని ప్రతిపాదిస్తోంది.

ప్రజారోగ్య సంస్థను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. కేసీఆర్ కిట్స్ పథకాన్ని ప్రారంభించింది. కంటి వెలుగు పథకాన్ని విజయవంతంగా నిర్వహించారు. నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేయించారు. కంటి వెలుగు రీతిలోనే రాష్ట్రవ్యాప్తంగా చెవి, ముక్కు, గొంతుక, దంత సంబంధిత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం ఉద్యుక్తమవుతోంది. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంబంధించిన ఆరోగ్య వివరాలను పొందుపరిచేందుకు చర్యలు తీసుకుంటోంది.

పెట్టుబడిదారులు కొత్త పరిశ్రమలను నెలకొల్పడానికి వీలుగా ప్రభుత్వం టిఎస్ ఐ పాస్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఊచలు లేని కిటికీ అని ఇది పేరు తెచ్చుకుంది. ఇబ్బందులు లేకుండా అన్ని రకాల అనుమతులను దరఖాస్తు చేసిన 15రోజులలోగా ఇచ్చేందుకు ఈ చట్టం వీలుకల్పిస్తుంది. తెలంగాణ ప్రస్తుతం పారిశ్రామిక పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యంగా మారింది. సేవల విభాగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇంజిన్‌గా మారింది. రాష్ట్రంలోని ఐటి లేదా ఐటిఇఎస్ యూనిట్ల సంఖ్యలో అనూహ్యమైన పెరుగుదల కనిపిస్తోంది. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ప్రతి పథకమూ అత్యద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. అవి ప్రజలకు నేరుగా సహాయపడుతున్నాయి. అమలులో ఉన్న ప్రతి పథకమూ ప్రజలకు అద్వితీయమైన అనుభవాన్ని మిగులుస్తున్నాయి. అన్ని పథకాలకూ ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం సగర్వంగా తలెత్తుకుని యావత్ప్రపంచం ముందు నిలబడింది. తానొక అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా రూపొందుతోంది. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కె. చంద్రశేఖరరావు నేతృత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలోకి దూసుకెళ్ళడం ఖాయం.

ఓటర్లపై జనసేన పట్టెంత ?

సయ్యద్ రహ్మత్, సెల్-7093951403

● వలస పక్షులతో పుంజుకొంటున్న జనసేన పార్టీ
● పవన్ పర్యటనలు తప్ప... పోరాటాలు లేని చరిత్ర
● ఓట్లను సాధించుకోవడం సాధ్యమేనా ?
● జిల్లాలలో కనిపించని జనసేన శ్రేణుల జాడ
● వచ్చే ఎన్నికల్లో వారికి గుర్తింపు ఎలా ?



తన పేరులో జనం పెట్టుకొన్న జనసేన పార్టీ 2017 గర్జిస్తూ తెరపైకి వచ్చినా ఈ ఏడాది కాస్త పుంజుకొనే ప్రయత్నంచేస్తోంది. టీడీపీ, కాంగ్రెస్ పొత్తులు చిగురించే అవకాశముంది లేదా అన్న సంసిగ్ధత సాగుతున్నా, ఒకవేళ కలిస్తే తమ సీట్లు గల్లంతవుతాయన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో కొందరిని వెంటాడటం జనసేన పార్టీకి కొంత కలిసొచ్చే పరిస్థితి ఇప్పటినుంచే మొదలైంది. సహజంగా ఎన్నికల సమయంలో టీడీపీ, వైసీపీలో సీట్లు రాని అసంతృప్తులతో జనసేనకు కలిసొచ్చే అవకాశాలుండేవి. టీడీపీ, కాంగ్రెస్ పొత్తు ప్రచారం మహిమ వల్ల ఇప్పటినుంచే జనసేనకు కలిసొచ్చే వాతావరణం మొదలైంది. ఇదే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభావం ఎంత ఉండొచ్చు అన్నది అటుంచితే ప్రధాన పార్టీల జాతకాలు కాస్త అటు, ఇటు అయ్యేలా ఆ పార్టీ ప్రభావం చూపవచ్చు. జనసేన పుంజుకొనే వాతావరణం ఏర్పడినా జనంలో ఆ పార్టీ పట్టు ఎంత అన్నది ప్రస్తుతం చర్చాశంనీయంగా మారింది. అందుకు కారణాలు లేకపోలేదు. జనసేన అధినేతపవన్ కళ్యాణ్ జిల్లా పర్యటనలు ఆ పార్టీకి కాస్త ఊపిరిపోస్తున్నాయి. వామపక్షాలతో దోస్తీ కూడా జనసేన పార్టీకి కొంత కలసిరావచ్చు. వామపక్షాలకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలున్న బలం జనసేన ఇమేజ్‌కు కలిసొస్తుంది.

మైనస్ ఇదే : అర్హతా పరీక్షల ద్వారా పార్టీ నేతలను ఎంపిక చేసే ప్రకియను పలుచోట్ల జనసేన పార్టీ నాయకత్వం పూర్తిచేసినా ఇప్పటికీ ఆ పార్టీ నేతలు ఎవరు అన్నది ప్రజలకు అర్థంకాని పరిస్థితి. పవన్ కళ్యాణ్ సినీగ్లామర్ వల్ల జనసేనకు ప్రచారం తప్పా ప్రజల్లోకి వెళ్లినందుకు వచ్చిన గుర్తింపు ఇప్పటి వరకు పెద్దగాలేదు. 2014 ఎన్నికలకు ముందు తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో ఆరగేట్రంచేసిన జనసేనాని ఆ ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ప్రకటించి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఆ తరువాత నుంచి జనంలోకి రాని జనసేనాని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రతిపక్షాల విమర్శలతో 2016లోకి మళ్లీ తెరపైకి వచ్చారు. ఆ తరువాత ఏపీకి ప్రత్యేక హోదా, రాజధాని రైతులను పరామర్శించడం, కొన్ని జిల్లాలో పర్యటనలు, బహిరంగ సభలు పెట్టడం తప్పా ప్రజల పక్షాన పోరాడి గుర్తింపుతెచ్చుకొన్న సందర్భాలులేవు. ఉద్దానం కిడ్నీ బాధితులను పరామర్శించి, ఏపీ సీఎంను కలసి సమస్య పరిష్కారం కోసం కృషిచేయడం తప్పా ఇతర ప్రజా సమస్యలపై ఆయన ప్రత్యేక దృష్టిపసారించలేదన్న విమర్శలున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశం సెంటిమెంటుగా మారుతున్నా దీనిపై పవన్ కళ్యాణ్ కేవలం ట్విటర్ల ద్వార స్పందించడం తప్పా జనంలోకి మాత్రం ఆయన రావడంలేదు. ఒకవేళ ఆయన జనంలోకి వస్తే మాత్రం దాని ప్రభావం వేరుగా ఉంటుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

అస్త్రాలున్నా చేపట్టకుండా సన్యాసం ? : ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు పలు ప్రజా సమస్యలు ఏపీలో నెలకొని ఉన్నాయి. ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో ఈ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు తమ శక్తిమేర ఉద్యమాలు చేస్తున్నాయి. కానీ జనసేన పార్టీ ఆ మేర చొరవచూపడంలేదన్న విమర్శ ఉంది. కేవలం అర్హతా పరీక్షల ద్వారా పార్టీ క్యాడర్‌ను ఎంపికచేయడం, కొన్ని అంశాలపై ట్విటర్‌లో స్పందించడం వంటి వాటికే జనసేన నాయకత్వం పరిమితమవుతోంది. వచ్చే ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పోటీచేస్తామని జనసేన పార్టీ ప్రకటించింది. పోటీచేసే ఏ పార్టీ అయినా సరే ఎన్నికల ఏడాది గడువు ఉన్న సమయంలో స్పీడుపెంచుతాయి. తెలంగాణ ముందస్తు ఎన్నికలు రావడంతో ఎన్నికల్లో పోటీ చేయలేకపోయామని జనసేన అధినేత ప్రకటించారు. ఏపీలో అన్ని స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని జనసేనాని ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలోని ప్రజానికాన్ని ఎలా ఆకట్టుకొంటారు అన్నది ప్రస్తుతం చర్చాంశనీయంగా మారింది.

సభలు, పర్యటనలు ఓట్లు రాల్చుతాయా? : గత ఏడాది మార్చి 20న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పవన్ కళ్యాణ్ తన పర్యటనలను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభను నిర్వహించి, మే20 వరకు ప్రజాపోరాట యాత్ర కొనసాగించారు. అధికార పార్టీ, టీడీపీ నేతలపై విమర్శలు గుపిస్తు ప్రజా పోరాట యాత్ర కొనసాగించారు. ప్రజల కొరకు జనసేన పార్టీ ఉందని ప్రజలకు భరోసా ఇస్తూ, ప్రభుత్వ అవినీతిని ప్రజలకు తెలియ జేస్తు యాత్రను కొనసాగించారు. కొంత కాలం విరామం తరువాత ట్వీటర్ ద్వారా ప్రజలకు తన అభిప్రాయాలను తెలిపే ప్రయత్నం పవన్ కళ్యాన్ చేశారు. తూర్పుగోదావరి, విశాఖపట్నం, తూర్పుగోదావరిలో నవంబరులో తనపోరాట యాత్ర పాదయాత్ర లో అధికార,ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తు జనసేనను ఆదరించాలని ప్రజలసమస్యలు వింటూ తన ప్రజాపోరాట యాత్ర ముగించారు.

ప్రస్తుతం సినీగ్లామర్‌ను చూసి ఓట్లు వేసే పరిస్థితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో లేవు. కాకపోతే సినీగ్లామర్‌తోపాటు ప్రజల్లోకి వెళ్లి విశ్వాసం కల్పిస్తే మాత్రం జనసేనకు కొంత అవకాశముంది. కానీ ఆ ప్రయత్నంలోనే జనసేన అధినేత ఇంకా ఉన్నారని, వచ్చే ఎన్నికల నాటికి తన ప్రయత్నంలో సఫలమవుతారా అన్నది సందేహాస్పదంగా మారింది. గత కొన్నేళ్లుగా ఏ పార్టీ ఏం చేసింది అని ప్రజలు ఓ ఆలోచనకు వచ్చే పరిస్థితిలో తాము వస్తే రాజకీయాల్లో మార్పు తీసుకొస్తాం అని చెప్పే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పరిమిత కాలంలో ప్రజా విశ్వాసం పొందుతారా అన్నది రాజకీయవర్గాల్లో చర్చాంశనీయంగా మారింది. అయితే కాంగ్రెస్‌లో భవిష్యత్ లేదని, టీడీపీ, వైసీపీలో టిక్కెట్లు రాక అసంతృప్తితో వచ్చే వలసపక్షులతో జనసేనకు వచ్చే ఎన్నికల్లో కొంతప్లస్ కావచ్చు. ఈ వలస పక్షులు జనసేనకు బలమైతే, పవన్ కళ్యాణ్ సినీగ్లామర్ ఆయన పార్టీలోకి వచ్చే నేతలకు కొంత బలం కావచ్చు. ఇది వాస్తవం అయితే వచ్చే ఎన్నికల్లో మొత్తంగా జనసేన ప్రభావం ఎంత ఉంటుందని తేల్చిచెప్పడం ఇప్పటికిప్పుడు ఆసాధ్యమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

సూర్య లేఖలు

విధానం ఓడి .. ప్రధాని నెగ్గి .. గందరగోళంలో బ్రెగ్జిట్

యూరోపియన్ సమాఖ్య నుండి వైదొలగాలని నిర్ణయించుకున్న బ్రిటన్‌కు ఆ ముహూర్తం దగ్గర పడుతున్నా గందరగోళ పరిస్థితులు తప్పడం లేదు. ప్రస్తుత ప్రధాని తెరెసా మే ప్రతిపాదించిన విధివిధానాల ఒప్పందం పార్లమెంటులో ఆ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ పరాజయాన్ని పొందింది. అంటే దాదావు అందరూ ఆ రూపంలో ఉన్న ఒప్పందాన్ని తిరస్కరించి, ప్రధాని కి పాఠం చెప్పారు. ఆమె పై ప్రవేశపెట్టబడిన అవిశ్వాస తీర్మానాన్ని అలాగే ఓడించి మద్దతు ప్రకటించారు. ముందు రోజు ఆమె పాలసీని చెత్తబుట్టలోకి పంపి, రెండోరోజు ఆమె పదవీగౌరవాన్ని కాపాడారు. లేదంటే ఆమె రాజీనామా చెయ్యాల్సి వచ్చేది. ఆ స్థితి రాకూడదంటే విడాకుల ముహుర్తాన్ని వాయిదా వెయ్యమని అడగడం కానీ, లేదా సమాఖ్యలో కొనసాగుతామంటూ, అందుకు తగ్గట్టు ఆర్టికల్ 50 అమలుని వెనక్కి తీసుకోవడం కానీ ఆ దేశం చెయ్యాలి. సమాఖ్య వద్దంటూ ఇంతదూరం వచ్చాక అలా చెయ్యడం సబబేనా అన్నది ఒక అనుమానం.ఒక అవమానం. లేదా ఎటూ తెగని ఐర్లాండ్ సరిహద్దు వివాదాన్ని అధిగమిస్తూ కస్టమ్స్ విషయంలో సమాఖ్యతో కలిసే ఉండడం లాంటి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ప్రస్తుతానికైతే బ్రిటన్ ది, ముఖ్యంగా మే ప్రభుత్వానిది ఇరకాటం. గందరగోళం. యూరోప్‌లో రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పుల ప్రభావం అన్ని దేశాలపై ఉంటుంది కనుక అక్కడి పరిస్థితులు చక్కబడాలని ఆశిద్దాం.

–డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం,

కుల ప్రాతిపదిక సబబు కాదు

తాజాగా కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయటం కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే అని చెప్పక తప్పదు!ఈనాడు సమాజంలో అన్ని కులాల వారూ, మతాల వారూ కులాంతర, మతాంతర, ఖండాంతర వివాహాలు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆయా కులాల పెద్దలు కూడా వీటిని ఆమోదిస్తున్నారు కూడా! రాజకీయ నాయకత్వమే కులతత్వపోకడలకు ప్రోత్సాహమివ్వటం దురదృష్టకరం. ఆర్థిక,ఆదాయ నిబంధనలు కూడా మరిన్ని సమస్యలకు తావిస్తున్నది. ఈ నిబంధనలు అన్ని కులాల రిజర్వేషన్లకూ వర్తింపజేస్తారా? ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే పలు కులాలవారు తమను రిజర్వేషన్ పరిధిలోకి తీసుకురావాలని ఒత్తిడి పెంచుతున్నారు, ఈ పోకడలు సమాజంలో మరిన్ని ఘర్షణలకు ఆజ్యం పోయటం తప్ప నిజంగా పేదలకు ఒరిగేది శూన్యం? దేశంలో ఆ పార్టీ,ఈ పార్టీ అని లేకుండా, అన్ని రాజకీయ పక్షాలూ దివాళాకోరు రాజకీయాలకు తెరలేపుతూ, సమాజ మనుగడను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మేధావి వర్గమైనా, ఈ పోకడలను అడ్డుకునే ప్రయత్నం చెయ్యాలి!

– గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు.



జెట్ ఎయిర్‌వేస్‌లో రూ. 700 కోట్లు పెట్టుబడికి సిద్ధం

న్యూఢిల్లీ: ఆర్థిక కష్టాల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్‌లో రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆ సంస్థ ఛైర్మన్ నరేష్ గోయల్ ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీష్ కుమార్‌కు లేఖ రాశారు. ఇప్పటికే జెట్‌ఎయిర్‌వేస్‌లోని మరో వాటాదారు అయిన ఎతిహద్ 49శాతం వాటాల కొనుగోలు చేసేందుకు పలు షరతులు విధించిన విషయం తెలిసిందే. జెట్ ఎయిర్‌వేస్‌పై నరేష్ గోయల్ నియంత్రణను వదులుకోవాలని కూడా ఎతిహద్ తన షరతుల్లో పేర్కొంది.

తన మొత్తం షేర్లను తనఖా పెట్టి రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమేనని గోయల్ తెలిపారు. కానీ, ఈ మొత్తంతో కంపెనీలో తన వాటా 25శాతానికి తగ్గకూడదని షరతు విధించారు. ఇది ఒక వేళ సాధ్యంకాకపోతే నేను కంపెనీలో పెట్టుబడులు పెట్టడం, షేర్లను తాకట్టు పెట్టడం సాధ్యంకాదు. లేకపోతే టేకోవర్ నిబంధనలు అమలు చేయకుండా కంపెనీలో నా వాటా షేర్లను 25శాతానికి పెంచుకొనేలా సెబీ మినహాయింపును ఇవ్వాల్సి ఉంటుంది అని ఎస్‌బీఐ ఛైర్మన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. జెట్‌ఎయిర్‌వేస్‌కు ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకర్ల కన్సార్టియం రుణాలను ఇచ్చింది. జెట్ ఎయిర్‌వేస్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుండటంతో వాటాదారులు దీని పరిష్కారానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.



17-1-2019 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్		& నిఫ్టీ	
ఆరంభం	36,198.13	ఆరంభం	10,920.85
గరిష్ఠం	36,236.70	గరిష్ఠం	10,930.30
కనిష్ఠం	35,734.01	కనిష్ఠం	10,845.85
ముగింపు	**36,374.08**	ముగింపు	**10,905.20**
మార్పు (పా)	52.79	మార్పు (పా)	14.90
మార్పు (శా)	0.15	మార్పు (శా)	0.14

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	11,408.86	+16.45	+0.14
S&P BSE SENSEX Next 50	32,678.85	-52.44	-0.16
S&P BSE 100	11,180.60	+11.31	+0.10
S&P BSE Bharat 22 Index	3,469.41	+7.29	+0.21

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
SOBHA	501.90	+39.95	+8.65
LALPATHLAB	1,069.35	+55.05	+5.43
JETAIRWAYS	284.80	+13.80	+5.09
VAKRANGEE	48.15	+2.25	+4.90
MPHASIS	903.60	+41.75	+4.84

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
RELINFRA	296.40	-18.25	-5.80
SUNPHARMA	427.15	-26.20	-5.78
TV18BRDCST	36.00	-2.05	-5.39
DBL	384.25	-20.65	-5.10
TATASTEELPP	36.80	-1.85	-4.79

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
JETAIRWAYS	284.80	131.32	4812025
ICICIBANK	373.35	122.56	3274921
YESBANK	201.45	113.09	5551798
RELIANCE	1133.75	88.16	776161
SBIN	297.35	73.92	2476004

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	71.3418	యూరో	81.2583
యన్	65.51	పౌండ్	91.8616

ట్రంప్ రాజీనామా చేశారని ఫేక్‌న్యూస్ కలకలం



- 'వాషింగ్టన్ పోస్ట్' నకిలీ పత్రికల ప్రింట్
- తాటికాయంత అక్షరాలతో బ్యానర్ న్యూస్
- పండగ చేసుకుని, స్వీట్లు పంచుకున్న ప్రజలు
- రాజకీయ అనిశ్చితి పోవాలనే రాజీనామా అన్న ట్రంప్
- ప్రత్యేక దినపత్రికను ప్రచురించిన 'ది పబ్లిక్ సొసైటీ'
- ట్రంప్ యాల్టాకు వెళ్లనున్నారన్న కథనం
- అమెరికాలో చాలా చోట్ల ఉచితంగా పత్రిక పంపిణీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజీనామా చేశాడు. తల దించుకొని వైట్‌హౌజ్ నుంచి ఇంటిదారి పట్టాడు. ప్రపంచం మొత్తం సంబరాలు చేసకుంటోంది అని వాషింగ్టన్ పోస్ట్ పేరిట వెలువడిన ఓ ఫేక్ న్యూస్ సంచలనం రేకెత్తించింది. వాషింగ్టన్ డీసీలో బుధవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. తాటి కాయంత అక్షరాలతో.. ట్రంప్ రాజీనామా వార్త చూసి అక్కడి జనం షాక్‌కు గురయ్యారు. కొందరు నిజంగానే సంబరపడ్డారు. అమెరికాలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి నుంచి బయటపడేందుకే ట్రంప్ రాజీనామా చేశాడంటూ ఆ ఫేక్ వార్తలో చెప్పుకొచ్చారు. లీసా చంగ్ ఈ ఫేక్ న్యూస్‌ను రచించగా.. క్రిస్టినైన్ ఫ్లెమింగ్ డిజైన్ చేశారు. ది పబ్లిక్ సొసైటీ నుంచి ఈ పేపర్ పబ్లిష్ అయింది. జరిగేది అదే: వైట్‌హౌజ్ నుంచి తలదించుకొని వెళ్తున్న 4 కాలమ్స్ ఫొటో.. పాఠకులను ఆకట్టుకుంది. అయితే, పేపర్‌పై పబ్లిషింగ్ తేదీ 2019, మే 1 అని ఉండడంతో పాఠకుల కన్ఫ్యూజన్‌కు కొంత క్లారిటీ వచ్చింది. మొత్తం వార్త చదవగా అది ఫేక్ న్యూస్ పేపర్ తెలిసింది. ఏప్రిల్ 30, 2019 న ట్రంప్ అధికారం నుంచి దిగిపోతాడు. ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ అధ్యక్షుడవుతాడు.

జరిగేది ఇదే..! అందరిలా కాకుండా.. వినూత్నంగా.. వింతగా ఓ న్యాప్‌కిన్‌పై ఎర్ర సిరాతో తన ప్రత్యర్థులపై విమర్శలు రాసి పెట్టి పదవి నుంచి తప్పుకుంటాడు. అక్కడ నుంచి నేరుగా యాల్టా వెళ్తాడు అని సదరు ఫేక్ న్యూస్‌లో రాసుకొచ్చారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా మిత్ర దేశాల నాయకులు సమావేశమైన క్రిమియన్ హోటలే యాల్టా. కాగా, సమాచారం అందుకున్న వాషింగ్టన్ పోస్ట్ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా వెలువడిన ఫేక్ న్యూస్ పేపర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. ఈ చర్యతో వారికి ఒరిగేమీలేదని ఫేక్ న్యూస్ పబ్లిషర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. ఈ మేరకు ట్వీట్ చేసింది. తమ పత్రిక గౌరవానికి భంగం కలిగించినందుకు చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేసింది. ఇలాంటి పేపర్ మళ్లీ దొరకదు. వైట్ హౌజ్ దగ్గర ఉచితంగా ఈ పేపర్ ఇస్తున్నారు. వార్త బాగుంది అని ఓ నడివయసు మహిళ వ్యాఖ్యానించిందని పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. ఫేక్ న్యూస్ పేపర్ పంచుతున్న ఓ మహిళ వీడియో కూడా సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

భారత సంతతి వ్యక్తి రాజా కృష్ణమూర్తికి

యూఎస్‌లో కీలక పదవి

- ఇంటలిజెన్స్ విభాగంపై కాంగ్రెషనల్ కమిటీ ఏర్పాటు
- ఆ కమిటీలో సభ్యుడిగా రాజా కృష్ణమూర్తి
- ఈ కమిటీలో కృష్ణమూర్తి సహా నలుగురు సభ్యులు



వాషింగ్టన్: అమెరికాలో భారత సంతతికి చెందిన డెమోక్రాటిక్ పార్టీ ప్రజాప్రతినిధి రాజా కృష్ణమూర్తి. ఇంటెలిజెన్స్ విభాగంపై ఏర్పాటు చేసిన కాంగ్రెషనల్ కమిటీలో ఆయన్ని నియమించారు. ఇల్లినాయిస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజా కృష్ణమూర్తికి ఈ కమిటీలో నియమించడంతో కీలక పదవి లభించినట్టయింది. ఇంటెలిజెన్స్ పై నియమించిన హౌస్ పర్మినెంట్ సెలెక్ట్ కమిటీలో రాజా కృష్ణమూర్తికి అవకాశం లభించడంతో ఈ విభాగంలో పని చేయనున్నతొలి దక్షిణాసియా వ్యక్తిగా ఆయన రికార్డులకెక్కారు. కాగా, ఈ కమిటీలో రాజా కృష్ణమూర్తి సహా నలుగురు సభ్యులు ఉన్నారు. ఫ్లోరిడాకు చెందిన వాల్ డెమింగ్స్, న్యూయార్క్ కు చెందిన సేన్ పాట్రిక్ మలోని, వెర్మాంట్ కు చెందిన పీటర్ వెల్చ్‌లను ఈ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. అమెరికాలో 17 ఇంటెలిజెన్స్ ఏజెన్సీల పనితీరును, బడ్జెట్ ను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

ఈ పదవి ఇవ్వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా: రాజా కృష్ణమూర్తి: ఈ సందర్భంగా రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ, కమిటీలో తోటి వారితో కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నానని, తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇవ్వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ఉగ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు అమెరికా దేశ భద్రతకు ఎన్నో సవాళ్లు ఉన్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఉగ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు అమెరికా దేశ భద్రతకు ఎన్నో సవాళ్లు ఉన్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు ఇదిలా ఉండగా, తమిళ కుటుంబానికి చెందిన రాజా కృష్ణమూర్తి ఢిల్లీలో జన్మించారు. ఆ తర్వాత వీరి కుటుంబం న్యూయార్క్‌కు వెళ్లింది. ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేశారు. హార్వర్డ్ లా స్కూల్‌లో కూడా చదువుకున్నారు.

ఇండీట్రేడ్ సూక్ష్మ రుణ కార్యకలాపాలు



న్యూఢిల్లీ: ప్రముఖ ఇండీట్రేడ్ క్యాపిటల్ తన అనుబంధ సంస్థ జేఆర్‌జీ ఫిన్ కార్ప్ సాయంతో సూక్ష్మ రుణ కార్యకలాపాలు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇకపై సంస్థ రోబో క్యాష్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో సూక్ష్మ రుణాలను అందించనుంది. కంపెనీ వ్యక్తులకు స్వల్ప వ్యవధితో రూ. 1,000 నుంచి రూ. 25,000 వరకూ రుణాలను అందించనుంది. ఈ లోన్లను భారతీయ పౌరుడైవుండి 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగినవారికి అందించనున్నట్టు తెలిపింది. తక్కువ డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో రుణాలకు దరఖాస్తు చేయవచ్చని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా ఇండిట్రేడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ సందీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ రోబో క్యాష్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఒక్క రోజులో రుణం మంజూరవుతుందని తెలిపారు.

అదానీతో బీఏఎస్‌ఎఫ్ భాగస్వామ్యం




న్యూఢిల్లీ: జర్మనీలోని లడ్విగ్ షాపెన్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న బీఏఎస్ఎఫ్, ప్రముఖ అదానీ కంపెనీ గ్రూప్‌లు గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2019లో ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. అక్రిలిక్ వాల్యూ చెయిన్‌లో భారీ సంయుక్త పెట్టుబడుల మదింపుపై ఈ ఒప్పదం కుదిరింది. ఇప్పటివరకూ ఇది భారత దేశంలో బీఏఎస్‌ఎఫ్ అతిపెద్ద పెట్టుబడి కానుంది. ప్రతిపాదిత సైట్ గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌లో నెలకొనుంది. 2019 చివరినాటికి సాధ్యాసాధ్యాల అధ్యయనం పూర్తి కానుంది. అవగాహన ఒప్పందం ప్రకారం బీఏఎస్‌ఎఫ్, అదానీ సుమారు రూ. 16 వందల కోట్లతో ఒక జాయింట్ వెంచర్ ప్రారంభించనున్నాయి. ఇందులో బీఏఎస్‌ఎఫ్‌కు మెజారిటీ వాటా ఉండనుంది. ప్రొపెన్ డీహైడ్రోజెనేషన్, ఎక్సోఓ సీ 4 కాంప్లెక్స్, గ్లాసియల్ అక్రిలిక్ యాసిడ్ మొదలైన ఉత్పత్తులు ఈ పెట్టుబడిలో భాగం కానున్నాయి.

రిలయన్స్‌కు లాభించిన జియో దూకుడు

లాభాల్లో సరికొత్త రికార్డు

- మూడు నెలల్లో రూ. 10 వేల కోట్లకుపైగా లాభం
- ఇంత లాభం నమోదుచేసిన తొలి కంపెనీగా రికార్డు
- గత సంవత్సరంతో పోలిస్తే 9.1 శాతం పెరిగిన ఆదాయం



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ మూడో త్రైమాసికం ఫలితాలను వెల్లడించింది. గత త్రైమాసికంలో నమోదు చేసిన రూ. 681 కోట్ల లాభంతో పోలిస్తే, ఈ సారి 22.1 శాతం అధికంగా రూ. 831 కోట్ల లాభాన్ని సాధించింది జియో. మూడో త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 7.7 శాతం వృద్ధితో రూ. 10,251 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో రూ. 10,000 వేల కోట్ల లాభాన్ని నమోదు చేసిన తొలి కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీ నిలిచింది. కంపెనీ యొక్క స్థూలమైన ఆదాయం 9.1 శాతం వృద్ధితో రూ. 1.56 లక్షల కోట్లుగా నమోదైంది. గ్లోబల్ వ్యాపార వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నా, స్థిరమైన పనితీరు కారణంగా మంచి ఫలితాలు సాధించామని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అండ్ ఎండి ముఖేష్ ధీరూభాయ్ అంబానీ తెలిపారు. రిటైల్, జియోల్లో కంపెనీ గణనీయమైన వృద్ధి సాధించిందని, కంపెనీ లాభాలు పెరగడంలో ఇది కూడా కీలకమని ఆయన అన్నారు. గత త్రైమాసికంలో నమోదు చేసిన రూ. 681 కోట్ల లాభంతో పోలిస్తే... ఈ సారి 22.1 శాతం అధికంగా రూ. 831 కోట్ల లాభాన్ని రిలయన్స్ జియో సాధించింది. కంపెనీ మొదలుపెట్టిన రెండో ఏడాదిలోనే రిలయన్స్ జియో పది వేల త్రైమాసిక ఆదాయాన్ని నమోదు చేసింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 12.4 వృద్ధిని నమోదు చేసిన జియో రూ. 10,383 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కొత్తగా 2.70 కోట్ల మంది కస్టమర్లు జియోలోకి వచ్చారు. దీంతో జియో కస్టమర్ల సంఖ్య 28 కోట్లకు చేరింది.

ఉపాధి కల్పనపై ఆజాద్ ఫౌండేషన్ సదస్సు



న్యూఢిల్లీ: ప్రముఖ ఆజాద్ ఫౌండేషన్ పేద మహిళలకు సాంప్రదాయేతర ఉపాధి మార్గాల కల్పనపై తొలిసారిగా అంతర్జాతీయ సదస్సు ప్రారంభించింది. ఈ సదస్సు మూడు రోజులపాటు జరగనుంది. ఈ సందర్భంగా ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మీను వదేరా మాట్లాడుతూ గ్రామీణ పేద మహిళలకు సాంప్రదాయేతర ఉపాధి మార్గాల కల్పనపై చర్చించేందుకు అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేశాం. ఆధునిక మార్గాలలో వారికి ఉపాధి కల్పించేందుకు చర్చించనున్నాం. స్త్రీ, పురుషులు అనే బేధం లేకుండా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కాగా ఆజాద్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన ఉమెన్ ఆన్ వీల్స్ కార్యక్రమం విజయవంతమైంది. దీనిలో భాగంగా 1600 మందికి ఉపాధి కలిగింది.

పెగాసిస్టమ్స్ డైరెక్టర్‌గా రాన్‌హొవాస్పెయిన్



బెంగళూరు: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ పెగాసిస్టమ్స్ సంస్థగత బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో రాన్‌హోవాస్పెయిన్‌కు భాగస్వామ్యం కల్పించింది. రాన్‌హోవాస్పెయిన్‌కు బీటూబీ లీడర్‌షిప్‌లో 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రసుతం హోవాస్పెయిన్ ఇంటర్‌లింక్ ఇంక్‌లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఆయన బోస్టన్ కాలేజీ నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. నోవెల్ కంపెనీలో రాన్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. అలాగే ఐబీఎంలో 16 ఏళ్లపాటు ఎగ్జిక్యూటివ్ పోజీషన్‌లో ఉన్నారు.

క్యాషిఫై డాట్ ఇన్‌తో వివో భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ప్రముఖ వివో ఇండియా తాజాగా తన అభిమానుల కోసం వివో ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా వినియోగదారులు తమ పాత ఫోన్లను నూతన వివో స్మార్ట్‌ఫోన్ కు అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. ఇందుకోసం సంస్థ వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకోవచ్చిన సంస్థ తెలిపింది. దీనికితోడు ఇతర స్మార్ట్ ఫోన్ల వినియోగదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని వివో తెలిపింది. ఈ అవకాశాన్ని ఈ నెల 19 వరకూ కల్పించనున్నట్టు వివో పేర్కొంది.కాగా వినినియోగదారుల అభిరుచులకు వివో ఎల్లప్పుడూ పెద్ద పీట వేస్తుందని వివో ఇండియా సీనియర్ వీపీ జెరోమి ఛాన్ తెలిపారు.

సేవ్‌థాన్ ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో సామాజిక సంబంధిత సమస్యలను అధిగమించేలా ప్రజల్లో జాగృతి కల్పించే దిశలో 10 కే, 5 కే రన్‌లతో తన రెండవ ఎడిషన్ సేవ్‌థాన్‌ను నిర్వహిస్తున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. ఈ ఏడాది రన్ ఫన్ గ్రీన్ పేరిట హైదరాబాద్ నగ రవ్యాప్తంగా 25,000 మొక్కలను పంపిణీ చేయనుంది. ప్రతీ కిలోమీటరుకు ఒక మొక్క చొప్పున నాటించనున్నారు. హెచ్‌డీఎంఏ అటవీశాఖ ఈ కార్యక్రమానికి మద్దతు పలుకుతూ 25,000 మొక్కలను అందించింది. కాగా ఈ పరుగులో 8 వేల మంది పాల్గొంటారని నిర్వాహకులు భావిస్తున్నారు.

వీనస్ వార్షిక సదస్సును ప్రారంభించిన గవర్నర్



హైదరాబాద్: వీనస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సు హైదరాబాద్‌లో ఈరోజు ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఈ సదస్సును ప్రారంభించారు. గౌరవనీయ అతిథులుగా డాక్టర్ సంగీతా రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్, డాక్టర్ రఘురామ్ పీ, అధ్యలు, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (2019); డాక్టర్ రావుల్ జిందాల్, అధ్యలు, వీఏఐ, ప్రొఫెసర్ పింజల రామకృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతదేశంతోపాటు ఇతర దేశాలకు చెందిన దాదాపు 350 మందికి పైగా డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు,ఫిజియోథెరపిస్ట్‌లుమరియుఫ్యాకల్టీలు మూడురోజుల సదస్సులోపాల్గొంటున్నారు.

19న సెంట్రల్‌లో రెడ్ హాట్ ఆఫర్లు

ముంబై: భారతదేశం యొక్క అభిమాన ఫాషన్ డిపార్టుమెంటు స్టోర్ సెంట్రల్ జనవరి 19న రెడ్ హాట్ శనివారం నిర్వహించనున్నట్లు తెలిపింది. సెంట్రల్ లో ప్రతిదీ ఈ శనివారం ఫ్లాట్ 50శాతం డిస్కౌంట్ వద్ద ఉంటుంది. అలాగే, దుకాణదారులకు ఫ్యూచర్ పే ద్వారా లభించే వారి సెంట్రల్ వాలెట్లో రూ. 3000 కనీస కొనుగోలుతో 50 శాతం క్యాష్ బ్యాక్ పొందుతుంది. ఈ రెడ్ హాట్ శనివారం అదనపు ప్రయోజనాలను పొందడానికి, వినియోగదారులు రెడ్ హాట్ ఎంట్రీ పాస్ అందుకోవచ్చు. పేరు నమోదు చేసుకున్న ఫ్యాషన్ ప్రేమికులు పలు డిస్కౌంట్లు అందుకోవచ్చు. కాగా సెంట్రల్‌లో పురుషులు, లేడీస్ ఫార్మల్ వేర్, సాధారణం వేర్, ఎత్నిక్ వేర్, హ్యాండ్ బ్యాగులు, మెన్స్, లేడీస్ పాదరక్షలు, టాయ్స్ కిడ్స్ దుస్తులు మొదలైనవి అందుబాటులో ఉంటాయి.

24 గంటల్లో రూ. 100 కోట్లు కట్టండి

- ఫోక్స్‌వ్యాగన్‌కు ఎన్‌జీటీ షాక్
- ఫోక్స్‌వ్యాగన్ వాహనాల్లో 40 రెట్లు నైట్రస్ ఆక్సైడ్స్
- జరిమానా చెల్లించకుంటే సంస్థ ఎండీ అరెస్ట్
- ఆపై ఆస్తులు సీజ్ చేయక తప్పదు
- ఏదికావాలో తేల్చుకోవాలన్న గ్రీన్ ట్రైబ్యునల్



న్యూఢిల్లీ: జర్మన్ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్‌కు ఊహించని షాక్ తగిలింది. తప్పుడు డీజిల్ మీటర్లతో వినియోగదారులను మోసం చేశారంటూ దాఖలైన కేసుకు సంబంధించి న్యూఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) రూ.100కోట్లు చెల్లించాలని సూచించింది. ఒక్క 2006 ఏడాదిలోనే దాదావు 3.17లక్షల వాహనాల ద్వారా వాస్తవానికంటే 40రెట్లు నైట్రస్ ఆక్సైడ్స్ () విడుదల చేసిందన్న ఫిర్యాదుపై 24 గంటలలోగా సెంట్రల్ కాలుష్య నియంత్రణ బోర్డుకు జరిమానా సొమ్మును డిపాజిట్ చేయాలని జనవరి 17న ఆదేశించింది. లేని పక్షంలో సంస్థ భారత్ విభాగం ఎండీని అరెస్టు చేయడంతోపాటు సంస్థకు చెందిన ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ ఆదర్శ్ కుమార్ నేతృంలోని నలుగురు సభ్యుల బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలపై , అనేక కేసులను ఎదుర్కొంటున్న ఫోక్స్ వ్యాగన్ ఇండియా భారతదేశంలో కూడా వాహనాల్లో నైట్రస్ ఆక్సైడ్ను అనుమతించదగిన పరిమితులను అధిగమించి వాడిందని, తద్వారా ఢిల్లీ నగరంలో అటు పర్యావరణానికి ఇటు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించిందని తెలిపింది.

కాగా ఈ కేసులో 171.34 కోట్ల రూపాయలను చెల్లించాల్సిందిగా గత ఏడాది నవంబరు 16న ఆదేశించింది. ఈ విషయాన్ని దర్యాప్తు చేయడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఆరోపణలను సమర్థించిన కమిటీ జరిమానా విధించాలని సిఫార్సు చేసింది. కానీ సంస్థ జరిమానా సొమ్మునుజమలేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన100కోట్ల రూపాయలను చెల్లించాల్సిందిగా తాజా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు తమ వాహనాలు దేశంలో స్టేజ్4 నిర్దేశించిన ఉద్గార నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని ఫోక్స్‌వ్యాగన్ ఇండియా పేర్కొంది.

బీఎంజేలో సరికొత్త జ్యూలరీ కలెక్షన్



హైదరాబాద్: ప్రముఖ హౌస్ ఆఫ్ బీఎంజే ఇండియన్ జ్యూలయరీ ఇండస్ట్రీలో ఎంతో పేరుగాంచింది. తాజాగా సంస్థ ఈనెల 19, 20 తేదీలలో తరాష్ పేరిట అత్యద్భుత డైమండ్ జ్యూలరీ కలెక్షన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో పోల్కి, డైమండ్ జ్యూలరీ ప్రధాన ఆకర్షణ కానున్నాయి. ప్రదర్శనలో ఉంచిన ప్రతీ ఆభరణాన్ని ఎంతో కళాకృతి ఉట్టిపడేలా రూపొందించారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆధునికత సంప్రదాయ మేళవింపుతో ఈ ఆభరణాలు రూపొందించారు. జైపూర్‌కు చెందిన ఎంబీసన్స్ బ్రాండ్ 25 ఏళ్లుగా జ్యూలరీ రూపకల్పనలో అపార అనుభవాన్ని కలిగివుంది.

వై.ఎస్.జగన్ లండన్ పర్యటన రద్దు



విజయవాడ, మేజర్‌న్యూస్: వైసీపీ అధినేత, ఏపీ ప్రధాన ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లండన్ పర్యటన రద్దు చేసుకున్నారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి జగన్ హైదరాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేడెక్కాయి. ఈ నేపథ్యంలో వై.ఎస్.జగన్ లండన్ పర్యటన రద్దు చర్చాంశనీయంగా మారింది. పాదయాత్ర అనంతరం సుమారు 15 నెలల తర్వాత తన పెద్ద కుమార్తె వర్షారెడ్డిని చూడటానికి కుటుంబంతో కలిసి లండన్‌కు వెళ్లాలనుకున్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ టూర్ రద్దైంది. ఇదిలా ఉంటే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఇద్దరూ విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవడంతో రాష్ట్ర రాజకీయాలలో ఏదో అలజడి మొదలవుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వరుస భేటీలు, అర్ధరాత్రి వరకూ పార్టీ నేతలతో సమీక్షలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. పూర్తిగా అభ్యర్థుల ఎంపికపైనే దృష్టిసారించారు. దీంతో పర్యటనను రద్దు చేసుకున్న వైఎస్ వ్యూహ రచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. వైఎస్ జగన్ కూడా అభ్యర్థుల ఎంపికలపై వరుస సమీక్షలతో బిజీబిజీగా గడపనున్నారని తెలుస్తోంది.

అయితే పండుగ తర్వాత అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి పలువురు జంప్ చేస్తారని ఎప్పట్నుంచో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దీంతో అటు అధికార పార్టీ అధినేత ఇటు వైసీపీ అధినేత ఇద్దరూ విదేశీ పర్యటనలు రద్దు చేసుకొని వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

వచ్చే ఎన్నికల్లో మనమే కీలకం

కర్నాటక తరహాలో చక్రం తిప్పుదాం ?


• జనసేన, లెఫ్ట్ కూటమి సమాలోచనలు • జిల్లా నేతల సమీక్షల్లో మనస్సులో మాట బయటపెట్టిన పవన్ ? • కనీసంగా యాభైస్థానాల్లో పాగా వేసేలా కార్యచరణ • కర్నాటక పరిణామాలు ఏపీలో పునరావృతం చేయాలన్న యోచన ? • తోక పార్టీలన్న ముద్ర చెరిపేసుకొనేందుకు వామపక్షాల యత్నం • ఎన్నికల నాటికి ఆప్, లోక్‌సత్తాలను ఆహ్వానించాలని యోచిస్తున్న జనసేన, లెఫ్ట్ కూటమి • టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీజేపీయేతర పక్షాలను కలుపుకొని పోవాలని నిర్ణయం?

(ఏపీ–పొలిటికల్ బ్యూరో) : వచ్చే ఎన్నికల్లో మనమే కీలకమన్న ధీమాను జనసేన పార్టీ నాయకత్వం తన పార్టీ శ్రేణుల్లో నింపేందుకు సిద్ధమవుతోంది. త్రిముఖ పోరులో వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటులో తాము కీలకం కాబోతున్నామని ఇప్పటికే పలు సమావేశాలు, పార్టీ నేతల భేటీలలో పవన్ కళ్యాణ్ అన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అందుకు తగ్గ వ్యూహాలను ఇప్పటినుంచే పదునుపెట్టాలని జనసేన పార్టీ నాయకత్వం కసరత్తుచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వచ్చే ఎన్నికల్లో వామపక్షాలతో తప్పా ఏ ఇతర పార్టీలతో కలసిపనిచేసేది లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇటీవల ఓ ప్రకటన ద్వారా స్పష్టంచేసిన విషయం తెలిసిందే. జనసేనాని తీసుకొన్న ఈ నిర్ణయానికి కారణం కర్నాటకలో త్రిముఖపోరు వల్ల మెజార్టీ లేకపోయినా జేడీఎస్‌కు అధికారం వరించడం. ఇదే ఫార్ములాను వచ్చే ఎన్నికల్లో ఏపీలో తాము అమలు చేయాలని జనసేన, వామపక్ష కూటమి ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జనసేనా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వచ్చే ఎన్నికల్లో తామే కీలకమవుతామన్న సందేశం తన పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన రాజకీయాలకు భిన్నమైన వాతావరణ మున్ముందు కనిపించబోతోందా...? గతంలో ప్రతి ఎన్నికల్లో ఈ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎప్పుడూ రెండు ప్రధాన పార్టీల మధ్యే పోటీ అన్న పరిస్థితుల్లో 2019లో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించనున్నాయా అంటే అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. తోక పార్టీలుగా తమపై పడ్డ ముద్రను చెరిపేసుకోవాలని వామపక్ష పార్టీలైనా సీపీఎం, సీపీఐలు సమాలోచనలు చేస్తుండగా, ఆ పార్టీలతో జతకట్టి వచ్చే ఎన్నికల్లో పోటీకి సై అని జనసేనాని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కర్ణాటక రాష్ట్ర ఎన్నికల అనంతరం మారిన రాజకీయ సమీకరణలు జనసేన, లెఫ్ట్ కూటమికి ఆశాజనకంగా మారాయి. ఏపీకి ప్రత్యేక హోదా కోసం అన్ని పార్టీలు పోరాడుతున్న విషయం తెలిసిందే. అందులోనూ వచ్చే ఎన్నికల్లో పలు కూటములు ఏపీలో ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో సంకర్ణ రాజకీయాలకు అవకాశముందని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఏపీలో కనీసంగా యాభై నుంచి నలభై ఎమ్మెల్యే స్థానాలు దక్కించుకొన్నా సంకీర్ణ ప్రభుత్వానికి అవకాశముంటుందని, పరిస్థితులు కలిసొస్తే ప్రభుత్వంలో చక్రం తిప్పవచ్చని వామపక్ష, జనసేన కూటమి సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలావుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో పోటీచేస్తామని జనసేన పార్టీ వెల్లడించిన విషయం తెలిసిందే.

త్రిముఖ పోటీతో చిగురిస్తున్న ఆశలు ?

వచ్చే 2019 ఎన్నికల్లో ఏపీలో త్రిముఖ పోరు తప్పదని ఇప్పటికే స్పష్టమైన విషయం తెలిసింది. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకుండా ఒంటరిగానే



పోటీచేస్తామని వైసీపీ పేర్కొంది. ఇక కాంగ్రెస్‌ను కలుపుకొని వచ్చే ఎన్నికల బరిలో టీడీపీ దిగుతుందా లేదా అన్నది మరో వారంలో స్పష్టత వచ్చే అవకాశముంది. వామపక్షాలతో కలసి వచ్చే ఎన్నికల బరిలోకి దిగుతామని ఇప్పటికే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టంచేసిన విషయం తెలిసిందే. ఇక బీజేపీ కూడా ఏపీలో ఒంటరిగా బరిలోకి దిగనున్నది. అయితే ఆ పార్టీ ప్రభావం ఏ రకంగా చూసినా వచ్చే ఎన్నికల్లో నామమాత్రమేనని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ తరుణంలో ఏపీలో వచ్చే ఎన్నికల్లో ప్రధానంగా త్రిముఖ పోరు ఉంటుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలావుంటే ఈ త్రిముఖ పోరు నేపథ్యంలోనే జనసేన, లెఫ్ట్ కూటమిలో ఆశలను పెంపొందిస్తున్నాయి. బలమైన మూడు పక్షాలు బరిలోకి దిగితే ఓటర్లు చీలడంతోపాటు వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాదని జనసేన, లెఫ్ట్ కూటమి అంచనా వేస్తోంది. వచ్చే ఎన్నికల్లో అధికార టీడీపీకి వ్యతిరేకత ఉన్నా ఆ పార్టీ చేపట్టిన ఏపీకి ప్రత్యేక హోదా అంశంతోపాటు కాంగ్రెస్‌తోడైతే మాత్రం తెలుగుదేశం పార్టీ పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంటుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీకి జనంలో మంచి ఆదరణయే ఉన్నా మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో వైసీపీకి ఏకపక్ష మెజార్టీ వస్తుందన్న అంశాన్ని ఇప్పటికిప్పుడే అంచనావేయలేమని చెబుతున్నారు. ఇక ప్రజా ఉద్యమాలతో జనంతో మమేకమయ్యే వామపక్షాలను కలుపుకొని జనసేన పార్టీ బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. పవన్ కళ్యాణ్ సినీ గ్లామర్, కాపు సామాజిక వర్గం అండ కలిసొస్తుందని ఈ కూటమి అంచనావేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ స్థానాల్లో కనీసంగా యాభై నుంచి నలభై స్థానాలను సొంతం చేసుకొంటే అప్పై ఏర్పడ్డే సంకీర్ణ ప్రభుత్వంలో తమ పాత్ర కీలకంగా ఉంటుందని వామపక్ష, జనసేన కూటమి అంచనావేస్తోంది. కర్ణాటక తరహా రాజకీయాలు ఇక్కడా ఉత్పన్నమైన ఆశ్చర్యపోనక్కర్లేదని వారు భావిస్తున్నారు. ఈ పరిస్థితులను అవకాశంగా మల్చుకోవాలని లెఫ్ట్, జనసేన కూటమి భావిస్తున్నట్లు సమాచారం.


తమ కూటమి కనీసంగా నలభై సీట్లు సాధిస్తే మిగితా 135 సీట్లలో టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ వాటా ఉంటుందని, అప్పుడు సంకీర్ణ ప్రభుత్వానికే అవకాశాలు మెండుగా ఉంటాయని లెఫ్ట్, జనసేన కూటమి భావిస్తోంది. త్రిముఖ పోరుకు సిద్ధపడటంవల్లే కర్ణాటకలో కుమార స్వామి పార్టీకి పూర్తి మెజార్టీ లేకపోయినా ఆయన సీఎం అయ్యారని వారు చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమయ్యే మ్యాజిక్ ఫింగర్ ఎమ్మెల్యే సీట్లు రాకపోయినా అతిపెద్దపార్టీగా బీజేపీ అక్కడ అవతరించింది. కానీ బీజేపీని గద్దెనెక్కకుండా చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ తన మద్దతుతో జేడీఎస్ అభ్యర్థి కుమారస్వామిని సీఎం చేసిన విషయం తెలిసిందే. ఏపీలో కూడా త్రిముఖ పోరు వల్ల సంకీర్ణ ప్రభుత్వానికి ఆస్కారముంటే సీఎం సీటు కాకపోయినా ఆ తరువాత కీలక స్థానం తీసుకొని ఏపీ రాష్ట్ర రాజకీయాలలో చక్రం తిప్పవచ్చని లెఫ్ట్, జనసేన కూటమి భావిస్తోంది. ఇప్పటి వరకైతే సమస్యల ప్రాతిపదికన కలసి పనిచేయాలని లెఫ్ట్, జనసేన భావిస్తోంది. ఎన్నికలు సమీపించే కొద్ది ఆమ్ ఆద్మీ పార్టీ, లోక్‌సత్తా వంటి పక్షాలను కూడా తమ కూటమిలోకి ఆహ్వానించి టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, వైసీపీ పక్షాలకు వ్యతిరేకంగా పోటీచేయాలని లెఫ్ట్, జనసేన కూటమి భావిస్తోంది. తద్వారా రాష్ట్ర రాజకీయాలలో చక్రం తిప్పాలని ఈ కూటమి యోచిస్తోంది.

లోక్‌పాల్ నియామకంపై సుప్రీం కోర్టు గడువు




న్యూఢిల్లీ : లోక్‌పాల్ నియామకానికి అభ్యర్థుల పేర్లను సిఫారసు చేయాలని సెర్చ్ కమిటీని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ జాబితాను సమర్పించేందుకు ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు విధించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ సెర్చ్ కమిటీకి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం వహిస్తున్నారు. సెర్చ్ కమిటీ లోక్‌పాల్ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సమర్థంగా నెరవేర్చేందుకు వీలుగా తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలను కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 7న జరుగుతుందని తెలిపింది. ఈ ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ రంజన్ గోగోయ్‌తో పాటు జస్టిస్ ఎల్ఎన్ రావు, జస్టిస్ ఎస్‌కే కౌల్ కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు.

డేరా బాబా రామ్ రహీమ్‌కు జీవిత ఖైదు



న్యూఢిల్లీ : డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్‌కు జీవిత ఖైదు విధిస్తూ పంచకుల స్పెషల్ సీబీఐ కోర్టు గురువారం తీర్పు చెప్పింది. పాత్రికేయుడు రామచంద్ర ఛత్రపతి హత్య కేసులో ఆయన దోషి అని కోర్టు ఇటీవల నిర్ధారించిన సంగతి తెలిసిందే. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ విచారణ జరిగింది. రామ్ రహీమ్‌కు గురువారం శిక్ష ప్రకటించనుండడంతో ముందుగానే హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం ఉన్న పంచకుల, సిర్సాలో 144 సెక్షన్ విధించారు. పంచకుల న్యాయస్థానం సముదాయంలో చుట్టుపక్కల బారికేడ్లతో భద్రత ఏర్పాట్లు చేశారు. రామ్ రహీమ్ ప్రస్తుతం ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన రోహ్‌తక్‌లోని సునరియా జైలులో ఉన్నారు. ఆయనను కోర్టుకు తరలిస్తే శాంతి భద్రతల సమస్య ఎదురు కావచ్చునని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీంతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ జరిపేందుకు కోర్టు అంగీకరించింది.

సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు... ఎందుకంటే ?



విజయవాడ, మేజర్‌న్యూస్: సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన రద్దయినట్లు ప్రకటించారు. ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై దృష్టి సారించేందుకు పర్యటన రద్దు చేసుకున్నట్లు తెలిపారు. పార్టీ నేతల సూచనతో సీఎం పర్యటన రద్దు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇదిలావుంటే ఇప్పటికే మంత్రి లోకేష్ దావోస్ పర్యటన ఖరారైంది. దావోస్‌లో సీఎం హాజరయ్యే సమావేశాల్లో లోకేష్ పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈనెల 21న మధ్యాహ్నం ఏపీ కేబినెట్ సమావేశం జరగనుంది.

ఎన్‌ఐఏ కస్టడీకి కిడారి హత్యకేసు నిందితులు



విజయవాడ, మేజర్‌న్యూస్: అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో నిందితులు సుబ్బా రావు, ఈశ్వరి, శోభన్‌లను నాలుగు రోజులపా టు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) కస్టడీలోకి తీసుకునేందుకు న్యాయమూర్తి అంగీకరిం చారు. ఈ కేసులో మిగిలిన ముగ్గురు నిందితు లకు ఈ నెల 31 వరకు ఎన్ఐఏ కోర్టు రిమాం డ్ విధించింది. ఈ నేపథ్యంలో నిందితులను విశాఖపట్నం జైలుకు తరలించారు. ఇదిలావుంటే గతేడాది సెప్టెంబర్ 23న కిడారి, మాజీ ఎమ్మెల్యే సోమను మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా డుంబ్రిగూడ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ క్రమంలో ఈ కేసు దర్యాప్తు చేపట్టాలంటూ కేంద్ర హోంశాఖ ఈ ఏడాది నవంబర్ 30న ఎన్ఐఏను అదేశించింది.

భారతీయ జనతా పార్టీకి విరాళాల వెల్లువ

• ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు • దాదాపుగా భట్టికే ఛాన్స్ • వర్గ సమీకరణలో శ్రీధర్‌బాబు అభ్యర్థిత్వం పక్కకు?

హైదరాబాద్, సూర్య ప్రధాన ప్రతినిధిః సీఎల్పీ నేత కోసం ఎమ్మెల్యేల అభిప్రా యాలను వేణుగోపాల్ స్వీకరించారు. ఇంద ుకోసం ఒక్కొక్కరితో విడివిడిగా అభిప్రా యాలను సేకరించారు. సీఎల్పీ పదవికి పోటీ పడుతున్న భట్టివిక్రమార్క మల్లు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు అందరు హాజరయ్యారు. అనంతరం మీడియాపాయింగ్ వద్ద వేణుగోపాల్ మీడి యాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేల అభిప్రా యాలను పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అందజేస్తాన్నారు. ఆయన నిర్ణయం మేరకు సీఎల్పీ నేత ఎన్నిక జరుగుతుందన్నారు. ఇందుకు అందరు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

సీఎల్పీ నేతగా భట్టి : సీఎల్పీ నేతగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యుడుకాంగ్రెస్ పార్టీ రూ.20 కోట్లు విరాళాలుగా అందుకు న్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి కనీసం రూ.20వేలు కూడా రాలేదని తెలిసింది. కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అందుకున్న విరాళాల కంటే బీజేపీకి వచ్చిన విరాళాలు 12 రెట్లు ఎక్కువ. మొత్తం 4,201 మంది జాతీయ పార్టీలకు విరాళాలు ఇవ్వగా.. అందులో 2,977 మంది బీజేపీకి, 777 మంది కాంగ్రెస్‌కు, 42 మంది ఎన్సీపీకి, 196 మంది సీపీఎమ్‌కు, 176 మంది సీపీఐకి, 33 మంది తృాఎణమూల్‌కు విరాళాలు ఇచ్చినట్లు సదరు నివేదిక తెలిపింది. 2016–17తో పోల్చుకుంటే ఈ ఏడాది జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాలు 20 శాతం తగ్గినట్లు ఏడీఆర్ పేర్కొంది. ఆ ఏడాది అన్ని పార్టీలకు కలిపి రూ.589.38 కోట్లు విరాళాలు రాగా.. 2017 – 18 ఏడాదికి గాను రూ.469.89 కోట్ల విరాళాలు వచ్చాయని తెలిపింది.



ఎన్నికలకు జనసేన సమాయత్తం



విజయవాడ, మేజర్‌న్యూస్: వచ్చే 2019 ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధమవుతోంది. ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జనసేన నేతలు, కార్యకర్తలను ఎన్నికల పోటీకి సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా పార్లమెంటరీ కమిటీల ఎంపిక కసరత్తు పూర్తి చేశారు. 25 పార్లమెంట్ స్థానాల నియోజకవర్గ నేతలకు స్థానం కల్పిస్తూ తుది జాబితాను రెడీ చేశారు. శుక్రవారం తుది జాబితాను పరిశీలించి, 20న కమిటీలను ప్రకటించనున్నారు. నేతలు, కేడర్‌కు విడివిడిగా కమిటీలను ఏర్పాటు చేయనున్నారు పవన్ కల్యాణ్. ఇదిలావుంటే పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. జనసేన పార్టీకి ఎన్నికల కమిషన్ గ్లాజు గ్లాసు గుర్తు కేటాయించింది.

సిఎంతో డిజిపి భేటీ



విజయవాడ, మేజర్‌న్యూ: ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయ త్నానికి సంబంధించిన కేసును ఎన్ఐఏకు అప్పగించ డంపై ఏపీ ప్రభుత్వం నిరాకరిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఏపీ సీఎం చంద్రబాబు డీజీపీ ఠాకూర్ భేటీ అయ్యారు. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో వైఎస్ జగన్‌పై జరిగిన హత్య కేసును ఎన్ఐఏకు అప్పగించడం, హైకోర్టులో వేసిన పిటిషన్ చర్చించినట్టు తెలుస్తోంది. వైఎస్ జగన్ కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం నేడు హైకోర్టులో పిటిషన్ వేయాలని ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించిన విచారణకు ఏపీ సిట్ అధికారులు సహకరించకపోవడంపై ఆగ్రహించిన ఎన్ఐఏ అధికారులు విజయవాడ కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే.

మొదటి పేజీ తరువాయి

కొలువుదీరిన కొత్త సభ



అయిదుగురు సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ, జాఫర్‌హుస్సేన్, టీడీపీ సభ్యుడు సండ్రవెంకటవీరయ్య, టీఆర్ఎస్ సభ్యుడు మాధవరం కృష్ణారావు, బీజేపీ సభ్యుడు రాజాసింగ్ ప్రమాణ స్వీకారం చేయలేదు.


పార్టీల కండువాలతో హాజరు...

కొత్తగా కొలువుదీరిన సభకు తమ తమ పార్టీలకు చెందిన కండువాలు ధరించి ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముఖ్యంగా విలేఖరిగా పనిచేస్తూ ఎమ్మెల్యేగా ఎన్నికైన కాంత్రికిరణ్ 'పెన్నులదండ'తో హాజరయ్యారు. అసెంబ్లీ ఆవరణలో తన మీడియా స్నేహితులు క్రాంతికిరణ్‌కు పెన్నుదండా వేసి ఘనంగా సత్కరించారు. మిగతా టీఆర్ఎస్ సభ్యులు తమ పార్టీ గులాబికండువా ధరించి సభకు హాజరయ్యారు. కాంగ్రెస్ సభ్యులు సీఎల్పీ సమావేశం అనంతరం మూడురంగుల కండువాకప్పుకొని సభకు హాజరయ్యారు. అయితే టీడీపీకి చెందిన మచ్చా నాగేశ్వర్‌రావు పచ్చచొక్కా ధరించి ముందుగా దివంగతనేత ఎన్టీఆర్‌ఘాట్‌లో నివాళ్లర్పించి సభకు హాజరయ్యారు.

హుషారుగా కొత్త సభ్యులు...

మొదటిసారిగా ఎమ్మేల్యేగా ఎన్నికైన కొత్తసభ్యులు సభలో, బయట హుషారుగా కనిపించారు. కొంత మంది ప్రమాణ స్వీకారం చేసే సమయంలో తడగా, మరికొందరు తడబడకుండా ప్రమాణం చేయించారు. ప్రమాణం చేసిన వెంటనే ప్రొటెం స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపి సీఎం కేసీఆర్‌కు నమస్కరించారు. టీఆర్ఎస్‌కు చెందిన ఆజ్మీరా రేఖానాయక్ ప్రమాణం చేసిన తర్వాత సీఎం కేసీఆర్ కాళ్లకు దండంపెట్టుకున్నారు. అలాగే దేవరకదిర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సీఎం కాళ్లకు దండంపెట్టుకున్నవారిలో ఉన్నారు. కాలుగాయంతో బాధపడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న వీల్‌చైర్‌పై వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు.

విద్యతోనే భవిష్యత్తు



వారిలో 258 మంది ఆంధ్రప్రదేశ్ వారే ఉన్నట్లు చెప్పారు. ఎవరు అడ్డుకున్నా రాష్ట్రంలో అభివద్ధి ఆగదని, అనుకున్న లక్ష్యానికి అన్నీ పూర్తి చేస్తామన్నారు. శంకుస్థాపన చేసిన రోజే దాని ప్రారంభోత్సవ తేది నిర్ణయిస్తున్నామని చెప్పారు. అనంతవురం జిల్లాలో ప్రారంభించిన కియా మోటార్స్ తొలి కారు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 29న రోడ్డెక్కనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సంస్థ కూడా 8 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతిలో అత్యంత ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా డక్ట్‌ద్వారా గ్యాస్, మంచినీరు, సమాచార కేబుల్స్, మురుగు నీరు పారుదల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే రాజధాని మొత్తానికి ఒకేచోట ఏసీ యూనిట్ ఏర్పాటు చేసి కావలసిన ఇంటికి పంపించే వ్యవస్థ గురించి పరిశీలించమని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా అమరావతిలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెంచుతామన్నారు. మొక్కలు ఎక్కువగా నాటి చెట్లను పెంచవలసిన అవసరం ఉందని చెప్పారు. అలాగే ప్రకతి సేద్యం ద్వారా మంచి ఆహారం, మంచి గాలితోపాటు కష్ణానది నుంచి మంచినీరు అందిస్తే వందేళ్లకుపైగా బతకడానికి అవకాశం ఉంటుందన్నారు. అమరావతిని ఆనందనగరంగా, దేవతల రాజధానిగా అభివర్ణించారు. ఎక్స్ఎల్ఆర్ఐకు ప్రభుత్వం, సీఆర్డీఏ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. ప్రముఖ నిర్మాణ సంస్థలన్నీ ఇక్కడే ఉన్నాయని, నిర్మాణాలు వేగంగా పూర్తి అవుతాయని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్స్ సీ టాచర్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జానీమూన్, మంగళగిరి మునిసిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, గుంటూరు బిషప్ ఫాదర్ బి చిన్నబత్తిని, విజయవాడ బిషప్ ఫాదర్ టీ జోసెఫ్ రాజారావు, ఆంధ్ర జోసూట్ ప్రావిన్స్, ప్రావిన్సియల్ ఫాదర్ పీఎస్ అమల్‌రాజు, ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్ డైరెక్టర్ ఫాదర్ ఈ.అబ్రహం, అడ్మినిస్ట్రేటివ్ అండ్ ఫైనాన్స్ డీన్ ఫాదర్ జెరోమ్ కుటిన్హా, అకడమిక్ డీన్ డాక్టర్ అశీష్ కె పాణి, అమరావతి చీఫ్ అడ్మినిస్ట్రేటిల్ ఆఫీసర్ ఫాదర్ కె.ఎస్.కాసిమర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారుల బదలీ

విజయవాడ, మేజర్‌న్యూస్: ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆర్పీ సిసోడియా–ట్రైబల్ వెల్ఫేర్ ముఖ్యకార్యదర్శి, విశాఖ కలెక్టర్‌గా –కే.భాస్కర్, జీఏడీ సర్వీసెస్ సెక్రటరీగా– నాగులపల్లి శ్రీకాంత్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. కె.దమయంతి–ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ అదనపు బాధ్యతలు ప్రిన్సిపల్ సెక్రటరీ–ప.గో: కె.ప్రవీణ్‌కుమార్‌గా నియమించారు.

మొదటి పేజీ తరువాయి

ఏకమైన అసూయాపరులు

హెచ్చరించారు. బంధుత్వాలు ఉంటే ఇంట్లో పెట్టుకోవాలి, స్నేహాలు ఉంటే వ్యక్తిగతంగా చూసుకోవాలి. బంధుత్వాలు, స్నేహాల పేరుతో పార్టీని పణంగా పెట్టరాదని, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీయవద్దని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలను సహించనని చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించారు. ఇక్కడకొచ్చి అదే బీసీలపై కపటప్రేమ చూపుతున్నారు. 26 కులాలకు అన్యాయం చేసిన వారితో జగన్ అంటకాగుతున్నారు. టీఆర్ఎస్‌తో జట్టుకట్టిన వైసీపీకు 26 కులాల బీసీలే బుద్ధి చెప్పాలి. అవినీతి గొంగళి వురుగును కేసీఆర్ కౌగిలించుకున్నారు. అవినీతి గొంగళివురుగుతో స్నేహం తెలంగాణ కోసమేనా? ప్రజలకు కేసీఆర్, కేటీఆర్ జవాబు ఇవ్వాలి అని చంద్రబాబు అన్నారు.



అహ్లె సున్నత్‌వల్ జమాత్ ఏపీ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ, సూర్య బ్యూరో : అహ్లె సున్నత్‌వల్ జమాత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయుటకు రాష్ట్ర పదమూడు జిల్లాల నుండి హాజరైన ముస్లిం పండితులు, ఉలమాలు, ముఫ్తీలు, సూఫీలు ముతవల్లీలు కొండపల్లి మస్జిద్ షాబుఖారి కర్బలా మైదానంలో సూఫీ మత గురువులు పీఠాధిపతులు అల్తాఫ్ రజ్వీ అధ్యక్షతన గురువారం సమావేశమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అహ్లె సున్నత్ వల్ జమాత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఖలీఫా హుజూర్ అష్రఫి హఫీజ్ మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ రజ్వీ (కాకినాడ), అధ్యక్షులుగా విజయవాడ పీఠాధిపతి ముస్లిం పండితులు ముఫ్తీ మొహమ్మద్ అబ్దుల్ ఖదేర్ రజ్వీ, ప్రధాన కార్యదర్శిగా మౌలానా మొహమ్మద్ సమీ ఉజమా రజ్వీ (గుంటూరు), కోశాధికారిగా పీఠాధిపతులు మత గురువులు సూఫీ అల్తాఫ్ రజ్వీ కొండపల్లి, ఉపాధ్యక్షులుగా మౌలానా మొహమ్మద్ గోహర ఆలమ (భవానీపురం), మౌలానా ముహమ్మద్ రఫీ కాలం రజ్వీ (మచిలీపట్నం), స్పోక్ పర్సన్‌గా న్యాయవాది ముక్తార్ అలీ రజ్వీని ఎన్నుకోవటం జరిగింది.

యుసిలు పంపి కేంద్రం నుండి నిధులు రాబట్టేందుకు కృషి చేయండి : సిఎస్

అమరావతి,17జనవరి:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృాఎద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద అందించే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంతోపాటు సకాలంలో యుసిలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు)కేంద్రానికి పంపడం ద్వారా మరిన్ని నిధులను రాబట్టేందుకు కృాఎషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు.సెంట్రల్ అసిస్టెన్స్ టు స్టేట్ డెవలప్మెంట్ స్కీమ్స్ అనే అంశంపై వివిధ శాఖల అధికారులతో గురువారం అమరావతి సచివాలయంలో సిఎస్ సమీక్షించారు.ఈసందర్భంగా ఆర్థికశాఖ కార్యదర్శి పియూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రాష్ట్ర పథకాలకు కేంద్రం నుండి వివిధ శాఖలకు కేటాయించిన,విడుదల చేసిన నిధులు వినియోగం,వినియోగపత్రాలు సమర్పించిన తదితర అంశాలను వివరించారు.ముఖ్యంగా 2016-17లో కేంద్రం నుండి వివిధ కేంద్ర సహాయంగా13వేల329కోట్ల



రూ.లు,2017-18లో 13వేల 191 కోట్ల రూ.లు విడుదల అయ్యాయని తెలిపారు.2018-19ఆర్థిక సంవత్సరాని కిగాను డిశంబరు 31నాటికి 9వేల 654 కోట్ల రూ.లు విడుదల అయ్యాయని ఈఆర్థిక సంవత్స రాంతానికి మొత్తం 15వేల కోట్ల రూ.లు నిధులు రావచ్చని ఆశిస్తున్నట్టు వివరించారు. వివిధ శాఖలవారీగా ప్రతిపాదించిన పథకాలు కేంద్రం నుండి మంజూరైన నిధులు వాటికి సంబంధించిన యుసిలు కేంద్రానికి పంపిన వివరాలను శాఖలవారీగా ఆయన సిఎస్‌కు వివరించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ రాష్ట్రాభివృాఎద్ధికి కేంద్రం నుండి విడుదలైన నిధులను సకాలంలో ఖర్చుచేయడంతోపాటు యుసిలను సకాలంలో పంపి మరిన్ని నిధులు రాబట్టేందుకు అన్ని శాఖలు చిత్తశుద్ధితో కృాఎషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై మినిట్స్ రూపొందించి ఒక కాపీని ఢిల్లీలోని ఎపి భవన్ రెసిడెన్స్ కమీషనర్ కు పంపాలని సిఎస్ పునేఠ ఆర్థికశాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఇంకా ఈసమావేశంలో ఆయా శాఖలవారీ పథకాలు,పంపిన ప్రతిపాదనలు,కేంద్రం నుండి వచ్చిన నిధులు,వినియోగించిన నిధులకు సమర్పించాల్సిన యుసిలు తదితర అంశాలపై ఆయన అధికారులతో సమీక్షిస్తూ సకాలంలో యుసిలు పంపి మరిన్ని నిధులు కేంద్రం నుండి రాబట్టేందుకు అన్ని విధాలా ప్రయత్నం చేయాలని సిఎస్ ఆదేశించారు.



ఈసమావేశంలో కార్మిక,ఉన్నతవిద్యాశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జెఎస్వి ప్రసాద్,ఆదిత్యానాథ్ దాస్,మున్సిపల్,పంచాయితీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు కరికల్ వలవన్,డా.కెఎస్.జవహర్ రెడ్డి,గృాఎహనిర్మాణశాఖ,స్త్రీశిశు సంక్షేమశాఖల కార్యదర్శులు కాంతిలాల్ దండే,హెచ్.అరుణ్ కుమార్,బిసి సంక్షేమశాఖ సంచాలకులు బి.రామారావు,డిఎంఇ డా.కె.బాబ్జీ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1550తో కొనుగోలు



అమరావతి: సచివాలయం పెథాయి తుఫాన్ వలన తడిచిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే క్వింటా ఒక్కింటికి రూ.1550 తో కొను గోలు చేయాలని నిర్ణయించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలి పారు. ఈ రోజు సచివాలయం లో మంత్రి నక్కా ఆనంద బాబు,గన్నవరం ఎమ్మెల్యే వంశీ మోహన్ , రైతు సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కృాఎష్ణా,గుంటూరు,పశ్చిమ గోదావరి జిల్లా రైతుల నుండి దాదాపు 3 లక్షల టన్నులు నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ఏటువంటి ఆర్థిక సహకారం అందించటం లేదని, తూఫాన్ వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే రూ.465 కోట్ల తో కొనుగోలు చేయటానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అంగీకరించారని మంత్రి తెలిపారు. ఈ వారంలో ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ రాధా మోహన్ సింగ్ ని రాష్ట్ర మంత్రులు,రైతు సంఘాల నాయకులతో కలుస్తామని మంత్రి తెలిపారు.

షర్మిలపై అసభ్య ప్రచారం బాధాకరం


● సోషల్ మీడియాకు అందరూ బాధితులే ● సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు తేవాలి ● మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

(వెలగపూడి సూర్య ప్రధాన ప్రతినిధి) : సోషల్ మీడియాలో షర్మిలపై వస్తున్న అసభ్య ప్రచారం బాధాకరమని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఖండించారు. సోషల్ మీడియాకు అందరూ బాధితులేనని సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన అభిప్రాయపడ్డారు. షర్మిళపై వస్తున్న ఆరోపణలను 2014లోనే ప్రభాస్ ఖండించారని, ఐదేళ్ల తరవాత మరలా ఆ విషయాన్ని కావాలనే తెరమీదకు తెచ్చారని మంత్రి విమర్శించారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సీఎం సీటు కోసం ఎంతకైనా దిగజారుతారు అనడానికి ఇదే నిదర్శనం అని సోమిరెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ ప్రత్యేక సోషల్ మీడియా విభాగం ఏర్పాటు చేసుకుని టీడీపీ మహిళా నేతలపై అసభ్యంగా ప్రచారం చేసింది నిజంకాదా అని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కొంతమంది పనిలేని వారు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇలాంటి పోకడలను నియంత్రిచేందుకు కేంద్ర ప్రభుత్వం కఠినచట్టాలు తేవాలని ఆయన కోరారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పై, జనన్మోహన్‌రెడ్డి ఎలాంటి వ్యాఖ్యలు చేశారో అందరికీ తెలుసని మంత్రి సోమిరెడ్డి గుర్తుచేశారు. షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యంగా ప్రచారం చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రా ఉందని చెప్పడం సబబు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ పోలీసులపై నమ్మకంలేని వైసీపీ నేతలు తెలంగాణలో కేసులు పెడుతున్నారని, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఏపీలో గహ ప్రవేశం చేయాలని చూస్తున్న జగన్మోహన్ రెడ్డికి ఏపీ అభివద్ధి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టులో 7 ముంపు మండలాలపై సుప్రీంకోర్టులో టీఆర్ఎస్ నాయకురాలు, ఎంపీ కవిత కేసు వేశారని మంత్రి సోమిరెడ్డి గుర్తుచేశారు. ఫెడరల్ ఫంట్ ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని,




అక్కడ ఫ్రంట్, బ్యాక్ ఏమీ లేదని మంత్రి ఎద్దేవా చేశారు. మోడీగాడు అని తిట్టిన కేసీఆర్ తరవాత ఢిల్లీ వెళ్ల ప్రధాని కాళ్లుకు సాష్టాంగ నమస్కారాలు చేశాడని మంత్రి విమర్శించారు. ఏపీలో ఊహించని అభివద్ధి జరుగుతుంటే టీఆర్ఎస్ నేతలు తట్టుకోలేక పోతున్నారని సోమిరెడ్డి దుయ్యబట్టారు. తిత్లీ తుఫానుకు తడసిన ధాన్యం కూడా కేంద్రం కొనుగోలు చేయడం లేదని, దీనిపై వైసీపీ నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. తిత్లీ తుఫానుకు తడసిన ధాన్యం క్వింటా 1550 రూపాయలకు కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారని మంత్రి తెలి పారు. నాలుగున్నర సంవత్స రాల్లో ఏపీలో అభివద్ధిచేసి మేము నిరూపించుకున్నామని, కేసీఆర్ ను చూసి నేర్చుకో వాల్సిన అవసరంలేదని మంత్రి సోమి రెడ్డి అభిప్రాయపడ్డారు. కేవలం సామాజిక ఫించన్లకే రాబోయే ఐదు సంవత్సరాల్లో 70000 కోట్లు ఖర్చు చేయను న్నామని ఆయన గుర్తుచేశారు. లోటు బడ్జెట్ ఉన్నా తెలంగాణకన్నా వ్యవసాయ రంగంలో 17000 కోట్లు అధనంగా ఖర్చు చేశామని మంత్రి తెలిపారు. ఏపీలో అభివద్ధి చూశాక మరలా సీఎంగా చంద్రబాబునాయుడు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి సోమిరెడ్డి అభిప్రాయపడ్డారు.

నరేంద్ర మోడీ డైరెక్షన్‌లో ఫెడరల్ ఫ్రంట్



అమరావతి: నరేంద్ర మోడీ డైరెక్షన్ లో ఫెడరల్ ఫ్రంట్ పేరిట కేసీఆర్ మరియు జగన్మోహన్ రెడ్డిలు ఆంధ్రుల ఆత్మ గౌరవం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కుట్ర రాజకీయా లును ఆంధ్రులారా.. గమనిం చండి.. అంటూ ఆపరేషన్ గరుడ పేరిట రాష్ట్ర మానవ వనరుల అభివృాఎద్ధి సభ్యులు మరియు ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణా శిబిరం డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ఫ్లెక్సీలును రూపొందించి రణస్థలంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృాఎద్ధికి అడ్డుపడుతూ,ఆంధ్రులు మనోభావాలు,ఆత్మ గౌరవం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కేసీఆర్ గారితో ఏవిధంగా జగన్మోహన్ రెడ్డి గారు కలుస్తున్నారో..ప్రజలుకు సమాధానం చెప్పాలి అన్నారు.ఆంధ్రుల ఆత్మగౌరవం లెక్క లేదా?అని జగన్మోహన్ రెడ్డిని కలిశెట్టి సూటిగా ప్రశ్నించారు.త్వరలో ఈ ఆపరేషన్ గరుడ ఫ్లెక్సీలును ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నామని తెలియజేసారు

మంత్రులతో సీఎం భేటీ




అమరావతి, సూర్య బ్యూరో : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుబాటులో ఉన్న మన్త్రులతో అత్యవసరంగా సమావేశం అయ్యారు. జగన్‌తో టీఆర్ఎస్ నేతల భేటీ, ఈనెల 19న కోల్‌కతా టూర్‌పై చర్చలు జరిపారు. మరోవైపు శుక్రవారం చంద్రబాబు కోల్‌కతా వెళ్లనున్నారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు తన దావోస్ పర్యటనను రద్దు చేసుకున్నారు. పార్టీ నేతల సూచనతో పర్యటన రద్దు చేసుకున్నారు. ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై దష్టి సారించనున్నారు. ఈ భేటీలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, జవహర్, గంటా శ్రీనివాసరావు, నారాయణ, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎపిలో శక్షం 2019 ప్రారంభం

విజయవాడ, సూర్య బ్యూరో : సంరక్షణ్ క్షమతా మహోత్సవం (శక్షం 2019) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గురువారం విజయవాడ ప్రారంభమైంది. చమురు పరిశ్రమ రాష్ట్రస్థాయి సమన్వయకర్త జికెకెవి ఉమాశంకర్ స్వాగతం పలుకుతూ వాడకందార్లకు ఇంధన పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి ఫిబ్రవరి 15 వరకు నెలరోజులపాటు జరిగే ఈ ఉత్సవంలో అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సందేశాన్ని అందించడం కోసం విద్యార్ధులను ప్రచారకర్తలుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పిసిఆర్ఎ, అడిషనల్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణం, ఆర్థికాభివృద్ధి కొరకు పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేయడం చాలా ముఖ్యమని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) ఎ.రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించి అందరిచే సంరక్షణా ప్రమాణాన్ని చేయించి ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ అలాగే పెరుగుతున్న వాహనాల సంఖ్య కారణంగా పెట్రోలియం ఉత్పత్తులను పెరుగుతున్న డిమాండ్గను దృష్టిలో వుంచుకొని పెట్రోలియం ఉత్పత్తులను పరిరక్షంచటం చాలా ముఖ్యమని తెలిపారు. పిల్లలందరూ తమ వివిధ జీవన శైలిలో పరిరక్షించటం అనే దానిని ఒక అలవాటుగా చిన్నప్పటి నుండి అలవరచుకోవాలని తద్వారా దేశం, సంఘం అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. పర్యావరణ మేలు కోసం ఇంధనాన్ని సమర్ధవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం సంర క్షణ థీమ్‌పై నిర్వహించి డ్రాయింగ్ పోటీలలో విజేతలకు బహుమతులను, థీమ్ ఆధారంగా నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నవారికి ట్రోఫీ లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ సీని యర్ మేనేజర్ టి.శ్రీనివాసరావు, హెచ్‌పిసి, ఐఓసి, బిపి సి, గెయిల్ వారి డీలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సోషల్ మీడియాను ఎవరు దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవు : సీఎం



అమరావతి, సూర్య బ్యూరో : సోషల్ మీడియాను ఎవరు దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వైఎస్ షర్మిల ఫిర్యాదుపై సీఎం చంద్రబాబు స్పందించారు. టీడీపీపై షర్మిల ఫిర్యాదు చేయడం దురదష్టకరమని టెలికాన్ఫరెన్స్‌లో అన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసింది వైసీపీనే అని విమర్శించారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణపై మొదట్లోనే వైసీపీ దుష్ప్రచారం చేసిందని గుర్తు చేశారు. జగన్ కేసులపై విచారణ సాగకుండా చేయాలని కుట్రలు చేశారన్నారు. చివరికి న్యాయమూర్తులపైనా దుష్ప్రచారానికి తెగబడ్డారని మండిపడ్డారు. పవన్‌కళ్యాణ్ పెళ్లిళ్లపై, టీడీపీ మహిళా నేతలపై, తన కుటుంబంపై అసభ్యకరంగా ప్రచారం చేశారని తెలిపారు.

ఎస్సీల వరాల దేవుడు సీఎం చంద్రబాబు : ఎపిఎంఆర్‌పిఎస్



విజయవాడ, సూర్య బ్యూరో : మాదిగల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు 2019 ఎన్నికల్లో మళ్ళీ గెలిచి ముఖ్యమంత్రి అవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షులు మేదర సురేష్‌కుమార్ ప్రశంసించారు. గురువారం నగరంలో జరిగిన ఓ భారీ కార్యక్రమంలో మేదర సురేష్‌కుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎస్సీలకు వరాల దేవుడువంటివారన్నారు. బడుగుబలహీనవర్గాల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, తెలుగుదేశం పార్టీకి అండగా వుంటామని, టీడీపీ విజయానికి కృషి చేస్తామని మేదర సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షునిగా తెలుగుదేశం విభాగానికి ఎం.ఎస్.రాజును నియమించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కిమిడి కళా వెంకటరావ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షునిగా నియమితులైన ఎం.ఎస్.రాజుకు అభినందనలు తెలువుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలు, టీడీపీ లక్ష్యాలను ప్రజల్లోకి ముఖ్యంగా ఎస్సీల వద్దకు తీసుకెళ్ళే బాధ్యత ఎం.ఎస్.రాజుపై వుందని మేదర సురేష్‌కుమార్, ఎం.ఎస్.రాజుకి విజ్ఞప్తి చేశారు.

జగన్ తలసానికి ఏ విధంగా ఆప్తుడయ్యారు : అచ్చెన్నాయుడు

విజయవాడ, సూర్య బ్యూరో : కేసీఆర్, జగన్ మెప్పు పొందడానికి తెలుగుదేశం నాయకత్వంపై తలసాని శ్రీనివాసయాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేసి బీసీ వర్గాల్లో తనకున్న గౌరవాన్ని పోగొట్టుకున్నారని బీసీ సంక్షేమ శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని అన్నారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నత స్థితికి తెచ్చిన తెలుగుదేశం పార్టీపై ఈ విధమైన వ్యాఖ్యలు చేయటం సమంజసంకాదన్నారు. బీసీ సంక్షేమంలో ఏపీకి, తెలంగాణకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. బీసీలకు దేశంలో ఏ రాష్ట్రంలో కేటాయించనన్ని నిధులను కేటాయించామన్నారు. బీసీలకు మొట్టమొదటిసారిగా సబ్‌ప్లాన్ పెట్టిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బిసిలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి వర్గంలో 13 జిల్లాలకు 8 మంది బీసీలను మన్త్రులుగా చేయడం జరిగిందన్నారు. సామాజిక న్యాయాన్ని చేకూర్చిన తెలుగుదేశానికి బడుగు, బలహీన వర్గాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. బీసీల రక్తంతో వైఎస్ కుటుంబం పెరిగిందన్నారు. రిజర్వేషన్ శాతం పెంచకుండా 24 కులాలను బీసీ జాబితాలో చేర్చి వైఎస్ ప్రభుత్వం బడుగులకు అన్యాయం చేసిందన్నారు. 5 ఏళ్ళలో వైయస్ పాలనలో బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో సుమారు రూ.2,940 కోట్లు కేటాయించగా, చంద్రన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.40వేల కోట్లు కేటాయించి బీసీల పక్షపాతిగా నిలిచారన్నారు. బీసీలకు ఇంత అన్యాయం చేసిన జగన్మోహన్‌రెడ్డి మీకు ఏ విధంగా ఆప్తుడయ్యాడు? అని ప్రశ్నించారు.



బ్రాహ్మణుల అభివృద్ధికి సహకరిస్తాం



విజయవాడ: విద్య పరంగా ఎంతో అభివృాఎద్ధి చెందిన బ్రాహ్మణ సామాజిక వర్గం వ్యాపార రంగంలో కూడా విజయం సాధించేందుకు అంతర్జాతీయంగా ఆన్ లైన్ వ్యాపారం స్థాపించిన సనాతన ఎంటర్ ప్రెన్యూర్స్ అసోసియేషన్() సంస్థకు బ్రాహ్మణ కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య చెప్పారు. బందర్ రోడ్డు లోని డివి మేనర్ హోటల్ సమీపంలో బ్రాహ్మణుల ఆర్థికాభివృాఎద్ధి కోసం గురువారం నూతనంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ కార్యకలాపాలను తెలియజేసే కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని యువ బ్రాహ్మణ పారిశ్రామికవేత్తలు నిర్వహిస్తున్న సంస్థలు, కర్మాగారాల్లో తయారు చేస్తున్న ఉత్పత్తుల అమ్మకాల కోసమే ఈ సంస్థ ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు సూరి బుచ్చి రామ్ మాట్లాడుతూ ఇప్పటివరకు బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా ఎవ్వరూ చెయ్యని ఒక కొత్త తరహా వ్యాపారాన్ని చేపట్టిన తమకు బ్రాహ్మణ కార్పొరేషన్ సహకరించేందుకు ముందుకు రావడం తమకు ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నారు. దేశంలోని బ్రాహ్మణులలో ఆత్మస్థైర్యం పెంచేందుకు తమ సంస్థ వారికి, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, విజయవంతమైన పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ, పోటీతత్వంతో వ్యాపారం చేసేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తామన్నారు. వాణిజ్యపరమైన అంశాలతోపాటు బ్రాహ్మణుల ఆర్థిక అభివృాఎద్ధికి తమ సంస్థ చిత్తశుద్ధితో కృాఎషి చేస్తుందని ఆయన అన్నారు. సంస్థకు కార్యాలయాన్ని వితరణ చేసిన నారాయణాచార్యులు, సంస్థ కార్యదర్శి దుర్గా సారధి తదితరులతోపాటు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్ లాలూచీ రాజకీయాలు ప్రజలు నమ్మరు

● ఆంధ్రాలో అభివృద్ధికి అడ్డంకిగా మారిన కేసీఆర్, కేటిఆర్ ● ఫెడరల్ ఫ్రంట్ పేరుతో నాటకీయ రాజకీయం ● అలాంటి నేతలతో జగన్ లాలూచీ రాజకీయాలు ● ప్రజల సమస్యలు పట్టని ప్రతిపక్ష నేతకు ప్రజలే బుద్ధి చెప్పతారు ● ఎన్ని అవరోధాలు ఎదురైనా నవ్యాంధ్రలో ఆగని అభివృద్ధి ● సమర్ధవంత పాలనలో ఏపిలో చంద్రన్న అభివృద్ధి వెలుగులు ● రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు

అమరావతి, సూర్యప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో అభివద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డుపడుతున్న కేసీఆర్, కేటీఆర్‌లతో జగన్ ములాఖత్ పై రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావుధ్వజమెత్తారు. జగన్, కేసిఆర్‌లు ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కొత్త నాటకానికి తెరదేశారని మంత్రి తీవ్రంగా దుయ్యబట్టారు. విభజన సమయంలో ఆంధ్ర ప్రాంత ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన కేసిఆర్ ముందు జగన్ మోకరిల్లిడం విడ్డురంగా ఉంది అని ఎద్దేవా చేశారు. మోదీ, కేసీఆర్, జగన్‌లు తమ ముసుగులను తొలగించి రానున్న ఎన్నికల్లో ఒకటిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. 42 మంది ఎంపీల సీట్లు ఉంటే తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించవచ్చు వచ్చు అన్న జగన్ పార్లమెంటులో తన ఎంపీలతో ఎందుకు రాజీనామా చేయించారో చెప్పవలసిందిగా డిమాండ్గ చేశారు. తెదేపా పార్లమెంటులో నో కాన్ఫిడెన్షన్ మోషన్ పెట్టినప్పుడు తెరాసా ఎంపీలు ఎందుకు మద్దతు తెలపలేదని మంత్రి ప్రశ్నించారు. తన మీద ఉన్న కేసుల మాఫీకి జగన్ మోడీ ముందు మోకరిల్లి పార్లమెంట్ నుండి పలాయనవాదం ఎందుకు చిత్తగించారని అన్నారు. జగన్ అసెంబ్లీకి రాడు, ప్రజా సమస్యలపై స్పందించడు, ఆంధ్రా అధికారుల మీద నమ్మకం లేదు, కానీ ఆంధ్రప్రదేశ్ అధికార పీఠాన్ని అధిరోహించాలని కలలు కంటాడని తీవ్రంగా దుయ్యబట్టారు. తెలంగాణా ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, ఆస్తుల పంపకంపై ఏనాడు ప్రశ్నించిన జగన్ వారితో ఇప్పుడు చేతులు ఎలా కలువుతారని అన్నారు. అధికార దాహం, పదవీ వ్యామోహం, కేసుల మాఫీలే అజెండాగా జగన్ రాజకీయాలు చేస్తున్నారని, జగన్ పచ్చి అవకాశవాదని విమర్శించారు. ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో వైకాపా, తెరాస, బీజేపీలు ఆడుతున్న నాటకాలను ప్రజలు ఒక కంట గమనిస్తున్నారని సరైన సమయంలో ప్రజలు తగు విధంగా బుద్ధి చెబుతారని మంత్రి శిద్ధా రాఘవరావు హెచ్చరించారు.



మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లపై ఆంక్షలు ఎత్తివేత: రాత్రి 11 వరకే తెరచి ఉంచాలని ఆదేశాలు

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లపై ఉన్న ఆంక్షలను సుప్రీం కోర్టు సడలించింది. హోటళ్లు, రెస్టారెంట్లలలో డ్యాన్స్‌లను నిషేధిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను కోర్టు తోసిపుచ్చింది. డ్యాన్స్ బార్లకు షరతులతో కూడిన అనుమతులను కోర్టు మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే, మహారాష్ట్రలోని హోటళ్లు, రెస్టారెంట్లపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ ఆత్మగౌరవం పేరిట 2016లో ఓ చట్టాన్ని చేసింది. దీంతో డిస్కోథెక్కులకు లైసెన్స్ విషయంలో నిషేధం విధించినట్టయింది. ఈ ఆంక్షలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హోటళ్లు, రెస్టారెంట్ల ఓనర్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మహారాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను తప్పు పట్టింది. హోటళ్లు, రెస్టారెంట్‌లలో డిస్కోలు, ఆర్కెస్ట్రాలకు అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. డ్యాన్స్ బార్లలో మద్యం సేవించేందుకు కూడా కోర్టు అనుమతించింది. కానీ డ్యాన్సర్లపై డబ్బు వెదజల్లడంపై కోర్టు నిషేధం విధించింది. అంతే కాకుండా ప్రార్థన మందిరాలకు కిలో మీటర్ దూరంలో డ్యాన్స్ బార్లను ఏర్పాటు చేయరాదనే రాష్ట్ర ప్రభుత్వ నిబంధన ముంబయి వంటి మహా నగరాల్లో సాధ్యపడదని తెలిపింది. బార్లలో సీసీటీవీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని, అలా చేయడం ప్రైవసీకి భంగం కలిగించడమేనని కోర్టు పేర్కొంది. డ్యాన్స్ చేసేవారికి, బార్ ఓనర్‌లకు మధ్య తప్పకుండా కాంట్రాక్టు ఉండాలని ఆదేశించింది. అంతే కాకుండా రాత్రి 11.30 గంటల వరకు మాత్రమే డ్యాన్స్ బార్లను తెరచి ఉంచాలని స్పష్టం చేసింది.



నాడు ప్రాణాలతో బయటపడి.. నేడు ఉగ్ర దాడికి బలై

కెన్యా ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమెరికా వ్యాపారవేత్త



నైరోబి : పద్దెనిమిదేళ్ల క్రితం ఓ భీకర ఉగ్ర దాడి నుంచి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడో వ్యక్తి. మళ్లీ ఇన్నేళ్ల తరువాత అదే ముష్కరుల చేతిలో బలయ్యాడు. కెన్యా రాజధాని నైరోబీలో బుధవారం తెల్లవారు జామున ఉగ్రవాదులు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అమెరికాకు చెందిన జాసన్ స్పిండ్లర్ సహా పలువురు మృతి చెందారు. కాగా, 2001లో అమెరికాలో జరిగిన 9/11 ఉగ్రదాడి నుంచి జాసన్ ప్రాణాలతో బయటపడ్డారు. అమెరికాకు చెందిన జాసన్ స్పిండ్లర్ ఆస్టిన్‌లో యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్, న్యూయార్క్ యూనివర్శిటీ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆ తరువాత వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోని సాలోమన్ స్మిత్ బార్నే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లో పని చేశారు. 2001 సెప్టెంబర్ 11న అల్‌ఖైదా ఉగ్రవాదులు అమెరికాలో దాడి చేసిన విషయం తెలిసిందే.


రెండు విమానాలను హైజాక్ చేసిన ముష్కరులు వాటితో ట్విన్ టవర్స్‌ను ఢీకొట్టి కూల్చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జాసన్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోనే ఉన్నారు. ప్రమాదంలో భవన శిథిలాల కింద చిక్కుకున్న జాసన్ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. తన గాయాలను సైతం పక్కన పెట్టి శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని కాపాడి మానవత్వం చాటారు. ఆ తరువాత కొంత కాలానికి జాసన్ తన ఉద్యోగాన్ని వదిలేసి కెన్యా వెళ్లిపోయారు. ఆ దేశ రాజధాని నైరోబీలో ఒక కన్సల్టింగ్, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ కార్యాలయం డసిట్‌డీ2 సముదాయంలో ఉంది. బుధవారం ఉదయం ఇదే సముదాయంలో ఉగ్ర దాడి జరిగింది. అల్ ఖైదా అనుబంధ సంస్థ అయిన అల్ షబాబ్‌కు చెందిన ముష్కరులు భవన ప్రాంగణంలోకి చొరబడి బాంబులు, కాల్పులతో తెగబడ్డారు. ఈ ఘటనలో జాసన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. జాసన్ మృతిని ఆయన కుటుంబ సభ్యులు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

ఉగ్ర దాడిలో 21కి చేరిన మృతులు

కాగా, ఈ ఉగ్ర దాడిలో మృతుల సంఖ్య 21కి పెరిగింది. ఈ ఘటనలో 16 మంది కెన్యా దేశస్థులు, బ్రిటన్‌కు చెందిన ఒకరు, ఒక అమెరికన్, మరో ముగ్గురు ఆఫ్రికన్ దేశస్థులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మరి 28 మంది గాయపడ్డారు.

దాడి గురించి తెలియగానే భద్రత బలగాలు భవన సముదాయాన్ని చుట్టుముట్టాయి. ఉగ్రవాదులపైకి ఎదురుకాల్పులకు దిగాయి. దాదాపు 20 గంటల పాటు శ్రమించి ఐదుగురు ముష్కరులను పోలీసులు మట్టుబెట్టారు.

డేరా బాబాకు జీవిత ఖైదు



న్యూఢిల్లీ : డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్‌కు జీవిత ఖైదు విధిస్తూ పంచకుల స్పెషల్ సీబీఐ కోర్టు గురువారం తీర్పు చెప్పింది. పాత్రికేయుడు రామచంద్ర ఛత్రపతి హత్య కేసులో ఆయన దోషి అని కోర్టు ఇటీవల నిర్ధారించిన సంగతి తెలిసిందే. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ విచారణ జరిగింది. రామ్ రహీమ్‌కు గురువారం శిక్ష ప్రకటించనుండడంతో ముందుగానే హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం ఉన్న పంచకుల, సిర్సాలో 144 సెక్షన్ విధించారు. పంచకుల న్యాయస్థానం సముదాయంలో చుట్టుపక్కల బారికేడ్లతో భద్రత ఏర్పాట్లు చేశారు. రామ్ రహీమ్ ప్రస్తుతం ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన రోహ్‌తక్‌లోని సునరియా జైలులో ఉన్నారు. ఆయనను కోర్టుకు తరలిస్తే శాంతి భద్రతల సమస్య ఎదురు కావచ్చునని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీంతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ జరిపేందుకు కోర్టు అంగీకరించింది.

విశ్వాస పరీక్షలో గెలిచిన థెరీసా మే



లండన్ : బ్రెగ్జిట్ బిల్లుపై వోటులో ఓటమిపాలై, అవిశ్వాస పరీక్షను ఎదుర్కొన్న బ్రిటన్ ప్రధాని థెరీసా మే అనూహ్య విజయం సాధించారు. బుధవారం సాయంత్రం వోటింగ్ జరగగా, ఆమెపై తమకు విశ్వాసముందని 325 మంది తమ వోటు ద్వారా చెప్పారు. విశ్వాస పరీక్షకు వ్యతిరేకంగా 302 వోట్లు వచ్చాయి. దీంతో ప్రస్తుతానికి ఆమె పదవికి ఇక ఎటువంటి ఇబ్బందీ ఉండదు. సాధారణంగా ఓ బిల్‌పై వోటింగ్ జరిగి, ఆ బిల్లు ఆమోదం పొందకుంటే, మరుసటి రోజు జరిగే విశ్వాస పరీక్షలో ఓటమిపాలై గద్దె దిగుతుంటారు. కానీ, చరిత్రను తిరగరాసిన థెరీసా మే 432-202 తేడాతో బ్రెగ్జిట్‌లో ఓటమిపాలైనా, విశ్వాస పరీక్ష మాత్రం గెలవడం గమనార్హం. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగాల్సిందేనని అత్యధిక ప్రజలు కోరుకున్న సంగతి తెలిసిందే. కానీ, ప్రజా ప్రతినిధులు మాత్రం ఈయూతో కలసి ఉంటేనే మేలు కలుగుతుందని నమ్ముతున్నారని, అదే విషయం పార్లమెంట్‌లో నిరూపితమైందని నిపుణులు వ్యాఖ్యానించారు.


యోగికి అవకాశం

పశ్చిమ బెంగాల్‌లో అమిత్ షా స్థానంలో పాదయాత్ర




కోలకతా : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్వైన్ ఫ్లూతో బాధ పడుతూ ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. మరి రెండు రోజుల్లో ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉంది. మరో వైపు, ఈ, నెల 20 నుంచి పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ వరుస ర్యాలీలు ప్రారంభం కానున్నాయి. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. ఫిబ్రవరి మొదటి వారం వరకు ఇవి కొనసాగనున్నాయి. వీటిలో పాదయాత్రలు కూడా ఉన్నాయి. మరో వైపు, శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పేర్కొంటూ పశ్చిమ బెంగాల్‌లో రథయాత్రలకు అనుమతి ఇవ్వలేమని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీంతో బహిరంగ సభలు, పాదయాత్రలకు బీజేపీ ప్లాన్ చేసింది. ఈ నేపథ్యంలో, 20 నాటికి అమిత్ షా పూర్తి స్థాయిలో కోలుకోకపోతే ఆయన స్థానంలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ యాత్రలకు నాయకత్వం వహిస్తారు. ఫిబ్రవరి 8న జరిగే చివరి ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది.

శత్రుఘ్న సిన్హాకు మోడీ షాక్



పాట్నా : ప్రధాని నరేంద్ర మోడీ సహా భారతీయ జనతా పార్టీపై పలు సందర్భాల్లో విమర్శలతో విరుచుకుపడుతున్న ఆ పార్టీ నేత, ఎంపీ శత్రుఘ్న సిన్హాకు బీజేపీ సీనియర్ నేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ షాక్ ఇచ్చారు. బీజేపీతో ఏమైనా ఇబ్బందులు ఉంటే సిన్హా పార్టీ నుంచి వైదొలగాలని, ఆయన బీజేపీ అసంతృప్త నేత యశ్వంత్ సిన్హా ప్రభావానికి లోనయ్యారని విమర్శించారు. బీజేపీపై శత్రుఘ్న సిన్హా మాట్లాడుతున్న విధానం, ఆయన ఉపయోగిస్తున్న భాష తీవ్ర అభ్యంతరకరమని ఆక్షేపించారు. సిన్హాకు బీజేపీతో సమస్యలు ఉంటే పార్టీకి రాజీనామా చేయాలని సుశీల్ మోడీ సూచించారు. 'అసలు ఆయన పార్టీలో ఎందుకు ఉండాలి ? పార్టీని దూషిస్తూ బీజేపీలో ఉన్నానని ఎలా చెబుతారు' అని ప్రశ్నించారు. పార్టీ సీనియర్ నేతలుగా చలామణి అవుతున్న యశ్వంత్, శత్రుఘ్న సిన్హా తరచు బీజేపీ విధానాలపై, ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శల దాడికి దిగుతున్న సంగతి తెలిసిందే. ప్రధాని కేవలం ముందస్తు ప్రణాళికతో కూడిన ఇంటర్వ్యూలు ఇవ్వడం మినహా నిబద్ధత కలిగిన జర్నలిస్టులు నేరుగా అడిగే ప్రశ్నలకు బదులు ఇవ్వలేరని సిన్హా ఇటీవల ఆరోపించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వన్ మాన్ షోలా తయారైందని కూడా ఆయన విమర్శలు గుప్పించారు.

'కుమార స్వామి సర్కార్‌ను కూలదోయం'



బెంగళూరు : కుమార స్వామి నేతృత్వంలోని జేడీఎస్- కాంగ్రెస్ సర్కార్‌ను కూలదోసేందుకు తమ పార్టీ సభ్యులు ఎవరూ ప్రయత్నించడం లేదని భారతీయ జనతా పార్టీ కర్నాటక చీఫ్ బీఎస్ యడ్యూరప్ప స్పష్టం చేశారు. కర్నాటకలో పాలక సంకీర్ణం, బీజేపీ మధ్య అధికారం కోసం పోరు జరుగుతున్న క్రమంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు పాల్పడుతున్నారని ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలకు దిగుతున్న సంగతి తెలిసిందే. ముంబయిలో ఉన్న పాలక సంకీర్ణ ఎమ్మెల్యేలను బీజేపీ ఎలాంటి ప్రలోభాలకూ గురి చేయడం లేదని మాజీ సీఎం యడ్యూరప్ప పేర్కొన్నారు. తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవడంలో విఫలమైన కాంగ్రెస్- జేడీఎస్ తమపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షించేందుకు తమ పార్టీ నేతలు ఎవరూ ఎలాంటి ఆపరేషన్‌నూ చేపట్టడం లేదని పేర్కొన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు ఒక చోట చేరితే వారెందుకు భయ పడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, జేడీఎస్‌లో అంతర్గత పోరు అదుపు తప్పిందని వ్యాఖ్యానిస్తూ, వారి అంతర్గత వైఫల్యాలకు బీజేపీని నిందించడం తగదని యడ్యూరప్ప హితవు పలికారు.

మహిళల పిటిషన్‌ను విచారించనున్న సుప్రీం



న్యూఢిల్లీ : ఈ నెల 2న శబరిమల ఆలయంలోకి ప్రవేశించి హిందూ సంస్థల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందు అమ్మిని తమకు 24 గంటల పోలీసు రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలు చేసిన ఉమ్మడి పిటిషన్‌లను సుప్రీం కోర్టు శుక్రవారం విచారించనుంది. కన్నూర్ జిల్లాకు చెందిన వీరిద్దరూ అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించడాన్ని హిందూ సంఘాలకు చెందిన నిరసనకారులు అడ్డుకున్నారు. అయ్యప్ప ఆలయంలోకి తమను అనుమతించాలని డిమాండ్ చేస్తూ వీరు నిరవధిక దీక్షకు దిగడం కలకలం రేపింది. మరో వైపు శబరిమల ఆలయంలోకి ప్రవేశించడంపై ఆగ్రహిస్తూ కనకదుర్గపై ఆమె అత్త కర్రతో దాడి చేసింది. దీనిపై ఐపీసీ సెక్షన్ 341, 324 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతించాలని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. కాగా, అయ్యప్ప ఆలయంలోకి ఇరువురు మహిళలు దుర్గ, బిందు ప్రవేశించడంతో ఆలయ ప్రధాన పూజారి ఆలయాన్ని మూసివేసి శుద్ధి చేయడం వివాదాస్పదమైంది.

ఒడిశాలో కాంగ్రెస్‌కు షాక్



భువనేశ్వర్ : ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఝార్సుగూడ ఎమ్మెల్యే నబ కిశోర్ దాస్ కాంగ్రెస్ పార్టీ పదవికి రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్ష పదవితో పాటు ప్రాథమిక సభ్యత్వాన్ని సైతం వదులుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు పార్టీ చీఫ్ రాహుల్ గాంధీకి తన రాజీనామా లేఖ పంపారు. పార్టీలో తనకు ఎవరితోనూ విరోధం లేదని, నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)లో చేరుతున్నట్లు ప్రకటించారు. అయితే, ఎమ్మెల్యే పదవికి మాత్రం ఆయన రాజీనామా చేయ లేదు. రెండు మూడు నెలల్లో ఒడిశా అసెంబ్లీతో పాటు లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో కిశోర్ దాస్ నిష్క్రమణ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. తాను ఈ నెల 24న బీజేడీలో చేరనున్నట్లు కిశోర్ దాస్ ప్రకటించారు.

పశ్చిమ బెంగాల్‌లో దారుణం



కోలకతా : పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్‌దవార్ జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని లేబర్ లైన్‌లో నివాసముంటున్న పూజ ఒరాన్ ఇంట్లోకి మంగళవారం రాత్రి ఓ చిరుతపులి ప్రవేశించింది. ఆ సమయంలో మూడేళ్ల కుమార్తె ప్రణీతను పూజ నిద్ర పుచ్చుతోంది. అకస్మాత్తుగా ఇంట్లో ప్రత్యక్షమైన పులిని చూసిన ఆమె భయంతో హడలిపోయింది. పులి నుంచి రక్షించుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పులి ఒక్కసారిగా మీదికి దూకి చిన్నారి ప్రణీతను నోట కరచుకుని వెళ్లిపోయింది. కుమార్తెను కాపాడుకునేందుకు చిరుతను బెదరించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పూజ అరుపులు విన్న చుట్టుపక్కల వారు వెంటనే వచ్చి చిన్నారి కోసం గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూజ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారి కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం మదరిహత్‌లోని ఓ టీ తోటలో చిన్నారి శరీర భాగాలు కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

'మాయావతి నాపై లైంగిక ఆరోపణలు చేశారు'



లక్నో : బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతితో పొత్తు పెట్టుకున్న ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌కు ఆయన చిన్నాన్న శివపాల్ యాదవ్ హెచ్చరిక జారీ చేశారు. మాయావతిని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. 1995లో సమాజ్‌వాదీ పార్టీతో పొత్తును తెగతెంపులు చేసుకుని భారతీయ జనతా పార్టీ అండతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర మాయావతిదని గుర్తు చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని చందోలీలో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో తనపై లైంగిక వేధింపుల ఆరోపణలను కూడా మాయావతి చేశారని శివపాల్ అన్నారు.

ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమేనని, నార్కో టెస్టుకు కూడా రెడీ అని చెప్పానని, అయితే, మాయావతికి కూడా నార్కో టెస్టు చేయాలని కండిషన్ పెట్టానని, దానికి ఆమె తిరస్కరించారని తెలిపారు. టిక్కెట్లు అమ్ముకునే వారిని నమ్మలేమని శివపాల్ అన్నారు. నేతాజీ (ములాయం)ని దుర్భాషలాడిన మాయావతిని నమ్మవద్దని కోరారు. ఆమెకు ఎన్నో సీట్లు రావని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కలసి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

గనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులు : ఓ మృతదేహం లభ్యం

- నెల రోజులుగా గనిలోనే ఉన్న మైనర్లు
- తెల్లవారు జామున కార్మికుడి మృతదేహం వెలికితీత
- కోటి లీటర్ల నీటిని తోడినా ఫలితం శూన్యం




షిల్లాంగ్ : మేఘాలయలోని ఓ గనిలో నెల రోజులుగా చిక్కుకుపోయిన 15 మంది గని కార్మికులను వెలికి తీసుకొచ్చేందుకు సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం తెల్లవారు జామున ఓ కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీశారు. గనిలో 200 అడుగుల లోపల అతడి మృతదేహాన్ని గుర్తించి సహాయక సిబ్బంది దానిని వెలికి తీసుకొచ్చారు. మిగతా 14 మంది కోసం సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నేవీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేశాయి. మంగళవారం మైనర్ మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది గురువారం ఉదయం డైవర్ల సాయంతో వెలికి తీశారు. గనిలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ఇప్పటి వరకు కోటి లీటర్ల నీటిని బయటకు తోడినా ఫలితం లేకుండా పోయింది.

నీటిని ఎంత తోడినా మళ్లీ పెరుగుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్టు అధికారులు తెలిపారు. సమీపంలోనే మూసివేసిన గని నుంచి మరి రెండు కోట్ల లీటర్ల నీటిని బయటకు పంప్ చేసినట్టు తెలిపారు. అయినప్పటికీ నీటి ప్రవాహం తగ్గడం లేదని, నీరు ఎక్కడి నుంచి వస్తోందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మేఘాలయలోని ఈస్ట్ జయంతియా జిల్లాలో లిటీన్ నది సమీపంలో అక్రమంగా నడుస్తున్న గనిలో కార్మికులు చిక్కుకుపోయారు. డిసెంబర్ 13న ఈ ఘటన జరగగా విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే అధికారులు సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు.

అమిత్ షా ఆరోగ్యం మెరుగుపడుతోంది

- బీజేపీ మీడియా హెడ్ అనిల్ బలూని
- ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జి అవుతారు
- మీ అందరి అభిమానానికి ధన్యవాదాలని ప్రకటన
- స్వైన్ ఫ్లూతో ఎయిమ్స్‌లో చేరిన బీజేపీ చీఫ్



న్యూఢిల్లీ : అమిత్ షా ఆరోగ్యం మెరుగు పడుతోందని, ఒకటి రెండు రోజుల్లో ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అవుతారని భారతీయ జనతా పార్టీ మీడియా హెడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ బలూని తెలిపారు. స్వైన్ ఫ్లూతో బాధపడుతున్న అమిత్ షా బుధవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని షా స్వయంగా తన ట్విట్టర్‌లో తెలుపుతూ దేవుని దయ, మీ అందరి అభిమానాలతో త్వరలోనే కోలుకుంటానని ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో అనిల్ బలూని గురువారం ఓ ప్రకటన విడుదల చేస్తూ షా కోలుకుంటున్నారని, మీ అందరి అభిమానానికి ధన్యవాదాలని పేర్కొన్నారు. ఇదిలా వుండగా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఆరోగ్య పరిస్థితిపై సీనియర్ కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ గురువారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. స్వైన్ ఫ్లూతో బాధపడుతున్న అమిత్ షా ప్రస్తుతం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కర్నాటకలో కాంగ్రెస్- జేడీఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచినందుకే అమిత్ షాకు స్వైన్ ఫ్లూ సోకిందని వ్యాఖ్యానించారు. సంకీర్ణ సర్కార్‌ను కూలదోసే చర్యలు విరమించకపోతే ఆయనకు జ్వరంలో పాటు డయేరియా, ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తమ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేసిన బీజేపీ నేతలు వారిని ముంబయి తరలించారని, జేడీయూ- కాంగ్రెస్ సర్కార్‌ను కూలదోయాలని ప్రయత్నించ దంతోనే అమిత్ షాకు ఈ వ్యాధి సోకిందని ధ్వజమెత్తారు. మరో వైపు స్వైన్ ఫ్లూతో బాధపడుతున్న అమిత్ షా కోలుకున్నారని, ఒకటి రెండు రోజుల్లో ఎయిమ్స్ నుంచి డిశ్చార్జి చేస్తారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ బలూనీ చెప్పారు.

జైట్లీ గారు ! ఈ కష్టకాలంలో మీతో, మీ కుటుంబంతో ఉంటాం: రాహుల్ గాంధీ





న్యూఢిల్లీ : అనారోగ్య కారణాలతో చికిత్స నిమిత్తం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. గత ఏడాది ఆయనకు మూత్రపిండాల మార్పిడి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జైట్లీ అనారోగ్యం పట్ల కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరుణ్ జైట్లీ అనారోగ్యం గురించి తెలిసి చాలా ఆవేదనకు గురయ్యాను. పలు విషయాలపై రోజూ ఆయనతో పోరాడుతూనే ఉంటాం. కానీ, ఇప్పుడు ఆయనకు నేను, కాంగ్రెస్ పార్టీ ప్రేమాభిమానాలను అందిస్తున్నాం. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. జైట్లీ గారూ ! ఈ కష్ట కాలంలో మీతో, మీ కుటుంబంతో వంద శాతం ఉంటాం' అని ట్వీట్ చేశారు. అరుణ్ జైట్లీ తొందరగా కోలుకోవాలని జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ఆయన ఇండియాకు తిరిగి వస్తారని ట్వీట్ చేశారు.

కేన్సర్‌తో పోరాడుతున్న నటుడు ఆయుష్మాన్ ఖురానా భార్య



ముంబయి : బాలీవుడ్‌ను కేన్సర్ మహమ్మారి పట్టిపీడిస్తోంది. బాలీవుడ్ ప్రముఖులు వరుసపెట్టి కేన్సర్ బారిన పడుతున్నారు. ఒకరి తరువాత ఒకరుగా ఈ విషయాన్ని బయటపెడుతుండడంతో బాలీవుడ్‌లో ఏమి జరుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మనీషా కొయిరాలా, సోనాలి బెంద్రే, తాజాగా హృతిక్ రోషన్ తండ్రి రాకేశ్ రోషన్ సహా పలువురు కేన్సర్ మహమ్మారితో పోరాడుతున్న వారే. తాజాగా, నటుడు ఆయుష్మాన్ ఖురానా భార్య తహీరా కశ్యప్‌కు కూడా కేన్సర్ సోకింది. ఆమె తొలి దశ రొమ్ము కేన్సర్ (1) బాధ పడుతోంది. ప్రస్తుతం కీమో థెరపీ చేయించుకుంటున్నట్టు తహీరా ఇటీవల సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఫోటోలు, వీడియోలు షేర్ చేసింది. తన కోసం ప్రార్థనలు చేసిన వారికి ధన్యవాదాలు తెలిపింది. తహీరా తాజాగా ట్వీట్ చేస్తూ గుండుతో ఉన్న ఫోటోను షేర్ చేసింది. ఇప్పుడు ఇలా ఉన్నానని, చాలా స్వేచ్ఛగా అనిపిస్తోందని పేర్కొంది. తాను గుండుతో ఉంటానని ఎప్పుడూ అనుకోలేదని, జుట్టు లేకపోవడం వల్ల స్నానం చేసేటప్పుడు సమస్య ఉండడం లేదని పేర్కొంది. ప్రస్తుతం బాగానే ఉన్నానని చెప్పుకొచ్చింది. ఆమె ట్వీట్‌కు బాలీవుడ్ ప్రముఖులు స్పందించారు.



వెండితెర రారాజు


నేడు ఎన్టీఆర్ 22వ వర్ధంతి



తెలుగుజాతి గుండెల్లో చెరగని జ్ఞాపకం. నిలువెత్తు స్ఫుర్రద్రూపం. క్రమశిక్షణకు పర్యాయపదం. తెలుగువారి ఆత్మగౌరవం ప్రతీక. అన్నీ కలగలిపి నందమూరి తారక రామారావు. రాముడు, కృష్ణుడు, రావణుడు, దుర్యోధనుడు తదితర పౌరాణిక పాత్రల్లో నటించి తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన యుగపురుషుడు ఆయన. జానపదం, సాంఘికం, పౌరాణికం ఏపాత్ర అయినా దానిలో జీవించిన విశ్వవిఖ్యాత నట సార్వభౌముడుగా ఎదిగిన నందమూరి తారక రామారావు. తెలుగు చిత్రసీమలో ఎన్నెన్నో మైలురాళ్లకు ఆద్యుడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా పరిపాలనలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకొన్నాడు. పరిపాలన అంటే అధికార కేంద్రం కాదని, ప్రజల ముంగిట నిలిపి, జనరంజక పాలన అందిచాడు ఎన్.టి.ఆర్.

తెలుగువారు అన్నగారు అని అభిమానంతో పిలుచుకొనే నందమూరి తారక రామారావు ఒక గొప్ప నటుడు, ప్రజా నాయకుడు. తన పేరులోని పదాల మొదటి ఇంగ్లీషు అక్షరాలైన ఎన్.టి.ఆర్, ఎన్.టి.రామారావు గా కూడా ప్రసిద్ధుడైన ఆయన, తెలుగు, తమిళం మరియు హిందీ భాషలలో కలిపి దాదావు 400 చిత్రాలలో నటించారు. తన ప్రతిభను కేవలం నటనకే పరిమితం చేయకుండా పలు చిత్రాలను నిర్మించి, మరెన్నో చిత్రాలకు దర్శకత్వం కూడా వహించాడు. విశ్వ విఖ్యాత నటసార్వభౌముడుగా బిరుదాంకితుడైన ఆయన, అనేక పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో వైవిధ్య భరితమైన పాత్రలెన్నో పోషించి మెప్పించడమేగాక, రాముడు, కృష్ణుడు వంటి పౌరాణిక పాత్రలతో తెలుగు వారి హృదయాలలో శాశ్వతంగా,ఆరాధ్య దైవంగా నిలచిపోయాడు. అలాగే రాజకీయాలలో తనదైన ముద్రవేసుకుని, రారాజుగా వెలుగొందిన ఎన్టిఆర్ వర్ధంతి సందర్భంగా సూర్య ప్రత్యేక కథనం మీకోసం ...

1923, మే 28 వ తేదీన కృష్ణా జిల్లా, పామర్రు మండలం లోని, నిమ్మకూరు గ్రామంలో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతులకు జన్మించినఎన్టీఆర్ పాఠశాల విద్య విజయవాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పూర్తి చేసి ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో చేరిన ఆతనికి తెలుగు విభాగాధిపతి విశ్వనాథ సత్యనారాయణ సన్నిహిత్యం నటనవైపు అడుగులు వేయించింది. ఈ క్రమంలో ఒకసారి రామారావును ఓ నాటకములో ఆడవేషం వేయమంటే తన మీసాలు తీయటానికి 'ససేమి రా' అని మీసాలతో నటించాడు. దీంతో కాలేజీలో ఆయ నకు మీసాల నాగమ్మ అనే పేరు స్థిర పడిపోయినా నటనపై తన మక్కువను మాత్రం వదులుకోలేదు.



వివాహం - చదువు

1942 మే నెలలో 20 ఏళ్ళ వయసులో మేన మామ కుమార్తె బసవరామతారకాన్ని పెళ్ళి చేసుకున్న ఎన్టీఆర్ గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలోచేరి నాటకసంఘాలలో పాల్గొనే వాడు. ఓ వైపు నాటకాలు మరోవైపు చదువు నిరాకంటంగా కొనసాగిస్తున్న తరుణంలో కుటుంబం కొన్ని ఆర్ధిక ఒడిదుడజీకులకు లోనయ్యింది. ఆస్తి హారతి కర్పూరంలా హరిం చు కుపోయినా అప్పు చేసేందుకు నిరాకరించే ఎన్టీ ఆర్ కుటుంబ పోషణ కోసం అనేక పనులు చేసాడు. పాల వ్యాపారం, కిరాణాషాపు. ప్రింటింగ్ పనులు చేసుకుంటూనే 1947లో పట్టభద్రుడయ్యాడు.

ఉద్యోగం

డిగ్రీ పట్టా చేతికి రాగానే మద్రాసు సర్వీసు కమిషను పరీక్ష రాసిన 1100 మంది నుండి ఎంపిక చేసిన ఏడుగురిలో ఒకడుగా ఎంపికై మంగళగిరిలో సబ్- రిజిస్ట్రారుగా ఉద్యోగం లభించింది. అయితే నటుడిగా తనని తాను నిరూపించు కోవాలని, సినిమాలలో చేరి నటుడి గా తన సత్తా చూపాల న్న కాంక్ష ఎక్కువగా కావటంతో పాటు కార్యాలయంలో జరుగు తున్న తతంగాలు ఎన్టీఆర్ మనసుకు కలచి వేసింది. ఉన్న తాదికారి వారిస్తున్నా, తన ఉద్యోగానికి రాజీనామా చేసాడు. కేవలం మూడు వారాలలోనే ప్రభుత్వ ఉద్యోగం వద్దని చెప్పడం పట్ల ఇంట్లో కూడా ఇబ్బంది పడాల్సి వచ్చిం ది. అయితే తను సినిమాలలో నటుడు కావాలన్న కాంక్షతో మద్రాసు చేరారు.

సినీరంగ ప్రవేశం

ఎల్వీ ప్రసాద్ కార్యాలయంలో నిర్మాత బి.ఏ.సుబ్బారావు ఎన్టీఆర్ ఫొటోను చూసి, తను నిర్మించేపల్లెటూరి పిల్ల సినిమాలో కథానాయకుడిగా ఎంపిక చేసాడు. కానీ సినిమా నిర్మాణం వెంటనే మొదలవలేదు. వెయ్యి నూటపదహార్ల పారి తోషికం అందినా పోషణ కొంత ఇబ్బంది ఎదుర్కొన్నాడు. అయితే ఎల్వి ప్రసాద్ మనదేశం సినిమాలో అవకాశం ఇవ్వటంతో కొంత ఊరట కలిగింది. 1949లో వచ్చినఈ సినిమాలో పోలీసు ఇనస్పెక్టర్గా కనిపించి పాత్రలో చూపిన ఇన్వాల్‌మెంట్ చిత్ర సీమలో అందర్నీ కట్టి పడేసింది. ఈ సినిమా విడు దలైఎన్టీఆర్‌కి పేరు తీసుకురాగా 1950లో పల్లెటూరి పిల్ల విడుదలైంది. ఆపై షావుకారు చిత్ర విజ యంతో నటుడిగా నిలదొక్కుకున్న ఎన్టీఆర్ 1951లో కె.వి.రెడ్డి పాతాళభైరవి, బి.ఎన్.రెడ్డి మల్లీశ్వరి, 1952లో పెళ్ళిచేసి చూడు, ఆ తరువాత వచ్చిన కమలాకర కామేశ్వరరావు చంద్రహారం నటుడిగా పేరు తెచ్చి సంపాదించి పెట్టాయి. ఈ సినిమాలన్నీ విజయా వారివే కావటం విశేషం. వీటిలో పాతాళభైరవిలో స్ఫుర్రదూపంతో, వెలుగులు విరజిమ్మే నవ్వుతో ఆంధ్రదేశ ప్రజలను కట్టిపడేసింది. ఎన్టీఆర్ సినీ రంగంలో వెనుదిరిగి చూసుకోన వసరం లేకుండా చేసిందనే చెప్పాలి. 1956లో విజయ వారి మాయా బజార్‌లో శ్రీకృష్ణు డుగా 1959లో ఏ.వి.యం. భూకైలాస్ చిత్రంలో రావణ బ్రహ్మ పాత్రకు రామా రావు ప్రాణప్రతిష్ఠ చేసి ఔరా అనిపించాడు. ప్రతినాయక పాత్రలలో హీరోయి జాన్ని చూపిన ఘనత ఎన్టిఆర్‌దే అనటంలో సందేహం లేదు. 1960 లో తెలుగు ప్రజల ఆరాధ్యదైవం వెంకటేశ్వర స్వామిగా శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం చిత్రంలో నటించి నీరాజనాలందుకున్నారు. 1963 లో విడుదలైన లవకుశ అతి పెద్ద విజయాన్ని నమోదు చేయ టమే కాదు, రాముడు అంటే ఎన్టీఆర్ అనే నటుడిగా విభిన్న కోణాలున్న త్రిపాత్రలలో దానవీరసూరకర్ణ ఓ ఎత్తయితే శ్రీమద్విరాటపర్వములో ఆయన ఐదు పాత్రలు పోషిం చి, ప్రేక్షకులకు కనువిందు చేసారు.

దర్శకత్వం వైపు అడుగులు

సినీ రంగానికి వచ్చిన పుష్కర కాలానికే వెండితెరపై తన సత్తా చాటిన ఎన్టీఆర్ దర్శకత్వం వైపు మరలారు. తన సోదరుడు త్రివిక్రమరావు నిర్మాతగా కళాశాల సమయంలో ఆరంభించిన నేషనల్ ఆర్టు థియేటర్స్‌ని ప్రొడక్షన్సుగా మార్చి చిత్ర నిర్మాణంతో పాటు స్వీయదర్శకత్వంలో సీతారామ కళ్యాణం. విడుదల చేసారు. 1961లో విడుదలైన ఈ సినిమా లో రావణుడిగా ప్రతినాయక పాత్రలో కనిపించి పురాణ పాత్రల కు తనకెవ్వరూ సాటిలేదనిపించారు ఎన్టీఆర్. ఆపై పలు చిత్రాలు ఈబ్యానర్‌లో జరుగగా, తన పెద్ద కుమారుడు రామ కృష్ణ మరణంతో ఆతని పేరుతో రామకృష్ణ సినీ స్టూడి యోస్ ఏర్పాటు చేసి చిత్రనిర్మాణం చేసారు. ఈ క్రమంలోనే 1977 లో దాన వీర శూర కర్ణలో మూడు పాత్రల్లో నటిస్తూ స్వీయ దర్శకత్వం చేయగా 1978లో శ్రీరామ పట్టాభిషేకం సినిమా కు కూడా ఆయన దర్శకత్వం వహించాడు.

మాస్ సినిమాల వైపు అడుగులు

ఎలాంటి పాత్రనైనా అవలీలగా చేసే ఎన్టీఆర్‌ని రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన అడవిరాముడు పూర్తి మాస్ హీరోగా మార్చేసాయి. ఓ వైపు సాంఘిక పాత్రలు నటిస్తూనే సమాజంలో జరుగుతున్న పరిణామాలను తన చిత్రాలలో ఉండేలా చూసుకునే వారు. ఎమర్జన్సీ నాటి ఘటనలను వ్యం గ్యంగా వ్యతిరేకించేలా యమగోల చిత్రంలో కొన్ని సన్నివేసా లు రాయించుకుని అప్పటి ప్రభుత్వాన్ని ఎండగట్టే వారు. ఈ క్రమంలోనే వచ్చిన చిత్రాలు గొప్ప బాక్సాఫీసు విజయం సాధిం చాయి. ఇలా వేటగాడు, గజదొంగ, డ్రైవర్ రాముడు, సర్దార్ పాపారాయుడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, బొబ్బిలివులి చిత్రాల్లో ఆయన విలక్షణ నటనను ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోరు. ఎన్టిఆర్ నటించిన చివరి చిత్రం మేజర్ చంద్రకాంత్. తన కెరీర్‌లో ఆయన దాదావు 320కి పైగా చిత్రాల్లో నటించి తెలుగువారి మదిలో నిలచారు.

ప్రచార ప్రభంజనం

ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదాన్ని అందుకున్న ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని స్థాపించి కాంగ్రెసు పార్టీని కూకటివేళ్ళతో పెకలించివేసేలా ఉద్వేగభరితంగా, ఉద్రేకపూరితంగా ఉండే ప్రసంగాలు ప్రజలని పట్ల ఆకర్షించేలా చేసాడు. కేవలం పార్టీ స్థాపించిన 9నెలల 97 ఎళ్ళ సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రె సు పార్టీని ఓడించి అధికారం అందుకున్నారు.

జనరంజక పాలన

ప్రజలే దేవుళ్ళు - సమాజమే దేవాలయం అంటూ ప్రజాసేవలో తరించారు. అధికారం అందుకున్న గ్రామీణ జీవితాన్ని ఫ్యూడల్ శక్తుల కబంద హస్తాలనుంచి విడిపించేందుకు మునసబు - కరణం వ్యవస్థలను రద్దుపరచి బడుగు - బల హీనవర్గాలకు ప్రజాస్వామ్య వ్యవస్థలను దగ్గరకు చేర్చారు. ఎన్టీఆర్, రెండు రూపాయల కిలో బియ్యం, సంపూర్ణ మధ్య నిషేధం, హామీలను అమలుపరిచాడు. కాంగ్రెస్ కు చుక్కలు చూపించిన ఎన్టిఆర్ దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను ఐక్యర చేసి నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేయటమే కాకుండా. కేంద్రంలో తొలి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు సాధించాడు. ఒక ప్రాంతీయ దేశ రాజకీయాలకు దిక్సూచిగా తెలుగుదేశం పార్టీని మార్చిన ఘనత ఆయనదే.

చివరి రోజులలో

1994 ఎన్నికలలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన ఎన్టిఆర్. పార్టీలో వర్గాలు ముఠాలు కట్టడపై దృష్టి సారించక పోవటంతో లక్ష్మీపార్వతి, చంద్రబాబు, దగ్గుబాటి ఇలా పార్టీ విడిపోయింది. ఇది కాస్త ముదిరి సంక్షోభానికి దారి తీయటంతో చంద్రబాబునాయుడు సారధ్యంలో యావత్ పార్టీ ఎదురు తిరిగి పార్టీని ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకుంది. దీంతో ఎన్టీఆర్ రాజకీయ జీవితమే ముగిసిన ట్లయింది. 1996 జనవరి 18న ఎన్టిఆర్ గుండెపోటుతో మరణించారు. అనేక అంశాలలో తెలుగుప్రజల సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిన ఆయన భౌతికంగా దూరమైనా ప్రజలు, అభిమా నుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఘనుడు. ముప్పై మూడేళ్ళ తెర జీవితంలోను, పదమూడేళ్ళ రాజకీయ జీవితంలోను నాయకుడిగా వెలిగిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడు.





తెలుగుదేశం ఏర్పాటు

1982 మార్చి 21 న హైదరాబాదు వచ్చినప్పుడు అభిమానులు ఆయనకు ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలికారు. 1982 మార్చి 29సాయంత్రము 2:30లకు కొత్త పార్టీ పెడుతున్నట్లు చెప్పాడు. ఆసమయంలోనే తన పార్టీ పేరు తెలుగుదేశంగా నిర్ణయించి, ప్రకటించాడు. పార్టీ ప్రచారానికై తన పాత చెవ్రోలెటు వ్యానును బాగు చేయించి, దానిని ఒక కదిలే వేదికగా తయారు చేయించాడు. దానిపై నుండే ఆయన తన ప్రసంగాలు చేసేవాడు. దానిని ఆయన చైతన్యరథం అని అన్నాడు. ఆ రథంపై తెలుగుదేశం పిలుస్తోంది, రా! కదలి రా!! అనే నినాదం రాయించాడు. ఆ తరువాతి కాలంలో భారత రాజకీయాల్లో పరుగులెత్తిన ఎన్నో రథాలకు ఈ చైతన్యరథమే స్ఫూర్తి

నేషనల్ ఆర్ట్ థియేటర్స్

నేషనల్ ఆర్ట్ థియేటర్ గ్రూప్ అనే నాటక సంస్థను స్థాపించి కొంగర జగ్గయ్య, ముక్కామల, నాగభూషణం, కె.వి.ఎస్.శర్మ తదితరులతో చేసిన పాపం వంటి ఎన్నో నాటకాలు ఆడాడు ఎన్టీఆర్. తర్వాతి కాలంలో ఈ సంస్థని చిత్రనిరాణ సంస్థగా మార్చారాయన.

తెలుగంటే ప్రాణం

తెలుగుభాషని అమితంగా అభిమానించే ఎన్టీఆర్ ఆ భాషమాధుర్యాన్ని జనం ఆస్వాదించేలా చేసారు. తను రాజకీయాల్లోకి వస్తూ తెలుగుదేశం అంటూ పార్టీ పెట్టి కేవలం 9 నెలల్లో అధికారం అందుకున్న ఆయన దాదాపు ప్రవేశ పెట్టిన ప్రతిపథకానికి తెలుగుపేరే పెట్టేవారు. హైదరా బాదు ట్యాంకు బండ్‌పై సుప్రసిద్ధులైన తెలుగువారి విగ్రహాలు నెలకొల్పారు. 1991లో నంద్యాల లోక్‌సభ ఉప ఎన్నికలలో కాంగ్రెసు తరవున అభ్యర్థిగా అప్పటి ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు నిలబడగా, తెలుగు వాడు ప్రధాని అయ్యాడంటూ గౌరవ సూచకంగా ఎన్టీఆర్ ఎవరినీ పోటీగా నిలబెట్టకుండా హుందా రాజకీయాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారనటంలో సందేహం లేదు. తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్.

రాజకీయ రంగ ప్రవేశం

1981లో ఊటీలో సర్దార్ పాపారాయుడు చిత్రం షూటింగు విరామసమయంలో తెలుగు ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించా రు. వారికి నేనెంతో రుణపడి ఉన్నాను. నా తరువాతి పుట్టిన రోజునుంచి నా వంతుగా ప్రతీనెలలో 15రోజులు తెలుగుప్రజల సేవకోసం కేటాయిస్తాను అని చెప్పడంతో వందలాది మంది అభిమానులు రాజకీయాల లోకి వచ్చి ఈ రాష్ట్రాన్ని బాగుచేయండంటూ విన్నవించారు. అప్పటికే ఆంధ్రరాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెసు పార్టీ ఐదేళ్ల పాలనాకాలంలో నలుగురు ముఖ్యమంత్రులు మార్చ డం. సిఎంలని అవమానపరచడం తదితర అంశాలు ఎన్టీఆర్‌ని త్రీవ ప్రభావానికి గురిచేసాయి. ప్రజలసమస్యలపై అధ్యయనం చేసుకుంటూ తాను నటించవలసిన సినిమాలు త్వరత్వరగా పూర్తి చేసి రాజకీయ రంగంలోకి దూకారు



ఆయన గురించి చెప్పడమంటే కొండను అద్దంలో చూపించడమే

నందమూరి బాలకృష్ణ



అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ 111వ జయంతి ఉత్సవం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గురువారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వైవీయస్ చౌదరి, గీతాంజలి, ప్రసాద్ క్రియేటివ్ మెంటార్స్ ఫిలిం అండ్ మీడియా స్కూల్ ప్రతినిధి సురేష్ కొవ్వూరి, రమేష్ ప్రసాద్ తనయ రాధాప్రసాద్, జర్నలిస్ట్ ప్రభు, రమేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రసాద్ క్రియేటివ్ మెంటార్స్ ఫిలిం అండ్ మీడియా స్కూల్ ప్రతినిధి సురేష్ కొవ్వూరి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్వీ ప్రసాద్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ రన్ చేస్తున్నాం. త్వరలోనే ప్రొడక్షన్‌లోకి రావాలనుకుంటున్నాం. ఎల్వీ ప్రసాద్‌గారి జీవితంలోని విషయాలను ప్రతి ఒక్కరూ తలా రెండు పేజీలు చదివి ఆచరించినా చాలు.. అని చెప్పారు.

రమేష్ ప్రసాద్ తనయ రాధాప్రసాద్ మాట్లాడుతూ.. మా తాతగారి గురించి ఏవీ చూసి థ్రిల్ అయ్యాను. మా పూర్వీకుల విలువలని, వాళ్ల ఆలోచనలని గౌరవించి, కొనసాగిస్తాం. మా నాన్నగారు ముందుండి తాతగారి బయోపిక్ తీయాలని ఆలోచిస్తున్నాం.. అన్నారు

రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ.. మా నాన్న సినిమా వ్యక్తి. ఆయనకు సినిమా తప్ప మరేమీ తెలియదు. నేను ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఈ రంగంలోకి వచ్చాను. అంతకు ముందే నన్ను నటుడిని చేయాలన్నది మా నాన్నగారి కోరిక. అయితే ఓ సారి సంసారం సినిమా షూటింగ్‌లో నేను అంతంత సేపు స్టూడియోలో కూర్చోవడం ఇష్టం లేక ఆయన్ని విసిగించాను. అప్పటి నుంచి నాకు యాక్టింగ్ మీద పెద్దగా ఆసక్తిలేదు. మా ప్రసాద్ ప్రాసెసింగ్ ల్యాబ్‌కి 17 సార్లు జాతీయ పురస్కారం దక్కింది.. అన్నారు.

నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. భారత సినీ రంగంలో ఎల్వీ ప్రసాద్‌గారి గురించి చెప్పడం అంటే సూరీడికి వెలుగు చూపించడమే. ఆయన ఒక వ్యవస్థ. నటుడు కావాలనుకున్నారు. అలాగే నటించారు. దర్శకుడిగా మారారు. ఆయన సినిమా రంగంలో తనకు ఇష్టమైన అన్ని శాఖల్లోనూ కృషి చేశారు. ప్రసాద్ ల్యాబ్స్ అనే గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. అందుకే ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి. మద్రాసులో ఎదురెదురిళ్లల్లో ఉండేవాళ్లం. గతాన్ని ఎవరూ మర్చిపోకూడదు. భావి తరాలకు చెప్పాలి. ఎల్వీ ప్రసాద్‌గారి కలల్ని ఆయన తనయుడు సాకారం చేయడం ఆనందంగా ఉంది.. అని అన్నారు!!

అరవింద సమేత వీర ప్రేమిక






అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై వెంకీ అట్లూరి దర్శకత్వంలో భారీ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. థమన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఆడియో ఇటీవల విడుదలై సూపర్‌హిట్ అయ్యింది. చిత్రంలోని అన్ని పాటలకు శ్రోతల నుంచి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను జనవరి 19న హైదరాబాద్‌లోని జె.ఆర్.సి. కన్వెన్షన్ సెంటర్‌లో గ్రాండ్‌గా నిర్వహించబోతున్నారు. ఈ వేడుకకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ చిత్రాన్ని రిపబ్లిక్ డే సందర్భంగా ఒకరోజు ముందు జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి సంగీతం: థమన్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్, నిర్మాత: బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వెంకీ అట్లూరి!!

సరసాలే కాదు షరతులూ ఉంటాయంటోంది



గత ఏడెనిమిదేళ్లుగా సహ జీవనం చేస్తూ, ఇటీవల పెళ్లి చేసుకుని హనీమూన్‌కి కూడా వెళ్లొచ్చిన దీపిక-రణవీర్‌ల జంటకు సరసాలు కొత్తేమీ కాదు. పైగా వీరిద్దరూ మూడు చిత్రాల్లో జంటగానూ నటించి ఉన్నారు. అయితే ఇప్పుడు శ్రీవారిగా మారిన తన స్వీట్‌హార్ట్‌కి కొన్ని షరతులు కూడా విధించిందంట దీపిక. ఈ విషయాన్ని రణవీర్ స్వయంగా చెప్పుకున్నాడు. ఆ షరతులెటువంటివంటే.. షూటింగ్‌కి టైమ్ అయిపోతోందంటూ.. ఏదో ఒకటి కడుపులో పడకుండా బయటకు వెళ్లకూడదు. షూటింగ్ అయిన వెంటనే నేరుగా బుద్ధిగా ఇంటికి రావాలి. పబ్‌లు, పార్టీలకు వెళ్లాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలి... వగైరా వగైరా. ఈ షరతుల గురించి రణవీర్ ఎంతో గర్వంగా చెబుతుండడం ఇక్కడ కొసమెరుపు. దీపిక తనకు దొరికిన ఓ అరుదైన వజ్రమని, జీవితాంతం దాన్ని తాను నిలబెట్టుకుంటానని కూడా రణవీర్ చెబుతున్నాడు!!

నాన్న ఆరోగ్యం నిలకడగా ఉంది

బ్రహ్మానందం తనయుడు రాజా గౌతమ్



ప్రఖ్యాత తెలుగు హాస్య నటుడు పద్మశ్రీ, డా. బ్రహ్మానందం ఆస్పత్రిలో ఉన్నారనే విషయం తెలిసి ఆయన అభిమానులు, సన్నిహితులు కలవరపడ్డారు. అయితే ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది అని ఆయన తనయుడు హీరో గౌతమ్ తెలిపారు. కొన్ని నెలలుగా ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లోని ప్రముఖ డాక్టర్‌ని సంప్రదించారు బ్రహ్మానందం. వారి సలహా మేరకు శస్త్ర చికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. దేశంలోనే అత్యుత్తమమైన ముంబైలోని 'ఏషియన్ హార్ట్ ఇన్స్టిట్యూట్‌లో 14.1.19న గుండె ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ప్రముఖ హృదయ చికిత్స నిపుణులు రమాకాంత్ పాండా బ్రహ్మానందంకి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఐసీయు నుంచి సాధారణ గదికి మార్చటం జరిగింది అని తెలిపారు. నాన్నగారికి శస్త్ర చికిత్స జరిగిందని తెలిసి అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమ లోని ప్రముఖులు అందరూ ఆయన ఆరోగ్యపరిస్థితి గురించి వాకబు చేయటం మొదలు పెట్టారు. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సులు వల్ల నాన్నగారి ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉందని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఆయన కుటుంబ సభ్యులు. బ్రహ్మానందం కుమారులు రాజా గౌతమ్, సిద్దార్థ్ తండ్రితో పాటు ముంబైలో ఉన్నారు!!

మహిళా ప్రధాన చిత్రాలు రూపొందిస్తా

బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ పద్మినీ నాగులపల్లి



ఇప్పుడు మహిళలు కూడా పలు రంగాల్లో దూసుకుపోతున్నారు. అవకాశాల్లోనూ సగం, ఆకాశంలోనూ సగం అంటూ పురుషులకు గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే ఆల్ రౌండర్‌గా అభివర్ణించదగ్గ మహిళలు చాలా అరుదుగా మాత్రమే ఉంటారు. అలాంటి అరుదైన కోవకు చెందిన బహుముఖ ప్రతిభాశాలి పద్మినీ నాగులపల్లి.

విద్య, వినయం, అందం, ఐశ్వర్యం, కార్యదక్షత, కారుణ్యం వంటి పలు సద్గుణాల సమాహారం శ్రీమతి పద్మినీ నాగులపల్లి. ప్రొడ్యూసర్‌గా, ప్రొడ్యూసర్ సెక్టార్ వైస్ చైర్‌పర్సన్‌గా, సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ జ్యూరి మెంబర్‌గా, సొంత విద్యాసంస్థ నిర్వాహకురాలిగా బహు ముఖాలుగా రాణిస్తున్న పద్మిని పరిశ్రమ వర్గాలకే కాదు.. ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఎందుకంటే ఆమె చాలా తరచుగా సినిమా వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతుంటారు. టీవీల్లో సినిమా రంగంపై జరిగే చర్చల్లో తన వాణిని బలంగా వినిపిస్తుంటారు. స్వయంగా పలు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.

తన తనయుడు మానస్‌ను హీరోగా పరిచయం చేస్తూ జలక్ చిత్రంతో నిర్మాతగా మారిన పద్మిని కాయ్ రాజా కాయ్, సోడా గోలీసోడా, ప్రేమికుడు చిత్రాలను నిర్మించారు. అయితే నిర్మాతగా తన తొలి చిత్రం తనకు కోటిన్నర విలువ చేసే ఖరీదైన అనుభవాన్ని పంచిందని, ఆ అనుభవం వృథా కాకుండా ప్రొడ్యూసర్ సెక్టార్ వైస్ చైర్‌పర్సన్ హోదాలో.. కొత్త నిర్మాతలకు మార్గదర్శనం చేస్తూ.. తనలా వారు కూడా నష్టపోకుండా నా పరిధిలో సాయం చేస్తున్నానన్న ఆత్మతృప్తి నాకుందని పద్మినీ చెబుతారు.

విద్య, మహిళాసాధికారత వంటి రంగాల్లో పద్మినీ చేస్తున్న అనుపమానమైన సేవలకు గాను ఈమెను ప్రతిష్టాత్మక డాక్టరేట్ వరించి ఉండడం విశేషం. సినిమా రంగంలోని సమస్యల పట్ల తనకు గల పూర్తి అవగాహనతో.. సమాజంలో మహిళలకు జరుగుతున్న వివక్షతలను వేలెత్తి చూపుతూ హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు చేయడం కోసం సన్నాహాలు చేస్తున్నానని నాగులపల్లి చెబుతున్నారు!!

హద్దులు మీరనివ్వని సైనికుడిగా



మనిషికి, మనిషికీ.. దేశాలకు, ప్రాంతాలకు మధ్య కొన్ని హద్దులు ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్లున్నంత వరకూ అవి సరిగానే ఉంటాయి. కానీ ఒక్కసారి ఆ సరిహద్దులు అతిక్రమిస్తే సంఘర్షణ మొదలవుతుంది. దేశాలు, ప్రాంతాల మధ్య ఈ సరిహద్దు సంఘర్షణలు తీవ్ర పరిణామాలకు దారి తీయొచ్చు.. ఒక్కోసారి అది జాతీయ సమస్యగానూ మారొచ్చు. అలా మారకుండా చూసే శక్తి ఆర్మీ. సైనికుడు సరిహద్దుకు కాదు దేశానికే రక్షకుడు. ఇదే కాన్సెప్ట్‌తో యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తనీష్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. తనీష్ గత సినిమా రంగుతో విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న కార్తికేయ ఈ చిత్రానికి దర్శకుడు. అంటే రంగు కాంబినేషన్ రిపీట్ అవుతోందన్నమాట. నేషనలైజ్డ్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం టైటిల్ కూడా 'సరిహద్దు'. తెలుగుతో పాటు హిందీ భాషలోనూ విడుదల చేయబోతోన్న 'సరిహద్దు' మూవీ షూటింగ్ మార్చి 16 నుంచి ప్రారంభం కాబోతోంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉండబోతోన్న ఈ చిత్రంలో తెలుగుతో పాటు హిందీ భాషా నటులు కూడా నటిస్తారు. ఇతర ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ వివరాలను ఈ నెలాఖరులో తెలియజేయబోతున్నారు!!

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నా

ఆర్.ఎక్స్.కార్తికేయ



ఆర్ ఎక్స్ 100 ' ఫేమ్ కార్తికేయ హీరోగా జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, స్ప్రింట్ టెలీ ఫిలిమ్స్ సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మాతలు. అర్జున్ జంధ్యాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఒంగోలులో మొదలైంది.

హీరో కార్తికేయ మాట్లాడుతూ.. 'ఆర్ ఎక్స్ 100' విడుదలైన తర్వాత చాలా కథలు విన్నాను. వాటిలో నాకు అర్జున్ జంధ్యాల చెప్పిన కథ బాగా నచ్చింది. బెస్ట్ స్టోరీ టు టెల్ అనిపించింది. వెంటనే ఓకే చెప్పేశాను. మంచి రోజు చూసి ముహూర్తం షాట్ తీశాం. షూటింగ్ లొకేషన్‌లోకి ఎప్పుడెప్పుడు వెళ్తానా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.. అని అన్నారు.

దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ.. 'నేను బోయపాటి శ్రీనుగారి దగ్గర దర్శకత్వశాఖలో పనిచేశాను. ఆయన నాకు గురువుగారు మాత్రమే కాదు. సోదర సమానులు. కార్తికేయగారు సినిమాను నమ్మి చేయడానికి ముందుకొచ్చారు. ఆయన వల్లనే ఈ చిత్రం ఇంత త్వరగా పట్టాలెక్కింది. నిర్మాతలు కథ మీద నమ్మకంతో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా చేయాలనే ప్యాషన్‌తో ఉన్నారు. కథానుగుణంగా ఒంగోలులో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తాం.. అని చెప్పారు.

నిర్మాతలు అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ చిత్రంతో సినిమా రంగంలో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరిస్తాం. ఈ షెడ్యూల్లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను తెరకెక్కిస్తాం. సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తాం.. అని అన్నారు

ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: చైతన్య భరద్వాజ్, కెమరామెన్: 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ రామ్, ఆర్ట్ డైరెక్టర్ : జీయమ్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శివ మల్లాల!!

సూర్య
హైదరాబాద్
శుక్రవారం
18 జనవరి 2019



కోహ్లీ న్యూజిలాండ్ వస్తున్నాడు..

హైదరాబాద్ : స్టార్ స్పోర్ట్స్ కు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్న విషయం తెలిసిందే. వ్యాపార విస్తరణతో పాటు అభిమానులకు మరింత చేరువకావాలనే ఉద్దేశంతో స్టార్ సంస్థలు ప్రాంతీయ భాషలపై దృష్టి పెట్టాయి. దీనిలో భాగంగా స్టార్ స్పోర్ట్స్ 1 తెలుగు చానల్ ప్రారంభించింది. ఇప్పటికే ప్రో కబడ్డీ ఆరో సీజన్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన స్టార్ స్పోర్ట్స్ తెలుగు చానల్.. క్రీడా అభిమానులకు మరింత చేరువయ్యేందుకు మరో ముందుడుగేసింది. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం టీమిండియా న్యూజిలాండ్‌కు పయనమవనుంది. ఈ పర్యటనలో కివీస్‌తో కోహ్లీ సేన ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌ను స్టార్ స్పోర్ట్స్ ప్రత్యక్షప్రసారం చేయనుంది. దీనిలో భాగంగా సిరీస్‌కు సంబంధించిన ప్రోమోను తాజాగా స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసింది. కె అంటే కోహ్లీ.. కోహ్లీ న్యూజిలాండ్ వస్తున్నాడు. అప్పుడు తెలుస్తుంది నిజమైన కింగ్ ఎవరనేది అంటూ తెలుగులో సంభాషణలు ఉండటంతో తెలుగు అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇక ఇప్పటికే విడుదల చేసిన ప్రోమో నెటిజన్లను తెగ ఆకట్టుకుంటుంది. ప్రాంతీయ భాషలో క్రికెట్ కామెంటరీ వినబోతుండటం ఆనందంగా ఉందని నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొత్త చరిత్ర కోసం...

- సిద్ధమవుతున్న కోహ్లీ అండ్ కో
- వన్డే సిరీస్ విజయంతో మరో
- చరిత్ర సృష్టించడమే భారత్ లక్ష్యం
- అందుకు అన్ని అస్త్రాలు సిద్ధం
- చేసుకున్న టీమిండియా...
- సిరీస్‌లో భాగంగా ఈ ఉదయం 7.50కి మూడో వన్డే మ్యాచ్



మెల్‌బోర్న్ : ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌ను వారి గడ్డపై గెలిచి కొత్త చరిత్ర సృష్టించిన టీమిండియా.. ఇప్పుడు మరో రికార్డుపై కన్నేసింది. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి వన్డేలో టీమిండియా గెలిస్తే కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుంది. ఇప్పటివరకూ ఆస్ట్రేలియా గడ్డపై ఒక ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలిచిన చరిత్ర టీమిండియాకు లేదు. గతంలో రెండు సందర్భాల్లో ఆస్ట్రేలియా గడ్డపై వన్డే ఫార్మాట్‌లో సిరీస్‌లు సాధించినప్పటికీ, అవి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు కావు. ఒకటి 1985లో జరిగిన వరల్డ్ చాంపియన్ షిప్ ఆఫ్ క్రికెట్ టైటిల్ కాగా, రెండోది మూడు దేశాలు పాల్గొన్న సీబీ సిరీస్.

దాంతో ఒక ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో తొలిసారి ఆసీస్‌ను వారి దేశంలో ఓడించే అవకాశం టీమిండియా ముంగిట ఉంది. ఈ మేరకు కసరత్తులు చేస్తున్న కోహ్లీ అండ్ గ్యాంగ్ ఆసీస్ పర్యటనకు ఘనమైన ముగింపు ఇచ్చే యోచనలో ఉంది. రేపు(శుక్రవారం) మెల్‌బోర్న్ వేదికగా ఇరు జట్ల మధ్య సిరీస్ నిర్ణయాత్మక వన్డే జరుగనుంది. భారత కాలమాన ప్రకారం ఉదయం గం.7.50 ని.లకు మ్యాచ్ ఆరంభం కానుంది. భారత్-ఆసీస్‌లు తలో వన్డే గెలిచి సమంగా నిలవడంతో మూడో వన్డేకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొలి వన్డేలో ఆసీస్ 34 పరుగుల తేడాతో గెలవగా, రెండో వన్డేలో 6 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. రేపటి మ్యాచ్‌లో భారత్ గెలిచిన పక్షంలో ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్‌ను కోల్పోకుండా ముగించినట్లు అవుతుంది. మూడు టీ20ల సిరీస్ 1-1తో సమం కాగా, నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1తో టీమిండియా గెలుచుకుంది.

సిరాజ్‌కు ఉద్వాసన తప్పదా..?



ఆసీస్‌తో రెండో వన్డేలో ఆడటం ద్వారా ఈ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఘోరంగా నిరాశపరిచాడు. అడిలైడ్ వన్డేలో 10 ఓవర్లలో 76 పరుగులిచ్చిన అతను ఒక్క వికెట్ కూడా తీయలేదు. భారత్ తరఫున కర్సన్ ఘావ్రీ (0/83) తర్వాత అరంగేట్రంలో అతి చెత్త ప్రదర్శన సిరాజ్‌దే కావడం గమనార్హం. దాంతో సిరాజ్‌పై వేటు తప్పేలా కనబడటం లేదు. అతని స్థానంలో ఖలీల్ అహ్మద్ తిరిగి జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. ఈ ఒక్క మార్పు తప్పితే భారత జట్టులో మార్పులు ఉండకపోవచ్చు. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో కేదర్ జాదవ్‌ను జట్టులో చోటు దక్కడం కష్టంగానే ఉంది. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా స్థానంలో కానీ, కుల్దీప్ యాదవ్ స్థానంలో కానీ కేదర్ జాదవ్‌ను తీసుకోవాలి. కాగా, కీలకమైన మ్యాచ్‌కు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లను తీసే సాహసం టీమిండియా యాజమాన్యం చేయకపోవచ్చు. అడిలైడ్ వన్డేలో కుల్దీప్ రాణించనప్పటికీ మెల్‌బోర్న్ పిచ్ పొడిగా ఉండే అవకాశం ఉండటంతో అతనికే తుది జట్టులో అవకాశం ఖాయంగా కనబడుతోంది. దాంతో పెద్దగా మార్పులు లేకుండానే టీమిండియా ఫైనల్ టచ్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంది.

ఆసీస్ జట్టులో రెండు మార్పులు

టీమిండియాతో నిర్ణయాత్మక చివరి పోరుకు ఆస్ట్రేలియా సిద్ధమైంది. జట్టులో రెండు మార్పులు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో రెండు జట్లు చెరో మ్యాచ్ గెలవడంతో పోరు రసవత్తరంగా మారింది. చివరి పోరులో గెలిచిన జట్టే సిరీస్ కైవసం చేసుకుంటుంది. అటు కోహ్లీసేన, ఇటు ఫించ్ బృందం విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. కఠోరంగా శ్రమిస్తున్నాయి. మెల్‌బోర్న్‌లో జరిగే మ్యాచ్ కోసం ఆతిథ్య జట్టు ఇద్దరు ఆటగాళ్లను కొత్తగా తీసుకుంది. వెటరన్‌స్పిన్నర్ నేథన్ లైయన్ స్థానంలో ఆడమ్ జంపాను పిలిపించింది. గత రెండు వన్డేల్లో లైయన్ ఒక్క వికెట్ పడగొట్టలేదు. వెన్నునొప్పితో బాధపడుతున్న జేసన్ బెరెన్‌డార్ఫ్ బదులు బిల్లీ స్టాన్‌లేక్‌ను ఎంచుకుంది. మెల్‌బోర్న్ రెనెగేడ్స్ పేసర్ కేన్ రిచర్డ్సన్‌ను సైతం పిలిపించింది. తాము సిరీస్ గెలిచి చాన్నాళ్లైందని ప్రస్తుతం మెరుగయ్యామని ఆసీస్ సారథి ఆరోన్ ఫించ్ అన్నాడు.

ఆసీస్ జట్టు : ఆరోన్ ఫించ్, అలెక్స్ కారె, ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కాంబ్, మార్కస్ స్టొయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, జే రిచర్డ్సన్, పీటర్ సిడిల్, ఆడమ్ జంపా, బిల్లీ స్టాన్‌లేక్



ఎప్పుడెలా ఆడాలో ధోనీకి తెలుసు

టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ సందర్భానికి తగిన విధంగా ఆడతాడని ఆస్ట్రేలియా మాజీ పేసర్ జాసన్ గిలెస్పీ అన్నాడు. ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో అతడి ఆట అద్భుతమని ప్రశంసించాడు. ఈ సిరీస్‌లో అతడు వరుసగా రెండు అర్ధశతకాలు బాదిన సంగతి తెలిసిందే. మ్యాచ్‌లు ముగించడంలో ధోనీకి ఉన్న నైపుణ్యంతో భారత్ దశాబ్ద కాలంగా లబ్ధి పొందుతోంది. ఇప్పటికీ టీమిండియా ఆ ప్రయోజనం పొందుతోంది. సిడ్నీ వన్డేలో 4/3తో ఉన్నప్పుడు అదే ధోనీ అనుభవంతో జట్టు పుంజుకుంది. సిడ్నీలో అతడు నిదానంగా ఆడినప్పటికీ ఎందుకలా ఆడాడో మనం అర్థం చేసుకోవచ్చు. పరిస్థితిని అనుసరించి ఆడాడు. మిడిలార్డర్‌లో వచ్చి భిన్నమైన పరిస్థితుల్లో ఆడటం చాలా కష్టం. అతడు 300 పైగా వన్డేలు ఆడాడు. ఎప్పుడెలా ఆడాలో ధోనీకి బాగా తెలుసు అని గిలెస్పీ అన్నాడు. ఛేదన రారాజు విరాట్ కోహ్లీపై గిలెస్పీ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ నుంచి మరో మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్. అందరి కన్నా అతడెంతో భిన్నం. గణాంకాలే అతడి గురించి చెబుతాయి. మనం ప్రత్యేకంగా ఉపమానాలు చెప్పాల్సిన పనిలేదు. 39 శతకాలు, సచిన్ కన్నా 50 తక్కువ ఇన్నింగ్సుల్లోనే 10,000 పరుగులు చేశాడు. తెందుల్కర్ ఎంతమంచి ఆటగాడో మనందరికీ తెలుసు. విరాట్ గొప్పగా ఆడుతున్నాడు. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అతడే అత్యుత్తమం. టీమిండియా మిడిలార్డర్ బాగాలేదని చెప్పను. మంచి బ్యాట్స్‌మన్‌తో సమతూకంగా ఉంది. ధోనీ, అంబటి రాయుడు ఉన్నారు. జట్టు విరాట్‌పై కాస్త అతిగా ఆధారపడుతున్నా మిడిలార్డర్ బాగుంది అని గిలెస్పీ అన్నాడు.

మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ
క్వార్టర్స్‌లో సైనా నెహ్వాల్



కౌలాలంపూర్ (మలేసియా) : భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ భాగంగా గురువారం జరిగిన రెండో రౌండ్ పోరులో సైనా నెహ్వాల్ 21-14, 21-16 తేడాతో యిప్ వుయ్ యిన్ (హాంకాంగ్)పై గెలిచి క్వార్టర్స్‌కు చేరారు. కేవలం 39 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సైనా ఆద్యంతం పైచేయి సాధించారు. తొలి గేమ్‌ను అవలీలగా గెలిచిన సైనా, రెండో గేమ్‌లో మాత్రం కాస్త పోరాడి గెలిచారు. శుక్రవారం జరుగనున్న క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ ఒకుహారా(జపాన్)తో సైనా తలపడతారు. ఇరువురి మధ్య ముఖాముఖి రికార్డులో సైనా 8-4తోముందంజలో ఉన్నారు. గతేడాది జరిగిన రెండు వరుస టోర్నమెంట్లలో(డెన్మార్క్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్) ఒకుహారాపై సైనా విజయం సాధించారు.

క్రికెటర్లు కూడా మనుషులే..

- వాళ్లేమి యంత్రాలు కారు
- తప్పులు చేస్తుంటారు!
- పాండ్య, రాహుల్ వ్యాఖ్యలపై
- మాజీ కెప్టెన్ గంగూలీ స్పందన



ముంబయి : వివాదాలను పక్కనపెట్టి ముందుకు వెళ్లాలని టీమిండియా మాజీ సారథి సౌరవ్ గంగూలీ అన్నారు. కాఫీ విత్ కరణ్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెండైన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వారిద్దరూ తప్పు తెలుసుకొని మరింత మెరుగవుతారని ఆశించారు. ప్రజలు పొరపాట్లు చేస్తారు. వాటిపై తీవ్రంగా స్పందించొద్దు. తప్పు చేసినవారు దాన్ని తెలుసుకొని మరింత మెరుగైన వ్యక్తిగా మారతారని నమ్మకముంది. తప్పు చేయకుండా ఉండటానికి మనమేమీ యంత్రాలం కాదు మనుషులం. ఇక ముందుకెళ్లి మరోసారి ఇలాంటిది జరగకుండా చూసుకోవాలి అని గంగూలీ అన్నారు. క్రికెటర్లు చాలా అణకువగా ఉంటారు. ఎప్పుడో ఒకసారి ప్రతి ఒక్కరూ పొరపాటు చేస్తారు. ఇప్పటి క్రికెటర్లు చాలామంది వ్యక్తిగతంగా నాకు బాగా తెలుసు. ఈ తరం క్రికెటర్లూ విధేయులుగా ఉంటారు. విరాట్ కోహ్లీని చూడండి. అతనో ఆదర్శనీయుడు. భారత్‌ది అదృష్టం. ప్రతి తరంలోనూ అందరినీ ఆకట్టుకునే, అలరించే, ఆనందపెట్టే క్రికెటర్లకు జన్మనిస్తోంది. ఒకప్పుడు గావస్కర్, ఆ తర్వాత సచిన్ తెందుల్కర్ కెరీర్ ముగియగానే తర్వాత ఎవరు? అని ఆలోచించారు. ఇప్పుడా ప్రశ్నకు జవాబు విరాట్. చాలా మంది క్రికెటర్లు స్వతహాగా మంచి మనుషులు. మధ్య తరగతి నుంచి పోరాడి ఈ స్థాయికి వస్తారు. కోట్ల మంది క్రికెట్ ఆడేవారిలో 11 మందిని ఎంపిక చేస్తారంటేనే మనం ఊహించుకోవచ్చు అని గంగూలీ అన్నారు.

భారత్‌తో ఇంగ్లాండ్ 3 వన్డేలు, 3 టీ20లు

- ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్
- ముంబై, గువహటీలు వేదికలు



న్యూఢిల్లీ : భారత్‌లో ఇంగ్లాండ్ మహిళల జట్టు పర్యటన షెడ్యూలు ఖరారైంది. ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు జట్లు మూడు వన్డేల సిరీస్‌లో తలపడనున్నాయి. ఆ తర్వాత మూడు టీ20లు ఆడతాయి. ఫిబ్రవరి 22 నుంచి మ్యాచ్‌లు మొదలవుతాయని బీసీసీఐ వెల్లడించింది. వన్డేలు ముంబయిలోని వాంఖడేలో, టీ20లు గువాహటిలోని బర్సపారా మైదానంలో నిర్వహిస్తారు. భారత్, ఇంగ్లాండ్ మహిళల జట్ల పర్యటన షెడ్యూలును బీసీసీఐ, ఈసీబీ ప్రకటించాయి. రెండు జట్లు మూడు వన్డేలు, మూడు టీ2లు ఆడతాయి. వన్డేలు ఉదయం 9 గంటలకు, టీ20లు ఉదయం 10 గంటలకు మొదలవుతాయి అని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి వెల్లడించారు. ఫిబ్రవరి 22, 25, 28న వన్డేలు, మార్చి 4, 7, 9న టీ20లు జరుగుతాయి.

ఇకనుంచి హాకీ సెలక్టర్‌గా సర్దార్ సింగ్



న్యూఢిల్లీ : ఇటీవలే ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్దార్‌సింగ్ ఇక సెలక్టర్ పాత్ర పోషించనున్నాడు. 13 మంది సభ్యుల భారత హాకీ సెలక్షన్ కమిటీలో సర్దార్‌కు చోటు దక్కింది. ఈ విషయాన్ని సర్దార్ సింగ్ ధ్రువీకరించాడు. భారత హాకీకి ఆటగాడిగానే కాకుండా ఏ రకంగా సేవచేసేందుకైనా నేను సిద్ధం. అందుకే సెలక్టర్ పాత్రను పోషించేందుకు కూడా సిద్ధమయ్యాను. సెలక్టర్‌గా విధులు నిర్వర్తించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. రెండు దశాబ్దాలుగా ఆటగాడిగా హాకీ పరిస్థితుల్ని దగ్గరుండి చూశా. జట్టుకు ఏది ముఖ్యమో అర్థం చేసుకున్నా. అనుభవజ్ఞులు, యువతతో కూడిన సమతూకమైన జట్టుకే నేను మద్దతిస్తా అని సర్దార్ సింగ్ పేర్కొన్నాడు. సర్దార్‌తో పాటు హర్బిందర్ సింగ్, సయ్యద్ అలీ, సుబ్బయ్య, ఆర్‌పీ సింగ్, రజనీశ్ మిశ్రా, జోయ్‌దీప్ కౌర్, సురేందర్‌కౌర్, అసుంత లాక్రా, హై పర్ఫామెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్, భారత సీనియర్ పురుషుల, మహిళల జట్ల కోచ్‌లు ఇతర సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీకి 1975 హాకీ ప్రపంచ కప్ విజేత జట్టులో సభ్యుడైన బీపీ గోవింద సారథిగా వ్యవహరిస్తున్నాడు.

రంజీ ట్రోఫీ చరిత్రలో కేరళ తొలిసారిగా...



తిరువనంతపురం : కేరళ క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీ చరిత్రలోనే కేరళ జట్టు తొలిసారి సెమిఫైనల్‌కు చేరింది. ఇప్పటివరకు ఆజట్టు క్వార్టర్ ఫైనల్ వరకు చేరడమే అత్యుత్తమం. గురువారం గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో కేరళ జట్టు 113 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ జట్టును కేరళ బౌలర్లు బెంబేలెత్తించారు. కేరళ బౌలర్లు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ బసిల్ థంపి(5/27), సందీ వారియర్(4/30)లు చెలరేగడంతో గుజరాత్ జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 31.3 ఓవర్లకు 81 పరుగులకే ఆలౌటైంది. గుజరాత్ తమ చివరి 6 వికెట్లను 24 పరుగుల వ్యవధిలోనే కోల్పోవడం గమనార్హం.

స్కోర్లు- కేరళ: 185/9, 171 ఆలౌట్. గుజరాత్ 162 ఆలౌట్, 81 ఆలౌట్.

సుప్రీం దృష్టికి పాండ్య, రాహుల్ వ్యవహారం

అంబుడ్స్‌మన్ నియామకానికి ఆదేశించాలని సీఓఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : బీసీసీఐ వెంటనే అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు అనుమతి ఇవ్వాలని క్రికెట్ పాలకుల కమిటీ సుప్రీం కోర్టును కోరింది. యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ భవితవ్యం తేల్చేందుకు అంబుడ్స్‌మన్ నియామకం అవసరమని పేర్కొంది. కాఫీ విత్ కరణ్ షోలో పాండ్య మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అతడితో పాటు రాహుల్ సైతం ఈ షోకు హాజరయ్యాడు. వీరిద్దరినీ బీసీసీఐ సస్పెండ్ చేసి విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎస్ఏ బొబ్డే, జస్టిస్ ఏఎం సప్రే నేతృత్వంలోని ధర్మాసనం సీనియర్ న్యాయవాది పీఎస్ నరసింహను బీసీసీఐ కేసులో గురువారం న్యాయ సహాయకుడు (అమికస్ క్యూరీ)గా నియమించింది. గతంలో పనిచేసిన సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణ్యం సహాయకుడిగా ఉండేందుకు అంగీకరించకపోవడంతో నరసింహను ఎంపిక చేసింది. పాండ్య, రాహుల్ భవిష్యత్తును అత్యవసరంగా నిర్ణయించేందుకు అంబుడ్స్‌మన్ నియామకానికి ఆదేశించాలని సీఓఏ న్యాయవాది పరాగ్ త్రిపాఠి కోర్టును కోరారు. కాగా వారం తర్వాత బీసీసీఐ కేసులో అన్ని అంశాలు విచారిస్తామని సుప్రీం తెలిపింది.

నా కుటుంబ సభ్యులు కూడా ఎంజాయ్ చేశారు : రిషభ్


న్యూఢిల్లీ : భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన టెస్టు సిరీస్‌లో రిషభ్ పంత్-టిమ్ పైన్‌ల మధ్య సాగిన స్లెడ్జింగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆసీస్ టెస్టు కెప్టెన్ టిమ్ పైన్ ఒకటంటే అందుకు మరింత ఘాటుగా రిప్లే ఇచ్చి సిరీస్‌కే హైలైట్‌గా నిలిచాడు రిషభ్. ఆస్ట్రేలియా క్రికెటర్లను మించిపోయి మరీ రిషభ్ పంత్ స్లెడ్జింగ్ చేయడం అభిమానుల్లో హాట్ టాపిక్ అయ్యింది. పైన్‌తో పాటు ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్‌లను సైతం తన స్లెడ్జింగ్‌తో తిప్పికొట్టాడు రిషభ్. అయితే ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన రిషభ్.. ఇప్పుడు కుటుంబ సభ్యులతో గడువుతున్నాడు. దీనిలో భాగంగా ఆసీస్ క్రికెటర్లపై స్లెడ్జింగ్ చేయడాన్ని రిషభ్ మరోసారి గుర్తు చేసుకున్నాడు. తన స్లెడ్జింగ్‌ను కుటుంబ సభ్యులు కూడా ఎంజాయ్ చేసినట్లు రిషభ్ తాజాగా చెప్పుకొచ్చాడు. నేను నా జట్టు కోసం ఏమి చేయాలో అది చేశా. నన్ను ఎవరైనా టార్గెట్ చేస్తే అంతే గట్టిగా బదులివ్వాలనుకున్నా. ఇక్కడ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమాన్ని కూడా మరిచిపోలేదు. నిబంధనలకు లోబడే స్లెడ్జింగ్‌కు పాల్పడ్డా. ఎక్కడా శృతి మించకుండానే నా నోటికి పనిచెప్పా. నా స్లెడ్జింగ్‌ను అభిమానులు కూడా ఇష్టపడ్డారు. నా స్లెడ్జింగ్‌ను ఇష్టపడ్డ వారిలో కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రధానంగా నా తల్లి, నా సోదరి సైతం నేను స్లెడ్జింగ్ చేసిన విధానాన్ని బాగా ఎంజాయ్ చేశారు అని రిషభ్ అన్నాడు. తాను ఆదర్శంగా తీసుకునే వారిలో ఆడమ్ గిల్‌క్రిస్, ఎంఎస్ ధోనిలు ముందు వరుసలో ఉంటారని పేర్కొన్న రిషభ్.. అలా అని వారిని తాను కాపీ కొట్టనని పేర్కొన్నాడు. తాను తనలా ఉంటూనే వారి నుంచి కొన్ని విషయాలను నేర్చుకుంటానని తెలిపాడు.

పంత్ ప్రేమలో పడ్డాడు!

ఆస్ట్రేలియా గడ్డపై శతకం నమోదు చేసిన తొలి భారత వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసింది. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపైనే ఓడించి చరిత్ర సృష్టించిన కోహ్లీ సేనలో పంత్ కీలక భూమిక పోషించాడు. టెస్టు సిరీస్ అనంతరం ఆసీస్, న్యూజిలాండ్‌లతో వన్డే సిరీస్‌ల నుంచి విశ్రాంతి లభించిన నేపథ్యంలో ఖాళీ సమయాన్ని పంత్ ఆస్వాదిస్తున్నాడు. అయితే.. పంత్ ప్రేమలో పడినట్లు తెలుస్తోంది. ఇటీవల పంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అమ్మాయితో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నాడు. నా సంతోషానికి కారణం నువ్వే.. నిన్ను సంతోషంగా ఉంచాలనుకుంటున్నా అని కామెంట్ పెట్టాడు. పంత్ షేర్ చేసిన ఫొటోలోని అమ్మాయి పేరు ఇషా నేగి. ఆమె ఎంటర్‌ప్రెన్యూర్, ఇంటీరియర్ డిజైనర్ కూడా. ఇషా కూడా అదే ఫొటోను షేర్ చేయడం విశేషం. మై మ్యాన్, మై సోల్‌మేట్, బెస్ట్ ఫ్రెండ్, లవ్ ఆఫ్ మై లైఫ్ అంటూ ఆమె క్యాప్షన్ ఇచ్చింది. దీంతో వీరిద్దరూ గాఢమైన ప్రేమలో ఉన్నారని అభిమానులు అంటున్నారు. ఆసీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో పంత్ మొత్తం 350 పరుగులు చేసి సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-


తెలుగుజాతి కీర్తిని
ప్రపంచ పటంపై రెప రెప లాడించిన
మీ రామనామం చిరస్మరణీయం
మళ్ళీ ఎప్పుడు పుడతావు నాన్నా!
నందమూరి జయకృష్ణ
నందమూరి మాధవి సాయికృష్ణ
నందమూరి లక్ష్మి హరికృష్ణ
నందమూరి మోహనకృష్ణ
నందమూరి బాలకృష్ణ
నందమూరి రామకృష్ణ
నందమూరి జయశంకర్‌కృష్ణ
గారపాటి లోకేశ్వరి
దగ్గుబాటి పురంధేశ్వరి
నారా భువనేశ్వరి
కంఠంనేని ఉమామహేశ్వరి
రామకృష్ణ హార్టికల్చరల్ సినీ స్టూడియోస్